RNI.No. APTEL/2014/57702 ESTD: 1999




www.voodayam.com

# వుదయం

గుంటూరు | 23-07-2026 గురువారం | సంపుటి : 13 | సంచిక : 131 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on






# కాంగ్రెస్ 'ఛలో లోక్‌భవన్' ఉద్రిక్తం

- దిల్లీ అరెస్టులపై మండిపడ్డ తెలంగాణ కాంగ్రెస్
- రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా హోరెత్తిన హైదరాబాద్
- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి
- మోదీ హయాంలో అరాచక పాలన విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్నారు
- రాహుల్ గాంధీ ప్రజాస్వామ్య పోరాటానికి అందరూ అండగా నిలవాలి

**హైదరాబాద్, జూలై 22 (వుదయం) :** దిల్లీలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నేతల అక్రమ అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రాజధాని హైదరాబాద్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు 'ఛలో లోక్‌భవన్' కార్యక్రమాన్ని నిర్వహించాయి. నెక్లెస్ రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున ర్యాలీగా తరలివెళ్లారు. ఈ నిరసన ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడితో పాటు మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ క్రికెటర్ అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న వెంటనే అప్రమత్తమైన పోలీసులు, మంత్రులతో పాటు కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.

**రాహుల్ పోరాటానికి దేశమంతా అండగా నిలవాలి:**
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వద్ద ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీల అరెస్టును తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. హనుమకొండ కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంత్రి కొండా సురేఖ మరియు ఇతర పార్టీ నేతలతో కలిసి ఆయన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ — "ప్రతిపక్ష నేతలను కర్కశంగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి విరుద్ధం. నీట్ పరీక్ష పత్రాల లీకేజీ వల్ల దేశంలోని కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడింది. ఈ దారుణాలపై ప్రశ్నించిన విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం అత్యంత దుర్మార్గం. కేంద్రంలోని మోదీ పాలనలో అరాచకం రాజ్యమేలుతోంది. ఈ అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి. దేశ విద్యావ్యవస్థను రక్షించుకునేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న ఈ పోరాటానికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలి" అని పిలుపునిచ్చారు.



## ఓటు లేకపోతే

# సంక్షేమ పథకాలు రావు

**కొడంగల్, జూలై 22 (వుదయం) :** భాజపా, బీఆర్ఎస్ పార్టీల వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే తనపై కుట్రలకు పాల్పడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ రెండు పార్టీలు వేర్వేరుగా కనిపించినప్పటికీ, తనను రాజకీయంగా దెబ్బతీయడమే వారి ఏకైక లక్ష్యమని మండిపడ్డారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా కొడంగల్‌లో బీఎల్ఏలతో నిర్వహించిన సమావేశంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ — "రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించేందుకు రోజుకు 18 గంటలు శ్రమిస్తున్నాం. కొడంగల్‌లో నన్ను నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేకనే కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచే ఓటర్ల పేర్లను తొలగించేందుకు కుట్రలు పన్నుతున్నారు. కొడంగల్‌లో నన్ను దెబ్బతీస్తే రాష్ట్రస్థాయిలో రాలేనని భావిస్తున్నారు. కాంగ్రెస్‌కు అండగా ఉండే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగించేందుకు చూస్తున్నారు" అని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.


**అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు కావాలి**
ప్రస్తుతం కొడంగల్‌లో 78 శాతం ఓట్ల నమోదు పూర్తయింది. మిగిలిన 22 శాతం ఓట్లను కూడా వెంటనే నమోదు చేయించాలి. బీఎల్ఓలు ప్రభుత్వాధికారులు కాగా, బీఎల్ఏలు పార్టీకి గుండెకాయ లాంటి కార్యకర్తలు. ఓటరు జాబితాలో పేరు లేకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే అవకాశం ఉండదు. అనుమానాస్పదంగా ఉన్న వివరాలపై సరైన ఆధారాలు చూపి ఓటర్లుగా నమోదు చేయించుకోవాలి. వచ్చే ఎన్నికల భవితవ్యం ఇప్పుడే ఖరారవుతోంది కాబట్టి, నియోజకవర్గంలో అర్హులైన ఏ ఒక్కరి ఓటూ తొలగించబడటానికి వీల్లేదు. ఈ నెలాఖరు నాటికి 100 శాతం ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియను పూర్తి చేయాలి. నాపై కుట్రలు పన్నుతున్న వారికి మీరే తగిన బుద్ధి చెప్పాలి" అని సీఎం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

**నీట్ పత్రాలను పల్లీబఠానీల్లా అమ్ముకున్నారు**
భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నాపత్రాలను అంగడి సరుకుగా మార్చి అమ్ముకుంటున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. దిల్లీలో ఏఐసీసీ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీల అక్రమ అరెస్టును నిరసిస్తూ కొడంగల్‌లోని అంబేద్కర్ కూడలి వద్ద చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ — "నీట్ ప్రశ్నపత్రాలను పల్లీబఠానీల్లా రూ.కోట్లకు అమ్ముకున్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి. ఈ కుంభకోణానికి బాధ్యులైన వారిని తక్షణమే అరెస్టు చేసి జైల్లో పెట్టాలి" అని డిమాండ్ చేశారు.

**గాడ్సే వారసులే భాజపా నేతలు!**
"పార్లమెంటరీ వ్యవస్థలో ప్రజా సమస్యలపై చర్చించడం ప్రజా ప్రతినిధుల బాధ్యత. పార్లమెంట్ ఉభయసభల్లో నీట్ పేపర్ లీకేజీ అంశంపై చర్చించాలని కాంగ్రెస్‌తో పాటు 'ఇండియా' కూటమి కోరినా ప్రభుత్వం అంగీకరించకపోవడం, లోక్‌సభ స్పీకర్ అనుమతించకపోవడం ప్రజాస్వామ్యానికే దురదృష్టకరం. దిల్లీ పోలీసుల ప్రవర్తన వల్ల రాహుల్ గాంధీ ముక్కు నుంచి రక్తం కారింది. ఈ దేశం కోసం రక్తం చిందించడంలో ఆయన కుటుంబం ఎప్పుడూ ముందుంటుంది. ఆనాడు మహాత్మాగాంధీ తెల్లదొరలతో పోరాడి స్వాతంత్ర్యం తెస్తే... ఆయనను పొట్టన పెట్టుకున్న గాడ్సే వారసులు ఈరోజు భాజపాలో ఉన్నారు" అని సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. అంతకుముందు, సీఎం నివాసం నుంచి కొడంగల్‌లోని అంబేద్కర్ చౌరస్తా వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించాయి.



## నౌకలపై దాడి చేస్తే ఇరాన్‌పై బాంబుల వర్షమే



**వాషింగ్టన్ :** హర్మూజ్ జలసంధిలో ఇరాన్ దుశ్చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అత్యంత తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఇకపై హర్మూజ్ జలసంధి గుండా వెళ్లే ఏదేని నౌకపై ఇరాన్ దాడికి తెగబడితే.. ఆ దేశంలోని కీలక వంతెనలు లేదా విద్యుత్ కేంద్రాలపై అమెరికా బాంబుల వర్షం కురిపిస్తుందని స్పష్టం చేశారు. అవసరమైతే ఇరాన్ రాజధాని టెహ్రాన్ లేదా దాని సమీప ప్రాంతాలలోనూ విరుచుకుపడతామని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన తన 'ట్రూత్ సోషల్' వేదికగా ఒక పోస్ట్ చేశారు.కాగా, అమెరికా మరియు ఇరాన్ మధ్య ఇప్పటికే ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. ఇరుదేశాలు పరస్పరం దాడులకు పాల్పడుతున్నాయి. ఇటీవల పికాక్స్ పర్వతాన్ని ధ్వంసం చేస్తామని ట్రంప్ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ కూడా తన దాడుల తీవ్రతను పెంచింది. పికాక్స్ పర్వతాన్ని సాకుగా చూపిస్తూ ఇరాన్ జోర్డాన్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయగా, ఆ దాడులను తమ సైన్యం సమర్థంగా తిప్పికొట్టిందని జోర్డాన్ సైనిక వర్గాలు వెల్లడించాయి.

## పదేళ్లలో 152 పేపర్ లీక్‌లు..

# 7.5 కోట్ల విద్యార్థులకు అన్యాయం



- దేశంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం
- ప్రజల కోసం ఎన్ని దెబ్బలకైనా సిద్ధం
- పార్లమెంట్‌లో నోరు నొక్కేస్తున్నారు
- వెనకడుగు వేసేదే లేదు
- కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ ధ్వజం

**న్యూఢిల్లీ, జూలై 22 (ఎఎంఎస్) :** కేంద్రంలోని భాజపా ప్రభుత్వం దేశంలో విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చివరి నిమిషంలో జరిగే ప్రశ్నపత్రాల లీకేజీల వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ అవకతవకలపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఆయన దిల్లీలో ప్రత్యేక విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ — "గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా ఏకంగా 152 పరీక్షల ప్రశ్నపత్రాలు లీకయ్యాయి. దీనివల్ల దాదాపు 7.50 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడింది. యువత ఎంత ఆవేదన చెందుతున్నా ఈ ప్రభుత్వానికి పట్టడం లేదు. ఇన్ని లీకేజీలు జరిగినా ఇప్పటివరకు శిక్షపడిన నేరస్థుల సంఖ్య సున్నా కావడం విచారకరం. విద్యారంగానికి రూ.1.4 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించామని చెప్పుకునే కేంద్రం.. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయించడం అత్యంత దారుణం. మధ్యతరగతి కుటుంబాలకు చదువు మోయలేని భారంగా మారింది" అని మండిపడ్డారు.

**యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నారు**
"దేశంలో యువతకు ఉద్యోగాలు లేక అలమటిస్తుంటే, కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల పరిశ్రమలు మూతపడుతున్నాయి. వ్యాపారులు బ్యాంకులను లూటీ చేస్తుంటే, మన దేశంలో చైనా ఉత్పత్తుల వినియోగం పెరిగిపోతోంది. విద్యార్థులంటే మనకు శత్రువులు కాదు.. వారే ఈ దేశ భవిష్యత్తు అనే విషయాన్ని కేంద్రం గుర్తుంచుకోవాలి" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రజల కోసం ఎన్ని దెబ్బలకైనా సిద్ధం!**
"విద్యార్థుల ఆందోళనలను మేం రాజకీయాల కోసం వాడుకోవట్లేదు. ప్రతిపక్ష నేతగా ప్రజల గళాన్ని వినిపించడం నా బాధ్యత. పార్లమెంట్‌లో ఈ అంశంపై మాట్లాడేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వకపోవడం వల్లే వీధుల్లోకి వచ్చి పోరాడాల్సి వచ్చింది. నిన్నటి నిరసనల్లో నాపై జరిగిన దాడి గురించి నేను బాధపడటం లేదు.. విద్యార్థులకు జరుగుతున్న అన్యాయం గురించే నా ఆవేదనంతా. పరీక్షల నిర్వహణ విధానంలో మూలమట్టంగా మార్పులు రావాలి. ప్రజల హక్కుల కోసం ఎన్ని దెబ్బలు తినేందుకైనా నేను సిద్ధంగా ఉన్నాను" అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

## యువతపై కేసులు ఎత్తేస్తేనే

# దీక్ష విరమిస్తా

**న్యూఢిల్లీ, జూలై 22 (ఎఎంఎస్) :** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో బాధ్యులను కఠినంగా శిక్షించాలంటూ సీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనకు మద్దతుగా పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష కొనసాగుతోంది. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన.. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లకు తాజాగా ఒక సుదీర్ఘ లేఖ రాశారు. ఆందోళనల్లో పాల్గొన్న యువతపై ఎలాంటి చట్టపరమైన చర్యలు గానీ, వేధింపులు గానీ ఉండవని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా హామీ ఇస్తేనే తాను దీక్ష విరమిస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా లేఖలో సోనమ్ వాంగ్‌చుక్ పేర్కొంటూ — "కేంద్ర మంత్రులు స్వయంగా ఆసుపత్రికి వచ్చి నన్ను పరామర్శించి, దీక్ష విరమించాలని కోరినందుకు ధన్యవాదాలు. పేపర్ లీక్ కారణంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు తగిన పరిహారం అందించడం, విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్‌ను పరిశీలించడం మరియు పార్లమెంటులో ఈ అంశంపై చర్చ జరిపేందుకు సానుకూలంగా స్పందించడం అభినందనీయం. ఆ తర్వాత వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 65 మంది ఎంపీలు కూడా నాకు లేఖ రాసి దీక్ష విరమించాలని కోరారు" అని తెలిపారు.



**నిరసనకారులకు రక్షణ కల్పిస్తేనే విరమణ!**
"నేను కూడా జీవించాలని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇంకా ఎంతో చేయాలని అనుకుంటున్నాను. అయితే ఏ విద్యార్థుల హక్కుల కోసమైతే ఈ ఉద్యమం మొదలైందో, వారి జీవితాలను ప్రమాదంలో పడేసి నేను వెనక్కి తగ్గలేను. ఈ నిరసనల్లో పాల్గొన్న యువతపై ఎటువంటి పోలీసు చర్యలు, చట్టపరమైన కేసులు, వేధింపులు ఉండవని ప్రభుత్వం హామీ ఇవ్వాలి. అలా హామీ లభిస్తేనే దీక్ష విరమించి, ప్రభుత్వంతో చర్చలకు రావాల్సిందిగా నిరసనకారులను కోరతాను. లేనిపక్షంలో నా నిరవధిక దీక్షను ఇలాగే కొనసాగిస్తాను. ఆందోళనకారులపై ఇకపై ఎలాంటి పోలీసు బలప్రయోగం ఉండదని ఆశిస్తున్నాను" అని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు.



# గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

- **జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. కృష్ణ**



**నాగర్ కర్నూల్, జూలై 22 (వుదయం బ్యూరో):**

గర్భవతులకు స్కానింగ్ చేసి లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి పరీక్షలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. కృష్ణ హెచ్చరించారు.బుధవారం నాగ ర్‌కర్నూల్ పట్టణంలోని ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లను డిఎంహెచ్ఓ డాక్టర్ కె. కృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ చేసిన స్కానింగ్ సెంటర్లలో గర్భవతుల రికా ర్డులు, ఫారంఎఫ్ లను పరిశీలించారు. స్కానింగ్ కోసం వచ్చిన గర్భవతులతో మాట్లాడి స్కానింగ్ ఎందుకు చేయించు కుంటున్నారని, ఏ డాక్టర్ రిఫర్ చేశారని, ప్రస్తుతం ఎన్నో గర్భం, పిల్లల సంఖ్య తదితర వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భంలో ఉన్న శిశువు లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం 1994 మరియు నిబంధనలు 1996 ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం, చేయడం నేరమని తెలిపారు. పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారికి, ప్రోత్సహించిన వారికి ప్రతి ఒక్కరికీ శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసి అబార్షన్ నిర్వ హించిన వైద్యులకు 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10,000 నుండి రూ.50,000 వరకు జరిమానా విధిస్తామని చెప్పారు. అవసరమైతే సంబంధిత డాక్టర్లపై మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేస్తామ న్నారు.ప్రతి ప్రైవేట్ ఆస్పత్రి నిర్వహకులు తాము అందించే సేవల ధరల పట్టికను తప్పనిసరిగా డిస్ప్లే చేయాలని డిఎంహె చ్ఓ సూచించారు.ఈ తనిఖీల్లో ప్రోగ్రాం అధికారి డాక్టర్ కె. రవికుమార్, ఉప జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాల్ చారి, డిపిఓ రేనయ్య, ఏపిఓలు బాల స్వామి, కొత్త నిరంజన్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# మిల్లర్లు సీఎంఆర్ వడ్ల బకాయిలు చెల్లించాల్సిందే



- **అదనపు కలెక్టర్ మధుమోహన్**

**గద్వాల జూలై 22 (వుదయం బ్యూరో)**

జిల్లాలోని రైస్ మిల్లర్లు 202223 రబీ సీజన్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరించిన వడ్లకు సంబం ధించిన బకాయిలను చెల్లించాల్సి ఉందని అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. బుధవారం ఐడిఓసిలోని తన ఛాంబర్ లో అదనపు కలెక్టర్ రైస్ మిల్లర్లతో సమా వేశమై మాట్లాడారు. మూడేళ్ల కిందట 36,814. 800 మెట్రిక్ టన్నుల వడ్లను రైతుల నుంచి సేకరించి జిల్లాకు చెందిన 33 మంది మిల్లర్లకు అప్పగించడం జరిగింద న్నారు. ఇందులో ఒక మిల్లర్ మాత్రమే పూర్తిగా ధాన్యానికి సంబంధిం చిన పూర్తి డబ్బులు చెల్లించారని, మిగతా వారు పూర్తిస్థాయిలో ఇవ్వలేదన్నారు. ఆ సీజన్ లో రైతుల నుంచి సేకరించిన వరి ధాన్యం చాలా వరకు నాణ్యత బాగోలేదనే విమర్శలు రావడంతో ప్రభుత్వం కొంత కాలానికి వేలంపాట ద్వారా అమ్మేందు కు నిర్ణయించిందన్నారు. వేలంపాటలో హక్కులు దక్కించుకున్న వ్యక్తి కొంత ధాన్యం మాత్రమే తీసుకోవడంతో మిగిలిన ధాన్యముకు సంబంధించిన బకాయిల ను మిల్లర్లు ప్రభుత్వానికి చెల్లించాలని ఆదేశాలు ఇవ్వగా చాలామంది మిల్లర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారన్నారు. ప్ర భుత్వం క్వింటాల్ కు రూ.2236 చొప్పున వడ్ల డబ్బులు చెల్లించాలని ఆదేశించగా, మిల్లర్లు రూ.1830 మాత్రమే చెల్లిస్తా మనడం సరికాదన్నారు. మిల్లర్ల వద్ద ఉన్న ధాన్యానికి సంబంధించిన బకాయిలను చెల్లించాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశం లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, మేనేజర్ విమల, ఎన్ ఫోర్స్ మెంట్ డిటి ప్రశాంత్, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రామలింగేశ్వర కామ్లే, తదితరులు పాల్గొన్నారు.

# ఆషాఢ మాసంలో మెహందీ వేడుకలు

- **సాంప్రదాయ పరిరక్షణకు మహిళల పిలుపు**



**సదాశివపేట, వు దయం :**

: ఆషాఢ మాసం సందర్భంగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా భావించే మెహందీ (గోరింటాకు) వేడు కలను వీరశైవ లింగాయత్ సమాజం ఎడ్ల బజార్ ఆధ్వర్యంలో ఘనంగా ని ర్వహించారు. ఈ సందర్భంగా వీరశైవ లింగాయత్ సమాజం ఎడ్ల బజార్ అధ్య క్షులు గాంధీగారాజు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు వేడుకలను సంప్రదాయ బద్ధంగా నిర్వహించడం ఆనందదాయక మన్నారు.మాజీ మున్సిపల్ చైర్పర్సన్, 26వ వార్డు కౌన్సిలర్ అపర్ణ శివరాజ్ పాటిల్ మాట్లాడుతూ, ఆషాఢ మాసంలో వర్షాకాలం ప్రారంభమయ్యే నేపథ్యంలో గోరింటాకు శరీరానికి చల్లదనాన్ని అం దించడంతోపాటు ఆరోగ్యపరంగా కూడా ఉపయోగకరమని ఆయుర్వేదంలో పేర్కొ న్నారని తెలిపారు. అలాగే ఇది చేతులకు అందాన్ని చేకూర్చడంతోపాటు మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తుందని అన్నారు. సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షురాలు అనిమిరెడ్డి అన్నపూర్ణ మా ట్లాడుతూ, మన సంస్కృతి, సంప్రదాయా లను భావితరాలకు పరిచయం చేస్తూ ఆషాఢ మాసంలో గోరింటాకు వేడుకలు ను ప్రతి కుటుంబం ఉత్సాహంగా నిర్వ హించాలని, సంప్రదాయ విలువలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అన్న పూర్ణ, లలిత, మంజుల, సావిత్రి, సర్వదా, జ్యోతి, కవిత, అనూష, సాధన, స్వరూప, శ్రీదేవి, రమ, సంధ్య, మల్లీశ్వరి, అర్చన, మల్లమ్మ, చాముంతి, శకుంతల, మీనా, శం కరమ్మ, వసంత, సిద్ధమ్మ, దేవి, అపర్ణ, అన్నపూర్ణ, నిర్మల, శీలా మహేశ్వరి, ఉమా, అరుణ, మంజుల, పద్మ, లత, అనురాధ, సుధారాణి, అఖిల, విద్య, ఇందిర తదితరు లు పాల్గొన్నారు.

# గౌడ జన హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడిగా బబ్బురు శ్రీనివాస్ గౌడ్ నియామకం

**కోహెడ, జూలై 22 (వుదయం ప్రతినిధి):**



గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కోహెడ మండలానికి చెందిన బబ్బురు శ్రీనివాస్ గౌడ్ ను కోహెడ మండల అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ నియామక పత్రాన్ని విడుదల చేసింది. గత కొన్ని సంవత్సరాలుగా గీత కార్మికు లు, గౌడ కులస్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, వారి హక్కుల సాధనకు కృషి చేస్తున్న బబ్బురు శ్రీనివాస్ గౌడ్ సేవలను గుర్తించిన రాష్ట్ర కమిటీ, ఆయనను ఈ కీలక బాధ్యతల కు ఎంపిక చేసినట్లు పేర్కొంది.సంఘం నియమ నిబంధనలకు లోబడి క్రమశిక్ష ణతో పనిచేస్తూ గీత కార్మికుల హక్కుల పరిరక్షణ, గౌడ సామాజిక వర్గ అభ్యున్న తి, అలాగే ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్యా, ఉద్యోగ రంగాల్లో గౌడలకు రా జ్యాంగబద్ధమైన వాటా సాధన కోసం ని స్వార్థంగా సేవలందించాలని రాష్ట్ర కమిటీ సూచించింది.రాష్ట్రంలోని గౌడ సామాజిక వర్గాన్ని పార్టీలకు అతీతంగా ఐక్యం చేసి హక్కుల సాధన దిశగా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యం తో ఈ నియామకం చేపట్టినట్లు కమిటీ వెల్లడించింది.ఈ నియామకం 2026 జూలై 22 నుంచి అమల్లోకి వచ్చి మూడు సంవత్సరాల పాటు కొనసాగుతుందని రాష్ట్ర కమిటీ తెలిపింది. బబ్బురు శ్రీనివా స్ గౌడ్ నియామకంపై గౌడ సంఘాల నాయకులు, గీత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా నూతనంగా నియమితు లైన కోహెడ మండల అధ్యక్షులు బబ్బురు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...

తనపై నమ్మకం ఉంచి కోహెడ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకత్వానికి హృదయపూర్వక కృత జ్ఞతలు తెలిపారు. ఈ పదవిని గౌరవంగా భావిస్తూ గీత కార్మికులు, గౌడ కులస్థుల హక్కుల సాధన కోసం మరింత అంకిత భావంతో పనిచేస్తానని అన్నారు. గౌడ సామాజిక వర్గానికి ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్యా, ఉద్యోగ రంగాల్లో రాజ్యాంగబద్ధమైన హక్కులు, అవకాశాలు కల్పించేందుకు నిరంతరం పోరాడతానని తెలిపారు. పార్టీలకు అతీతంగా గౌడ సమాజాన్ని ఐక్యం చేసి ప్రతి గీత కార్మికుడి సమస్యను రాష్ట్ర నాయ కత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.తనకు సహక రించిన ప్రతి నాయకుడికి, గౌడ సంఘాల ప్రతినిధులకు, గీత కార్మికులకు, కోహెడ మండల ప్రజలకు ధన్యవాదాలు తెలియజే స్తూ, అందరి సహకారంతో గౌడ సమాజ అభ్యున్నతే తన ప్రధాన లక్ష్యమని బబ్బురు శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

# వనమహోత్సవం సందర్భంగా ఇంటింటికి మొక్కల పంపిణీ

- **సర్పంచ్ అబ్దుల్ రషీద్**

**ఉర్కొండ న్యూస్, జూలై 22 వుదయం ప్రతినిధి:**



ప్రకృతి పరిరక్షణ, పచ్చని వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఊర్కొండపేట సర్పంచ్ అబ్దుల్ రషీద్ పిలుపునిచ్చారు.వనమహోత్సవంలో భాగంగా బుదవారం ఊర్కొండపేట గ్రామంలో గ్రామాన్ని పచ్చదనంతో కళక ళలాడించే లక్ష్యంతో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామం లోని ప్రతి ఇంటికి పండ్లు,నీడనిచ్చే మొ క్కలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . . . పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించడానికి విరివిగా మొక్కలు నాటాలని కోరారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటికి క్రమం తప్పకుండా నీరు పోస్తూ సంరక్షించాలని గ్రామస్తులకు సూచించా రు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రేపాని శ్రీనివాసులు,గ్రామ పంచాయతీ కార్యద ర్శి ఇబ్రాహీం, వార్డు సభ్యులు రషీదా బేగం ,రేష్మా బేగం,షబ్బీర్,రామాంజనేయులు, సహదేవ్,మహిళా సంఘం అధ్యక్షురాలు పార్వతమ్మ,బుక్ కీపర్ మాధవి,సిబ్బంది సంజన్న,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# చేగువేర జర్నలిస్టు యూనియన్ (సీజేయూ) సమావేశం లోతైన సమీక్ష

- **జర్నలిస్టుల భద్రత, హక్కులకై కీలక తీర్మానాలు"**

**కోహీర్, జులై 22 (వుదయం ప్రతినిధి ):**

జహీరాబాద్ పట్టణంలో బుధవారం రోజున చేగువేర జర్నలిస్టు యూనియన్ (సీజేయూ) రెండవ నియోజకవర్గ స్థాయి సమావేశం అత్యంత సమీక్షాత్మకంగా నిర్వహిం చబడింది. యూనియన్ జహీరాబా ద్ అధ్యకషుడు మక్తబాయి చందు కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమా వేశంలో నియోజకవర్గానికి చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టులు, కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను పం చుకున్నారు.సమావేశానికి సంబం ధించిన ప్రధానంగా

జర్నలిస్టుల సంక్షేమం & సామాజిక భద్రత: క్షేత్రస్థాయిలో రాత్రింబ వళ్లు పనిచేస్తున్న విలేకరులకు మరియు వారి కుటుంబాలకు తగిన ఆర్థిక, రక్షణ భద్రత కల్పించాలని యూనియన్ ఏకగ్రీవంగా నిర్ణయిం చింది.జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వేధింపులు, గుర్తింపు కార్డులు (అక్రె డిటేషన్లు), ఆరోగ్య కార్డుల (హెల్త్ కార్డ్స్) జారీలో జరుగుతున్న ఆలస్యం వంటి అంశాలపై సమగ్రంగా చర్చిం చారు.యూనియన్ సభ్యత్వాన్ని మరింత విస్తరించి జహీరాబాద్ పరి ధిలోని ప్రతి మండలానికి సీజేయూ కమిటీలను బలోపేతం చేయాలని తీర్మానించారు.అర్హులైన జర్నలి స్టులందరికీ ప్రభుత్వం తక్షణమే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయి విలేకరులకు చేరేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో కార్యద ర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు, ముఖ్య నాయకులు అనిల్ కుమార్ తదిత రులు పాల్గొన్నారు. ప్రతికూల పరిస్థి తుల్లో కూడా నిజాయితీగా పనిచేసే జర్నలిస్టులకు ఐక్యంగా మద్దతుగా నిలుస్తామని సీజేయూ ప్రతినిధులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# హెచ్చరిక బోర్డు కిందే చెత్త కుప్పలు

- **నిబంధనలు గాలికి!**

**సంగారెడ్డి, వు దయం :**

మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డుకే కొందరు చె త్తకుప్పలతో సమాధానం చెబుతున్నా రు. సంగారెడ్డి మున్సిపాలిటీ 36వ వార్డులో 'ఇక్కడ చెత్త వేయొద్దు.. వేస్తే రూ.5 వేల జరిమానా' అంటూ ఏర్పాటు చేసిన బోర్డు కిందే ప్లాస్టిక్, గృహ వ్యర్థాలను పడేస్తున్నారు. దీంతో అక్కడ భారీగా చెత్త పేరుకు పోయి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు, ఈగలు పెరిగి ప్రజారో గ్యానికి ముప్పుగా మారుతున్నా సంబంధిత అధికారులు పట్టించు కోవడం లేదని స్థానికులు ఆరోపిస్తు న్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకుని, చెత్తను వెంటనే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# ప్రతిఒక్కరు మొక్కలు నాటేందుకు ముందుకు రావాలి

- **మునిసిపల్ కమీషనర్ చంద్ర శేఖర్ రావు**

**అయిజ, జూలై 22 (వుదయం ప్రతినిధి):**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పురపాలక సంఘం పరిధిలోని గద్వాల రోడ్ నందు వన మహోత్స వంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంను మునిసిపల్ కమీష నర్ చంద్ర శేఖర్ రావు బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ పర్యావ రణ పరిరక్షణ కోసం, భూతాపం తగ్గి వర్షాలు విరివిగా కురవాలంటే మొక్కలు నాటే అవశ్యకత ఎంతో ఉందని, ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని, దీన్ని ప్రతీ ఒక్కరూ తమ తమ బాధ్య తగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బం దులు పడడం మనం గమనిస్తూనే ఉన్నామని, అందువలన మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని తెలిపారు. ఈ కా ర్యక్రమం లో మున్సిపల్ కౌన్సిలర్ సులోచనమ్మ, మద్దిలేటి, బిఆర్ఎస్ నాయకులు వెంకన్న గౌడ్, ఉప్పరి శ్రీను, మునిసిపల్ సీనియర్ అసిస్టెం ట్ సి లక్ష్మన్న, ఆఫీస్ స్టాఫ్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఆర్పీలు తది తరులు పాల్గొన్నారు.



# పీఎం విశ్వకర్మ యోజన ద్వారా పట్టణంలో కుట్టు మిషన్ల పంపిణీ

**నారాయణఖేడ్ జులై 23 (వుదయం):**

పి ఎం విశ్వకర్మ యోజన పథకం ద్వారా లబ్ధిదారులకు కుట్టు మిషన్ల పంపిణీ నిర్వహించారు. నారాయ ణఖేడ్ పట్టణంలో బుధవారం పట్టణ అధ్యక్షులు జి రాజశేఖర్ గౌడ్, కాంగ్టి మండలం అధ్యక్షులు

ప్రబరి పట్నం మాణిక్ చేతుల మీదుగా కుట్టుమిషన్లు

పంపిణీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా సంయుక్తగ వారు మాట్లా డుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2023 24 నుండి 202728సంవ త్సరం వరకు కొత్త కేంద్ర ప్రభుత్వ పథకం ప్రధానమంత్రి విశ్వకర్మ అనే పథకానికి 13వేల కోట్ల రూపా యలతో క్యాబినెట్ ఆమోదించడం జరిగిందన్నారు.పథకం గురు శిష్య పరంపరను లేదా వారి చేతులు పని ముట్లతో చేసే కళాకారులు, చేతివృ త్తులు, వారి ఉత్పత్తులు, సేవలను చేరుకోవడం, విశ్వకర్మలు దేశీయ, ప్రపంచ విశ్వ గొలుసులతో ఏకీకృ తమయ్యేలా చేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు.

పీఎం విశ్వకర్మ పథకం ద్వారా ఒక ఐడి కార్డ్ లక్ష రూపాయల నగదు మొదటి విడత, రెండు లక్షల రూపాయలు నగదు 5% వడ్డీతో రెండవ విడత అందించబడుతుంద న్నారు. ఈ పథకం దేశంలో ఉన్న టువంటి వెనుకబడిన తరగతులకు సంబంధించినటువంటి పథకం, నరేంద్ర మోడీ పాలనలో భారత దేశ విశ్వగురువుగా అవుతుంద ని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శిలు సాయందర్, వెంకట్ రెడ్డి, లోకేష్, సగనాకర్, సాయి పటేల్, నాగనాథ్, మేకల జ్ఞానేశ్వర్,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు విద్యార్థులలో మానసిక స్థైర్యాన్నిపెంపొందిస్తాయి

- **జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్**

**బిజినేపల్లి, జూలై 22 (వుదయం ప్రతినిధి) :**



క్రీడలు విద్యార్థులలో మానసిక స్థైర్యా న్ని, పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్, అన్నారు. బుధవారం నాడు మండల పరిధిలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రారం భమైన రాష్ట్ర స్థాయి నవోదయ విద్యా లయాల ఖోఖో క్రీడా పోటీలను ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించా రు. ఈ పోటీలు అండర్14, 17, 19 విభాగాల్లో జూలై 22 నుండి 24 వరకు జరగనున్నాయి.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు విద్యార్థుల మానసిక, శారీరక వికాసా నికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. క్రీడల్లో రాణించడం ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అల వడతాయని, ఇవి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి పునాదిగా ని లుస్తాయని పేర్కొన్నారు. గెలుపోటము లను సమానంగా స్వీకరిస్తూ ముందుకు సాగడమే నిజమైన క్రీడాస్ఫూర్తి అని సూ చించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన క్రీడాకారులు మరియు విద్యా ర్థులు తదితరులు పాల్గొన్నారు.

# బురద పొలంలో బీజేపీ 'స్నిగ్ధ' అస్త్రం!

- **పార పట్టిన యువ నేత... కదం తొక్కిన కర్షక లోకం!**
- **నిద్రమత్తు వదలని సర్కార్... రోడ్డెక్కుతామని డీకే స్నిగ్ధారెడ్డి హెచ్చరిక!**

**ధరూర్, జూలై 22 (వుదయం బ్యూరో):**



అధికార మదంతో అన్నదాతను ఆగం చేస్తున్న కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వానికి కాలం చెల్లింది... రైతు చెమట చుక్కే ఈ పాలకుల పతనానికి పునాది" అని బీజేపీ జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డా రు. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ఖమ్మంపాడు గ్రామంలో బుధవారం నాట్ల పండగ కాస్తా రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక నిరసన హోరుగా మారింది. ఆడంబరాలకు పోకుండా స్వయంగా బురద పొలంలోకి దిగిన ఆమె, రైతు కూలీలతో కలిసి వరి నాట్లు వేశారు. కూలీల కష్టాలను అడిగి తెలు సుకుంటూ, వారి ఆక్రోశాన్ని వింటూ రైతులకు కొండంత అండగా నిలిచారు.

**కేంద్రం ఇచ్చేది కొల్లగొడుతూ... రైతు నోట్లో మట్టి!**

పొలం గట్టు మీద నుండి రాష్ట్ర పాలనపై నిప్పులు చెరిగిన స్నిగ్ధారెడ్డి, సర్కార్ రైతు వ్యతిరేక విధానాలను తూర్పారబట్టారు:

పథకాల దారి మళ్లింపు: కేంద్రం లోని మోదీ ప్రభుత్వం అన్నదాతను రాజును చేసేందుకు వేల కోట్ల నిధులు పంపుతుంటే, ఇక్కడి ప్రభుత్వం ఆ పథకాలకు పేర్లు మార్చుకుని రైతులకు మొండిచెయ్యి చూపుతోందని ధ్వజ మెత్తారు. సకాలంలో రాని అరకొర సాయం: వానలు లేక సాగు ఆలస్యమై రైతులు అప్పుల ఊబిలో కూరుకుపో తుంటే, ప్రభుత్వం కంటితుడుపు చర్య లతో కాలయాపన చేస్తోందని మండిప డ్డారు.

**డిమాండ్లు డేట్‌లైన్... లేకుంటే సచివాలయం ముట్టడి!**

రైతాంగాన్ని ముంచేస్తున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే దిగిరాకపోతే ఉద్య మాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించా రు: నాణ్యమైన విత్తనాలు, ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను తక్షణమే అరికట్టాలి. చివరి ఆయకట్టు వరకు సాగునీరు విడుదల చేసి పండిన పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయాలి.

రైతు భరోసా బాసట నిధులను ఎలాంటి షరతులు లేకుండా రైతుల ఖాతాల్లో జమ చేయాలి. నాయకులంటే మైకుల ముందు ఉపన్యాసాలు దంచడం కాదు, తమలా బురదలోకి దిగి కష్టాలను పం చుకోవడ మేనని ఖమ్మంపాడు రైతులు డీకే స్నిగ్ధారెడ్డి చొరవను కొనియాడారు.

# పట్టణ బి.ఎల్.ఎ.లతో (సర్) సమీక్షా సమావేశం

**కోహీర్, జులై 22 (వుదయం ప్రతినిధి ):**



మాజీ మంత్రివర్యులు, జహీరాబాద్ ఇంచార్జ్ డా. ఏ. చంద్రశేఖర్ ఆధ్వర్యం లో కోహీర్ పట్టణంలోని భారత్ ఫంక్షన్ హాల్‌లో కోహీర్ మండల మరియు పట్టణ బూత్ లెవెల్ ఏజెంట్ల (బి ఎల్ ఎ ) ఎస్. ఐ. ఆర్.(స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించబడింది.నియోజకవర్గంలో నమోదవుతున్న ప్రతి అర్హులైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడం.

ఫారమ్‌ల భర్తీ ప్రక్రియను సక్రమంగా, వేగంగా పూర్తి చేయడం.

స్థానిక ప్రజల్లో ఓటు హక్కు నమోదుపై చైతన్యం తీసుకురావడం.

"ప్రతి అర్హులైన ఓటరు తన వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవడం ప్ర జాస్వామ్యాన్ని బలోపేతం చేసే బాధ్యత. ప్రతి ఇంటికీ చేరుకుని ఎస్. ఐ. ఆర్.ప్రక్రి యను వేగవంతం చేయాలి, ఎవరూ ఈ అవకాశాన్ని కోల్పోకుండా చూడాలి."

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కల గకుండా అవసరమైన సహాయం అందిస్తూ నమోదు ప్రక్రియను త్వరితగ తిన పూర్తి చేయాలని పార్టీ నాయకులు, కోఆర్డినేటర్లు, బి. ఎల్. ఎ.లు మరియు కార్యకర్తలకు సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో జహీరాబాద్ నియో జకవర్గంలో ఎస్. ఐ. ఆర్.కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశం లో ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ కార్యక్రమం లో

రామలింగారెడ్డి (ఆత్మ కమిటీ చైర్మన్) మహమ్మద్ గౌస్ (అసెంబ్లీ కోఆర్డినేటర్) అశోక్ కుమార్ (కోహిర్ మునిసిపల్ చైర్మన్)సువర్ణమల్లన్న పాటిల్ (కోహిర్ మండల అధ్యక్షులు)ముజాఫ్ఫార్ హుస్సేన్ (పట్టణ అధ్యక్షులు) ఆర్షద్ అలీ (బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు)శంషీర్ అలీ (మాజీ పట్టణ అధ్యక్షులు) అస్మా తబస్సుమ్ (నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు)హన్నన్ జావీద్ (మునిసిపల్ వైస్ చైర్మన్)

కౌన్సిలర్లు, సర్పంచులు, బి. ఎల్. ఎ.లు, కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్త లు. భారీ ఎత్తున పాల్గొన్నారు.

# కొలువుల వేట వద్దు... ఉపాధి 'బాట' పట్టండి!

- **పుట్టగొడుగుల సాగుతో బంగారు భవిష్యత్తు**
- **విద్యార్థులకు అదనపు కలెక్టర్ నర్సింగరావు పిలుపు**

**గద్వాల జూలై 22 (వుదయం బ్యూరో)**



విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల పైనే ఆధారపడకుండా స్వయం ఉపాధి పొందేందుకు వివిధ సంస్థల ఆధ్వ ర్యంలో నిర్వహించే పలు శిక్షణ కార్య క్రమాలు ఉపయోగపడతాయని, సద్వి నియోగం చేసుకోవాలని అదనపు కలె క్టర్ నర్సింగరావు అన్నారు. బుధవారం గద్వాలలోని ప్రభుత్వ ఎంఏఎల్డి డిగ్రీ కళాశాలలో ఆర్ సెటీ (రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూ ట్) ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై విద్యార్థులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి అదనపు కలె క్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారం భించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని యువత ఆర్థికంగా అభి వృద్ధి చెందాలని సూచించారు. పుట్ట గొడుగుల పెంపకం తక్కువ పెట్టుబ డితో అధిక ఆదాయాన్ని అందించే ఉపాధి మార్గమని తెలిపారు.ఈ కా ర్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ షేక్ కలందర్, ఎల్‌డీఎం శ్రీనివాసరావు, డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# గణంగా ఆల్ ఇండియా పర్వార్డ్ బ్లాక్ పార్టీ జిల్లా స్థాయి విస్తృత సమావేశం

**నారాయణఖేడ్, జులై 23 (వుదయం):**



సంగారెడ్డి జిల్లా:నారాయణఖేడ్ పట్టణం లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా స్థాయి విస్తృత సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కమ్యూనిస్టు పార్టీలకు చెందిన సుమారు 60 మంది కార్యకర్తలు ఎస్. చిరంజీవి ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ( ఎ ఐ ఎఫ్ బి)పార్టీలో చేరారు. వారికి పార్టీ రాష్ట్ర నాయకులు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.అదే కార్యక్రమంలో ఎస్. చిరంజీవిని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కన్వీనర్‌గా నియమిస్తూ పార్టీ నాయకత్వం బాధ్యతలు అప్పగించింది .ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోజి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బి. రాములు యాదవ్ పాల్గొని పార్టీ బలో పేతంతో పాటు పలు ప్రజా సమస్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోజి రెడ్డి మాట్లాడుతూ,తె లంగాణలో పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింత బలోపేతం చేయాలని,ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి బి.రాములు యాదవ్ మాట్లాడుతూ, నిట్ పేపర్ లీక్ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల ఆశించిన స్థాయిలో పాలన అందించడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కా రానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని,సంక్షేమం,అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్ర మంలో జిల్లా కన్వీనర్ ఎస్. చిరంజీవి, లక్ష్మణ్ ,మోచప్ప, గణేష్, సోయల్ ,శోభ, పండరి, పాటు పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహణ

**- ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ ముందడుగు – ముషీరాబాద్ డిపో మేనేజర్ జె. విజయ్**



**ముషీరాబాద్, జూలై 22(వుదయం)**

ముషీరాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో నివసించే ప్రజలు, నిత్య ప్రయాణికులు ఎదుర్కొంటున్న రవాణా సంబంధిత సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు "డయల్ యువర్ డీఎం" కార్యక్రమాన్ని గురువారం (23072026) నిర్వహిస్తున్నట్లు ముషీరాబాద్ డిపో మేనేజర్ జె. విజయ్ తెలిపారు.ఈ కార్యక్రమం మధ్యాహ్నం 12.00 గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. బస్సు సర్వీసులు, సమయపాలన, రూట్లు, ప్రయాణికుల సౌకర్యాలు, సేవలకు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులు, సూచనలు, సలహాలను ప్రజలు నేరుగా డిపో మేనేజర్ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను తెలియజేయాలని కోరుతూ, 99592 26418 నంబర్‌కు కాల్ చేసి సంప్రదించాలని డిపో మేనేజర్ జె. విజయ్ విజ్ఞప్తి చేశారు.— ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై మెరుగైన రవాణా సేవలందించడమే "డయల్ యువర్ డీఎం" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.

# అమీన్‌పూర్‌లో రూ.16.53 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి



**అమీన్ పూర్ జులై 22, (వుదయం ),**

పటాన్ చేరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ మరియు బీరంగూడా ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.16.53 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు & భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి గారు శంకుస్థాపన చేశారు.సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలోని అమీన్‌పూర్ సర్కిల్-47లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో TGIIC చైర్మన్ డీసీసీ ప్రెసిడెంట్ నిర్మల జగ్గారెడ్డి, పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ , MLC ANJI REDDY , మంత్రి గారితో కలిసి పాల్గొన్నారు.ఈ నిధులతో బీరంగూడ (వార్డు-270), అమీన్‌పూర్ (వార్డు-271) ప్రాంతాల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ), వర్షపు నీటి కాలువలు, ఇంకుడు గుంతలు, స్మశానవాటిక అభివృద్ధి, సెంట్రల్ మీడియన్ నిర్మాణం తదితర మౌలిక సదుపాయాల పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.ఇందులో భాగంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా తగు జాగ్రత్తలు తీసుకొని పనులను వేగా వంతంగా పూర్తి చేయాలనీ అధికారులను కోరారు

# జూలై 24న రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌కు NSUI పిలుపు



**- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి – NTA రద్దు చేయాలని డిమాండ్**

**చేవెళ్ల, జూలై22(వుదయం)**

దేశవ్యాప్తంగా విద్యార్థులపై జరుగుతున్న అన్యాయాలు, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలకు నిరసనగా జూలై 24న తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని NSUI చేవెళ్ల మండల కమిటీ సభ్యులు శాంసన్, ఎండీ సమీరుద్దీన్, ఇర్ఫాన్ బుధవారం పిలుపునిచ్చారు.ఎన్ఎస్ యుఐ, తెలంగాణతో పాటు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్ యు, ఏఐఎఫ్ డిఎస్, ఏఐఎస్ బి,ఏఐపిఎస్ యు, తదితర విద్యార్థి సంఘాలు ఈ బంద్‌కు మద్దతు ప్రకటించినట్లు తెలిపారు.లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విద్యార్థుల హక్కుల కోసం చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా తెలంగాణ విద్యార్థులు బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై పలు డిమాండ్లు చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని (ఎన్ టిఏ) ను రద్దు చేయాలని, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో (ఎన్ఎస్ యుఐ) చేవెళ్ల మండల కమిటీ సభ్యులు ఫాహాద్, అల్తాఫ్, అర్షద్, ఇమ్రాన్, కిరణ్, మనోజ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ అక్రమాలపై కాంగ్రెస్ ధర్నా



**- ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి: కాట శ్రీనివాస్ గౌడ్**

**అమీన్ పూర్ , జులై 22, (వుదయం ),**

కాంగ్రెస్ అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్ష నాయకుల అరెస్టులను ఖండిస్తూ, నీట్ (NEET) పరీక్షలో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బీరంగూడ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసుల లాఠీచార్జ్‌ను ఆయన తీవ్రంగా ఖండించారు.అలాగే, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకుల గొంతును అణచివేసే చర్యలను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు పదవి అవసరం లేదు



**రామచంద్రపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్**

**రామచంద్రపురం**

రామచంద్రురం డివిజన్ ఓల్డ్ రామచంద్రపురం పాషా నగర్ కాలనీ వద్ద ఉన్న నాలా ను సీఎంసీ ఇరిగేషన్ విభాగ అధికారులు డిఈఈ విజయ భాస్కర్,ఏఈఈ లింగస్వామి,రెవిన్యూ విభాగ జిపిఒ కుమార్ గార్లతో కలిసి పర్యటించి,నాలా ను లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన రామచంద్రపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ గారు.

వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ముందుగానే అప్రమత్తం అయి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులతో కలిసి పర్యటించి,చెరువు నుంచి నాలా లోకి వెళ్ళే నీరు పక్కనే పాషా కాలనీ అనే ప్రాంతంలో చాలా మంది బీద ప్రజలు నివసిస్తున్నారు అని,వర్షాకాలంలో చెరువు నుంచి నాలా లోకి వెళ్లే నీరు ఎక్కువగా వచ్చే ఇళ్లలోకి చేరి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అని తెలుసుకుని,పర్యటించి అక్కడ సమస్యల గురించి తెలుసుకుని వెంటనే నాలా ను శుభ్రం చేయించి,సాఫీ గా నీరు పొయ్యేవిధంగా చూడాలి అని,ఇళ్లలోకి నీరు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.వారితో స్థానిక బస్తీ వాసులు,మహిళలు ఎంతగానో హర్షం వ్యక్తం చేశారు.మా సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారం చేస్తున్న తాజా మాజీ కార్పొరేటర్ గారికి ధన్యవాదాలు అని తెలిపారు.

# జిహెచ్ఎంసి ఎన్నికల్లో ఎస్ సి రిజర్వేషన్ సీట్లు పెంచాలి



**- బిజెపి ఎస్ సి మోర్చా నాయకులు**

**కుత్బుల్లాపూర్, జులై 22,(వుదయం ప్రతినిధి ),**

భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ ఆధ్వర్యంలో లోక్ భవన్ లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాని కలిసి రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో ఎస్సీ జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వుడు స్థానాలను 8% నుంచి 15% పెంచాలని వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సానుకూలంగా స్పందించి దీనిపై విచారణ చేసి ఎస్సీ సమాజానికి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ వారి బృందం తరపున వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు, బిజెపి మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమారి బంగారు శృతి, బిజెపి రాష్ట్ర కార్యదర్శులు కొప్పు భాష, భరత్ ప్రసాద్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు దాసి నాగరాజు, ఓరగంటి చంద్రశేఖర్, బిజెపి ఎస్సీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రవీణ్ బాగ్ది, పి. సునీల్ కుమార్, తొండ రవి, తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల విషయంలో ఎవర్నీ ఉపేక్షించేదిలేదు



**బాచుపల్లి సీఐ పి డి నాయుడు**

**బాచుపల్లి, జులై 22,(వుదయం ప్రతినిధి ),**

కాక్రోచ్ జనతా పార్టీ హింసాత్మక నిరసనలు నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా అనుమతి లేకుండా భారత ప్రధాని నరేంద్ర మోడీ నివాసం వద్ద ఆకస్మిక ధర్నా చేసినందు వల్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీలను, రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో హింసాత్మక కార్యకలాపాలను ప్రేరేపించే కాంగ్రెస్ పార్టీ భారతీయ జనతా పార్టీ కార్యాలయాల మీద దాడి చేసే అవకాశం ఉందని ఇంటలిజెన్స్ ఇచ్చిన సమాచారం మేరకు ఎటువంటి హింసాత్మక సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలు కాపాడాలనే ఉద్దేశంతో బాచుపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ పిడి నాయుడు, అడ్మిన్ ఎస్ఐ శ్రీధర్, బాచుపల్లి పోలీస్ సిబ్బంది ప్రగతినగర్ లోని బిజెపి కార్యాలయానికి రక్షణ కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల ఉల్లంఘన జరిగితే వెంటనే మాకు తెలియజేయాలని. లా అండ్ ఆర్డర్ విషయంలో ఎవరిని ఉపేక్షించబోమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతినగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు నరేంద్ర చౌదరి, ఓబీసీ మోర్చా కార్యదర్శి జక్కుల రవి యాదవ్, జిల్లా నాయకులు రచ్చ చక్రధర్, మందపాటి శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిలు సాయి కిషోర్, మదన్ గౌడ్, కార్యదర్శి శనిగల లక్ష్మి, మహిళా మోర్చా బిజెపి అధ్యక్షురాలు మోక్ష శ్రీ, ఓబీసీ మోర్చా బిజెపి అధ్యక్షులు తూమాటి శంకర్రావు, యువ మోర్చా అధ్యక్షుడు దొడ్డ పవన్, లీగల్ సెల్ కన్వీనర్ చంద్రశేఖర్, ప్రాంతీయ

నాయకులు వెంకట సాయి, ఎస్టి మోర్చా నాయకులు రఘు తదితరులు పార్టీ కార్యాలయంలో సిఐ పిడి నాయుడు, అడ్మిన్ ఎస్ఐ శ్రీధర్, ఎస్సై విగ్నేష్, బాచుపల్లి పోలీస్ బృందం తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పటిష్టం చేయాలి: సీపీఎం డిమాండ్



**చేవెళ్ల, జూలై22(వుదయం)**

చేవెళ్ల మున్సిపాలిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత పటిష్టం చేసి రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ బుధవారం డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆయన అక్కడి పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా అల్లి దేవేందర్ మాట్లాడుతూ...ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్, ఫార్మసిస్టు విధుల్లో అందుబాటులో లేకపోవడం ఆందోళనకరమని అన్నారు.ఫార్మసిస్టు స్థానంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో రోగులకు మందుల పంపిణీ చేయడం సరికాదని విమర్శించారు.వైద్యులు, సిబ్బంది సమయపాలనతో విధులకు హాజరై రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలని కోరారు.గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పేద ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నందున వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి, వైద్య సేవల బలోపేతానికి ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాహుల్ అరెస్టు, నీట్ అక్రమాలపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా



**రామచంద్రాపురం,**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్ష నాయకుల అరెస్టును నిరసిస్తూ, నీట్ పరీక్షలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బీరంగూడ చౌరస్తాలో గురువారం ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఖండించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకుల గొంతును అణచివేసే చర్యలు తగవని అన్నారు.ధర్నాలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# అర్హులకు ఎండమావి... అనర్హులకు 'డబుల్' పండుగ!



*** గద్వాల మండలం గోనుపాడులో 'నీడ' లేని పేదలకు తీరని అన్యాయం**
*** పక్కా ఇళ్లు, పలుకుబడి ఉన్నవారికే కట్టబెట్టారని గ్రామస్థుల తిరుగుబాటు**
*** కంటితుడుపు పరిశీలనలతో 'గూడు' చెదిరిన నిరుపేదల ఆవేదన**
*** రీ-సర్వే చేసి బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు హెచ్చరిక**

**గద్వాల జూలై 22 (వుదయం బ్యూరో)**

పేదవాడి సొంతింటి కలను నిజం చేయాల్సిన ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'డబుల్ బెడ్‌రూమ్' పథకం... అధికారుల నిర్లక్ష్యం, పారదర్శకత లేని ఎంపిక విధానంతో కట్టుతప్పింది. గద్వాల మండలం గోనుపాడు గ్రామంలో ఇళ్ల కేటాయింపు ప్రక్రియ తీవ్ర రచ్చకెక్కింది. పూరి గుడిసెల్లో, అద్దె కొంపల్లో కాలం వెళ్లదీస్తున్న నిజమైన నిరుపేదలను నడిరోడ్డుపై నిలబెట్టి... ఆర్థికంగా స్థిరపడిన శ్రీమంతులకు, పక్కా భవనాలు ఉన్నవారికే 'డబుల్' కానుకలు కట్టబెట్టారన్న ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. 'అర్హత' ఉంటే సరిపోదా?... క్షేత్రస్థాయిలో శూన్యం! గ్రామంలో అన్ని అర్హతలూ ఉండి, సొంత నీడ లేక ఆశగా ఎదురుచూసిన పేదలకు చివరికి మిగిలింది నిరాశే. అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన కేవలం కాగితాలకే పరిమితమైందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. రాజకీయ ప్రాబల్యం... అక్రమ కేటాయింపులు: క్షేత్రస్థాయిలో నిజంగా ఇల్లు ఉందా? లేదా? అన్నది పరిశీలించకుండానే జాబితాలు సిద్ధం చేశారని బాధితులు మండిపడుతున్నారు. లక్ష్యం పక్కదారి: నిరుపేదలకు ఆత్మగౌరవంతో కూడిన నివాసాన్ని అందించాలన్న సంక్షేమ ఆశయాన్ని... క్షేత్రస్థాయి యంత్రాంగం అభాసుపాలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తరతరాలుగా సరైన నీడలేక కష్టాలు పడుతున్నాం. ఇల్లు వస్తుందని దండం పెట్టి అడిగాం. కానీ, ఇప్పటికే మేడలు ఉన్నవారికే మళ్లీ ఇళ్లు ఇచ్చారు. మా పొట్ట కొట్టి అనర్హులకు దారాదత్తం చేస్తే ఊరుకునేది లేదు!"— బాధితుల ఆక్రోశం అధీారులకు డెడ్‌లైన్... పునఃసమీక్షించాల్సిందే! గోనుపాడు గ్రామస్థులు ఈ అక్రమాలపై అధికారుల తీరును తీవ్రంగా తప్పుబడుతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఈ క్రింది చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు: పారదర్శక రీసర్వే: గతంలో జరిపిన ఎంపిక జాబితాను తక్షణమే రద్దు చేసి, గ్రామసభ సమక్షంలో సమగ్ర విచారణ జరపాలి. అనర్హుల రద్దు అర్హులకు హక్కు: అనర్హులకు చేసిన కేటాయింపులను రద్దు చేసి, నిజమైన పేద కుటుంబాలకు వెంటనే ఇళ్లను మంజూరు చేయాలి. ప్రజాధనంతో నిర్మించిన ఇళ్లను అర్హులకు కాకుండా అర్హత లేనివారికి కట్టబెడితే నిరసనను మరింత ఉధృతం చేస్తామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు

# నకిలీ డీఏపీ ఎరువుల ముఠా గుట్టురట్టు



**- 2,900 బస్తాల అక్రమ వ్యాపారం.. 9 మందిపై కేసు నమోదు**

**నాగర్ కర్నూల్, జూలై 22 (వుదయం బ్యూరో):**

జిల్లాలో నకిలీ డీఏపీ ఎరువుల ముఠా గుట్టును పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు రట్టు చేశారు. 2,900 నకిలీ డీఏపీ బస్తాల అక్రమ వ్యాపారం వెలుగులోకి రాగా, ఈ కేసులో తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. మహదేవునిపేటలో 110 నకిలీ డీఏపీ బస్తాలు, అమ్మాపల్లిలో 80 బస్తాలు, వెల్గొండలో 185 బస్తాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రైతుల వద్ద భారీగా నకిలీ ఎరువులు ఉన్నట్లు గుర్తించారు.విచారణలో రంగారెడ్డి జిల్లా లోని తయారీ కేంద్రం నిర్వహిస్తున్న ప్రధాన నిందితుడు ఉన్నట్లు తేలింది. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నకిలీ ఎరువుల సరఫరాలో పలువురు మధ్యవర్తుల పాత్ర ఉందని పోలీసులు గుర్తించారు. జిల్లాలోని పలు మండలాలకు ఈ నకిలీ డీఏపీ సరఫరా చేసినట్లు విచారణలో వెల్లడైంది.బుధవారం డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ బుర్రి శ్రీనివాసులు మీడియా సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. రైతులు ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణాల్లోనే ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. ఎరువులు కొనుగోలు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని అన్నారు. నకిలీ ఎరువులకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే వ్యవసాయ శాఖ లేదా పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పూర్ణచందర్ రెడ్డి, సిఐ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# మల్లన్న రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవానికి ఆహ్వానాలు

*** యాదవ, కురుమ సంఘాల నాయకులకు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వాన పత్రాల అందజేత**

**దౌల్తాబాద్, జూలై 22 (వుదయం):**

మల్లన్న రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఈనెల 26న జరగనున్న నేపథ్యంలో మండల బీజేపీ నాయకులు ఏర్పాట్లను వేగవంతం చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఆదేశాల మేరకు దౌల్తాబాద్ మండల పార్టీ అధ్యక్షులు దేవుడి లావణ్య నరసింహారెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని ప్రజాప్రతినిధులు, యాదవ, కురుమ సంఘాల నాయకులకు ఆహ్వాన పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా దౌల్తాబాద్ గ్రామ సర్పంచ్‌కు, యాదవ సంఘం అధ్యక్షులు గణేష్ యాదవ్‌కు, కొనయపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌కు, ఆయా గ్రామాల యాదవ సంఘాల ప్రతినిధులకు ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రాలను అందించారు. అలాగే దీపాయంపల్లి గ్రామంలోని యాదవ, కురుమ సంఘాల నాయకులను కలిసి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరుతూ ఆహ్వానం పలికారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







**ఎవరేమన్నా.. నా పని నేను చేసుకుంటూ వెళతా...**

"క్రికెట్లో కొనసాగుతున్నంత వరకూ నాపై విమర్శలు వస్తూనే ఉంటాయి. అరంగేట్రం చేసినప్పటి నుంచీ నన్ను అందరూ ఎన్నో రకాల మాటలు అంటూనే ఉన్నారు. నేను క్రికెట్లో కొనసాగుతున్నంత వరకు విమర్శలు వస్తూనే ఉంటాయి. కానీ వాటితో పోరాడటం కాకుండా పరుగులు సాధించడంపై దృష్టి పెడతాను. జట్టు విజయంలో భాగమయ్యేందుకు ప్రయత్నిస్తా. నా దేశానికి ప్రాతినిధ్యం వహించడం, బ్యాటుతో నా కర్తవ్యాన్ని నిర్వర్తించడమే నా పని. కెరీర్ ఆరంభం నుంచీ అదే చేస్తున్నా. ఇక ముందూ అదే చేస్తా."

**-రోహిత్ శర్మ, భారత స్టార్ క్రికెటర్**

## వేమన పద్యం

వేషభాష లెరిగి కాషాయవస్త్రముల్
గట్టగానె ముక్తి గలుగబోదు
తలలు బోడులైన తలుపులు బోడులా
విశ్వదాభిరామ! వినుర వేమ!



# సంపాదకీయం

## సమర్థులను కాపాడుకోవాలి

గగన్‌యాన్, చంద్రయాన్4 లాంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు సంసిద్ధమవుతున్నవేళ ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)లో సీనియర్ శాస్త్రవేత్తల వరస స్వచ్ఛంద రాజీనామాలు, ఉద్యోగ విరమణల నిర్ణయాలు దేశం మొత్తాన్ని కుదిపేస్తున్నాయి. ఇలా సీనియర్ల రాజీనామాలు ఇస్రోలో కొత్తేమీ కాదు. కానీ, ఒకేసారి నూట ఇరవై మంది, అది కూడా 'ఏ' గ్రూప్ శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు రాజీనామాలు చేయడం మాత్రం కచ్చితంగా ఇదే మొదటిసారి. వీరంతా ఎందుకు రాజీనామాలు చేశారు? అసలు ఇస్రోలో ఏం జరుగుతోంది? ఈ పరిణామాలు దేనికి సంకేతం? ఇవి ఇప్పుడు అందరిని వేధిస్తున్న ప్రశ్న.

నిజానికి 2020 వరకు అంతరిక్ష రంగానికి సంబంధించిన అన్ని విషయాల్లోనూ ఇస్రో ఆధిపత్యమే కొనసాగేది. కానీ 2023లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "భారత అంతరిక్ష విధానం" ఈ రంగాన్ని సమూ లంగా మార్చేసింది. ప్రయివేటు రంగానికి తలుపులు బార్లా తెరవడంతో అనేక స్టార్టప్‌లుపుట్టగొడుగుల్లా పుట్టు కొచ్చాయి. ఉపగ్రహాల తయారీ, రాకెట్ల నిర్మాణం, భూమి నుంచి అంతరిక్ష కార్యకలాపాలను పరిశీలించే కేంద్రాల నిర్వహణలో కార్పొరేట్ కంపెనీల పాత్ర గణనీయంగా పెరిగింది. ప్రయివేటీకరణ వల్ల ఇస్రోపై భారం తగ్గుతుందనే కుంటిసాకులు చెప్తున్నప్పటికీ, అసలు సవాలు అది కాదు. ఈ ప్రయివేటురంగ సంస్థలు అనుభవజ్ఞులైన ఇస్రో శాస్త్రవేత్తలకు భారీ వేతనాలు, మెరుగైన సదుపాయాలు కల్పించి తమ వైపు తిప్పు కుంటున్నాయి. దీనిపై కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రి జితేంద్రసింగ్ స్పందిస్తూ "ఎంతో మంది వెళ్తుంటారు.. వస్తుంటా రు" అని ఒక్క మాటలో తేల్చేశారంటే కేంద్ర ప్రభుత్వ వైఖరి ఎలా ఉందో స్పష్టమవుతుంది. అంతరిక్ష రంగాన్ని ప్రయివేటు సంస్థలకు, దేశీవిదేశీ పెట్టుబడి శక్తులకు తెరిచి ఉంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయాలు ఇస్రో స్వయం ప్రతిపత్తిని దెబ్బతీశాయి. లాభాపేక్షే పరమావధిగా పనిచేసే ప్రయివేటు కార్పొరేట్ సంస్థలు, ఇస్రోలో తయారైన మేధోసంపత్తిని భారీ ప్యాకేజీలతో తమ వైపు తిప్పుకుంటున్నాయి. ప్రభుత్వ రంగంలో శాస్త్రవేత్తల శ్రమకు తగిన గుర్తింపు, సరైన వేతనాలు, పరిశోధనలకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులను ఉద్దేశపూర్వకంగానే తగ్గించడం వెనుక ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర దాగి ఉంది. ప్రభుత్వ రంగాన్ని బలహీనపరిచి, ఆ తర్వాత "నిర్వహణ సాధ్యం కావడం లేదు" అనే మిషతో ప్రయివేటుకు అప్ప గించే క్రమబద్ధమైన దోపిడీ వ్యూహం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది.

భద్రత, సార్వభౌమత్వంతో ముడిపడి ఉన్న అంతరిక్ష రంగాన్ని కేవలం లాభనష్టాల కోణంలో చూడటం చారిత్రక తప్పిదమవుతుంది. ప్రయివేటీకరణ వల్ల తాత్కాలికంగా నిధులు సమకూరినట్టు అనిపించినా, దీర్ఘ కాలంలో అది దేశ స్వయం సమృద్ధిని దెబ్బతీస్తుంది. జాతీయ ప్రయోజనాల కంటే కార్పొరేట్ లాభాలు ముఖ్యం కాదనే సత్యాన్ని పాలకులు గుర్తించి, అంతరిక్ష రంగంలో ప్రయివేటీకరణ దూకుడుకు బ్రేకులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ వరుస రాజీనామాలు దేశ సార్వభౌమత్వానికి, ప్రజాస్వామ్య ఆర్థిక వ్యవస్థకు కేంద్ర పాలకులు చేస్తున్న ద్రోహాన్ని కండ్లకు కడుతున్నాయి. అనుభవజ్ఞులు వెళ్లిపోతే వారి స్థానాలు భర్తీ చేయడం అంత సులభం కాదు. రాజీనామాల నేపథ్యంలో ప్రభుత్వం ఎదుర్కోవలసిన పెద్ద సవాలిదే. అంతరిక్ష రంగంలో ప్రయివేటు రంగం పాత్ర పెరగాలన్నది ప్రభుత్వ విధానం. ఉపగ్రహాలు, రాకెట్ల తయారీ, భూమ్మీద నుంచి అంతరిక్ష వ్యవహారాలను పరిశీలించే కేంద్రాలు ప్రయివేటు రంగంలో పెంచాలన్నది ప్రభుత్వ ఆలోచన. అనుభవజ్ఞులైన, సామర్థ్యం గల శాస్త్రవేత్తలు ఇస్రో వదిలి వెళ్ల కూడదంటే వారి ఉద్యోగాల్లో ఎదుగుదలకు తగిన అవకాశాలు కల్పించాలి. పరిశోధన చేయడానికి ఎక్కువ స్వేచ్ఛ ఇవ్వాలి. విధాన నిర్ణయాల్లోనూ తగిన స్వతంత్రత ఉండాల్సిందే. ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించాలన్న ధ్యాస ప్రభుత్వానికి ఉంటే ఇవన్నీ ఆశించవచ్చు. ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం అయినప్పుడు వీటన్నింటికీ అవకాశం ఎక్కడ ఉంటుంది? రక్షణ విభాగంలోనే ప్రయివేటు రంగానికి పెద్దపీట వేస్తున్న దశలో ప్రభుత్వ రంగ వ్యవస్థల పరిరక్షణకు ప్రాధాన్యం ఉంటుందనుకోలేం. అయితే గగన్‌యాన్, చంద్ర మండలం నుంచి నమూనాల సేకరణ, చంద్రయాన్4 లాంటి భారీ కార్యక్రమాలు ఉన్నప్పుడు ఆ లక్ష్యాలు సాధించడం ఎలా అన్నది అసలు సమస్య. ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహిం చడమంటే ప్రభుత్వ రంగం పీక నొక్కేయడం కాకూడదు. కానీ ప్రయివేటు రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలన్న ఆతృతలో ప్రభుత్వమే పనిగట్టుకుని ప్రభుత్వ రంగ సంస్థలను బలిపెట్టిన ఉదంతాలు కొల్లలుగానే ఉన్నాయి. గగన్‌యాన్ అంటే మానవులు ఉండే అంతరిక్ష పరిశోధనలు, అంతరిక్షంలో మన పరిశోధనా కేంద్ర నిర్మాణం లాంటివి ఉదాత్తమైన లక్ష్యాలే. అవి సాధ్యం కావాలంటే ఇస్రోలో ఉన్న సమర్థులను కాపాడుకోవడానికి తగిన ఆలోచన ప్రభుత్వానికి ఉందా అనేదే అసలు ప్రశ్న.

**రచనలు పంపండి**

ఉదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# భారత జాతీయోద్యమ పిత

బాలగంగాధర తిలక్ (జూలై 23, 1856 ఆగష్టు 1, 1920) స్వరాజ్య పోరాటంలో పాల్గొన్న తొలితరం త్యగమూర్తులతో బాల గంగాధర తిలక్ అగ్రగణ్యులు. ఆయనను భారత జాతీయోద్యమ పితగా పేర్కొంటారు. తిలక్ జాతీయోద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించాడు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలను ఉద్యమంలో పాల్గొనేటట్లు చేయడంలో ఆయన పాత్ర మరిచి పోలేనిది. భరత జాతిని స్వాతంత్ర్య సమరోత్సాహంతో జాగృత మొనర్చిన మహానేత లోకమాన్య తిలక్. అందుకే ఆయనను భారత దేశంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రేగిన అశాంతికి మూల కారకుడుగా భావిస్తారు.

బాలగంగాధర తిలక్ 1856 జూలై 23వ తేదీన మహారాష్ట్ర రాష్ట్రంలోని రత్నగిరిలో మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి గంగాధర్ రామచంద్ర తిలక్ సంస్కృత పండితుడు, ఉపాధ్యాయుడు. బాల్యంలో తిలక్ చాలా చురుకైన విద్యార్థి. ప్రత్యేకించి గణిత శాస్త్రంలో విశేష ప్రతిభ కనబరచేవారు. చిన్నప్పటి నుంచి అన్యాయం ఎక్కడ జరిగినా సహించని గుణమాయనది. నిజాయితీతో బాటు ముక్కుసూటి తనం ఆయన సహజ గుణం. కళాశాలకు వెళ్ళి ఆధునిక విద్య నభ్యసించిన తొలితరం భారతీయ యువకుల్లో ఆయనొకరు. ఆంగ్ల విద్యను అందుకున్న తొలి తరం భారతీయులలో అగ్రగణ్యులు. ఆంగ్ల విద్య ప్రభావంతో భారతీయులు అనుభవిస్తున్న బానిసత్వం గురించి తెలుసుకున్న వర్గంలో కూడా తిలక్ అగ్రగణ్యులే.తిలక్ కు పదేళ్ళ వయసున్నప్పుడు అతను తండ్రికి రత్నగిరి నుంచి పుణెకు బదిలీ అయింది. ఇది తిలక్ జీవితంలో పెనుమార్పు తీసుకు వచ్చింది. ఆయన అక్కడ ఆంగ్లోవెర్నాక్యులర్ పాఠశాలలో చేరి కొందరు ప్రసిద్ధి చెందిన ఉపాధ్యాయుల వద్ద విద్యనభ్య సించారు. ఐతే పూణెకు వచ్చిన కొంతకాలానికే అతను తన తల్లిని, పదహారేళ్ళ వయసులో తన తండ్రిని కోల్పోయారు. మెట్రిక్యు లేషన్ చదువు తున్నప్పుడే సత్యభామ అనే పదేళ్ళ అమ్మాయితో పెళ్ళయింది. మెట్రిక్ పాసయ్యాక అతను దక్కన్ కళాశాలలో చేరారు. 1877లో అతను గణిత శాస్త్రంలో ప్రథమ శ్రేణిలో పట్టభద్రు డయ్యారు. ఆ తర్వాత తన చదువును కొనసాగించి ఎల్ ఎల్ బి పట్టా కూడా పొందారు. తిలక్ 1890లో కాంగ్రెస్ లో చేరారు. కానీ త్వరలోనే కాంగ్రెస్ మితవాద రాజకీయాలపై నమ్మకం పోయింది. స్వరాజ్యం కోసం పోరాటమే సరైన మార్గమని అతను నమ్మారు. అప్పటి వరకు కాంగ్రెస్ ప్రతి సంవత్సరం డిసెంబరు చివరి వారంలో మూడు రోజులపాటు సమావేశమై బ్రిటిష్ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాల గురించి మెతక వైఖరి తో చర్చించడానికే పరిమితం అయ్యేది. మితవాదుల ధోరణి సమ్మతంగా ఉండేది కాదు. విన్నపాలు, వినతులు వలన ప్రభుత్వాన్ని లొంగదీయలేవని తిలక్ సిద్ధాంతం. దాదాభాయ్ నౌరోజీ అంటే ఎంతో గౌరవం. భారత పేదరికం బ్రిటిష్ పుణ్యమేనన్న నౌరోజీ సిద్ధాంతాన్ని సమర్థించడమే కాకుండా, తన పత్రికలో ఎంతో ప్రాచుర్యం కల్పించారు. అలాగే గోఖలే చాలా అంశాలలో తిలక్ కు విభేదాలు ఉండేవి. కాంగ్రెస్ నేతల విధానాలపై తిలక్ ఘాటైన విమర్శలు చేశారు: "మీరు సంవత్సరాని కొకసారి మూడు రోజులపాటు సమావేశమై కప్పల మాదిరి బెకబెకలాడడం వల్ల ప్రయోజనం లేదు." అని, "అసలు కాంగ్రెస్ సంస్థ అడుక్కునే వాళ్ళ సంఘం (బెగ్గర్స్ ఇన్‌స్టిట్యూషన్)" అన్నారు. కాంగ్రెస్ సమావేశాలను 3డే తమాషాగా అభివర్ణించారు. "స్వరాజ్యం నా జన్మహక్కు. దాన్ని నేను పొంది తీరుతాను." అని తీర్మానించారు. 1889లో బొంబాయి కాంగ్రెస్ మహాసభకు ప్రతినిధిగా హాజరైన తిలక్ అక్కడనే లాలాలజ్‌పత్ రాయ్, బిపిన్‌చంద్ర పాల్‌ను కలుసు కున్నారు.



ఆ ముగ్గురు మహా నేతలు భారతదేశ చరిత్రలో లాల్‌బాల్‌పాల్‌గా ప్రసిద్ధులైనారు. వారితోనే కాంగ్రెస్‌లో అతివాదుల శకం ప్రారంభమైంది. 1907లో మహారాష్ట్రలోని సూరత్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ చీలిపోగా, మితవాదులు కాంగ్రెస్ పై తమ పట్టును నిలబెట్టు కున్నారు. అతివాదులుగా పిలవబడే తిలక్, ఆయన మద్దతు దారులు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేశారు. తిరిగి 1916లో లక్నోలో జరిగిన సమావేశంలో అంతా ఒకటైనారు. అదే సమావేశంలో కాంగ్రెస్ కు, ముస్లిం లీగుకు మధ్య లక్నో ఒప్పందం కుదిరింది.

తిలక్ పాశ్చాత్య విద్యా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అది భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని అగౌరవ పరచి భారతీయ విద్యార్థులను చిన్న బుచ్చే విధంగా ఉందని, ప్రజలకు మంచి విద్యను అందించడం ద్వారానే వాళ్ళను మంచి పౌరులుగా మార్చ వచ్చనే ఉద్దేశం ఆయనది. ప్రతి భారతీయునికి భారతీయ సంస్కృతి గురించి, భారత దేశపు ఔన్నతాన్ని గురించి బోధించాలని ఆయన ఆశయం. అదే ఆశయంతో అగార్కర్, విష్ణుశాస్త్రి చిప్లుంకర్ లతో కలిసి "దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ"ని స్థాపించారు. తర్వాత తాను నడిపిన పత్రికలు "మరాఠా (ఆంగ్ల పత్రిక)", "కేసరి (మరాఠీ పత్రిక)" లలో మొద్దు నిద్రపోతున్న భారతీయులను మేల్కొల్పడానికి పదునైన భాషలో బ్రిటిష్ పాలనలోని వాస్తవ పరిస్థితుల గురించి వివరంగా రాశారు. బాల్య వివాహాలను నిరసించి వితంతు వివాహాలను స్వాగతించారు. జాతీయ స్ఫూర్తిని రగల్చడానికి వీలున్న ఏ అవకాశాన్నీ ఆయన వదిలి పెట్టలేదు. మొట్టమొదటి సారిగా శివాజీ ఉత్సవాలను, గణపతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం ద్వారా ప్రజలను సమీకరించడం, వారిని జాతీయోద్యమం వైపు నడిపించడం మొదలు పెట్టారు. తన పత్రికల్లో ప్రజలను రెచ్చగొట్టే రాతలు రాసి నందుకు 1897లో ఆయనకు ఒకటిన్నరేళ్ళు కారాగారశిక్ష పడింది. విడుదల య్యాక అతను స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించారు. 1906లో దేశద్రోహం నేరం క్రింద ఆయనకు ఆరేళ్ళు ప్రవాసశిక్ష విధించారు. కారాగారంలో ఉన్నప్పుడే అతను "గీతారహస్యం" అనే పుస్తకం రాశారు. తిలక్ చరిత్ర కారుడు కూడా. ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వచ్చారని ఆయన అభిప్రాయం. భగవద్గీతపై ఆయన రచించిన భాష్యం 856 పేజీల గీతా రహస్యం అనే ఉద్గ్రంథం మొదటి కూర్పు ఆరు వేల ప్రతులు ఒక పక్షంలోనే అమ్ముడు పోయాయంటే అది ఎంత ప్రజాభిమానమైన గ్రంథమో స్పష్టం అవుతున్నది. అన్ని భారతీయ భాషల్లో దాని అనువాదాలు వెలువడ్డాయి.1916 ఏప్రిల్ లో హోంరూల్ లీగ్‌ని స్థాపించి దాని లక్ష్యాలను వివరిస్తూ మధ్య భారత దేశంలో గ్రామ గ్రామాన తిరిగారు. అనీబిసెంటు అదే సంవత్సరం సెప్టెంబర్‌లో మొదలు పెట్టి హోంరూల్ ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేసింది. ఆ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతున్న సమయంలో ఒక కోర్టుకేసులో ఆయన లండనుకు వెళ్ళవలసి వచ్చింది. అప్పుడే, అంటే 1917 ఆగస్టులో అప్పటి సెక్రటరీ ఆఫ్ స్టేట్ మాంటేగు "బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగమైన భారత దేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పరచ డానికి వీలుగా అన్ని పాలనాంశాల్లో భారతీయులకు అధిక ప్రాధాన్యాన్ని వ్వడమే ప్రభుత్వ విధానమని బ్రిటిష్ ప్రభుత్వం తరపున ప్రకటించారు.

**బాలగంగాధర తిలక్ 1856 జూలై 23వ తేదీన మహారాష్ట్ర రాష్ట్రంలోని రత్నగిరిలో మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి గంగాధర్ రామచంద్ర తిలక్ సంస్కృత పండితుడు, ఉపాధ్యాయుడు. బాల్యంలో తిలక్ చాలా చురుకైన విద్యార్థి. ప్రత్యేకించి గణిత శాస్త్రంలో విశేష ప్రతిభ కనబరచేవారు. చిన్నప్పటి నుంచి అన్యాయం ఎక్కడ జరిగినా సహించని గుణమాయనది. నిజాయితీతో బాటు ముక్కుసూటి తనం ఆయన సహజ గుణం.**

బ్రిటిష్ ప్రభుత్వ నిజాయితీని నమ్మిన అనీబిసెంటు ఆ ప్రకటనతో ఉద్యమాన్ని ఆపేయగా, ఆ ప్రకటన స్పష్టంగా లేక పోవడంతో, తిలక్ విభేదించగా, ఇద్దరు నాయకులదీ చెరొక దారి కావడంతో హోంరూల్ ఉద్యమం చల్లబడి పోయింది. కానీ ప్రజల్లో తిలక్ రగిలించిన స్ఫూర్తి మాత్రం కొనసాగింది. అందుకే 1920లో ఆగస్టు 1వ తేదీన తిలక్ మరణం తో జాతీయోద్యమం చుక్కాని లేని నావ అవుతుందని చాలా మంది భయపడ్డారు.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

## ప్రశ్నల తుఫాను

కన్నీటి నిప్పుల కడలి దాటి,
కాలమే తన దిశను
మార్చుకున్న వేళ -
మౌనానికి పడిన తాళాలను
యువతరం ఒక్క ప్రశ్నతో
విరిచేసింది!

ఇక అక్షరం సిరా చుక్క
కాదు,
అన్యాయపు శిలాఫలకాలపై
కాలం చెక్కిన ఉలిపోటు!

ప్రతి ప్రశ్న -
భవిష్యత్తు గుండెలో
మొలిచిన విత్తనం.
సమాధానం కోసం
ఎదురుచూసిన ప్రతి క్షణం -
ఒక కొత్త యుగానికి
గర్భధారణ!

లీకైన ప్రశ్నాపత్రాల కింద
నలిగిపోయింది కేవలం
పరీక్ష కాదు,
తరతరాల విశ్వాసం!
ఆ విశ్వాసపు బూడిదలో
నుంచే
ప్రతిఘటన తన మొదటి
శ్వాస తీసుకుంది!

వీధులు నేడు కేవలం
రహదారులు కావు,
ప్రజాస్వామ్య హృదయం
కొట్టుకునే ధమనులు!
ప్రతి అడుగు -
రాజ్యాంగపు నిశ్శబ్ద
పుటలను
మళ్లీ చదివిస్తున్న
అక్షరస్పందన!

జంతర్ మంతర్ గాలి నిండా
నినాదాలే కాదు,
చరిత్ర తన పాత తీర్పును
సవరించుకుంటున్న శబ్దం
వినిపిస్తోంది!

అధికారం
ఇనుప గుమ్మాల వెనుక
దాక్కోవచ్చు;
కానీ ప్రజల సంకల్పానికి
తాళం వేసిన ఏ రాజ్యమూ
చరిత్రలో నిలబడలేదు!

పార్లమెంటు గోడల కంటే
ప్రజల మనస్సాక్షి
బలమైనది!
చట్టాల కంటే ముందే
న్యాయం పుడుతుంది;
ఆ న్యాయం పుట్టిన చోటే
ప్రజాస్వామ్యం తన అసలు
రూపాన్ని పొందుతుంది!

గుర్తుంచుకో -

యువతరం ప్రశ్నగా మారిన
రోజు
కాలం దిశ మారుతుంది!
ప్రజలు మేల్కొన్న రోజు
సింహాసనాలు
కూలిపోతాయి!

బూడిదలో దాచిన
నిప్పురవ్వలను
ఎవరూ శాశ్వతంగా కప్పి
ఉంచలేరు,
అవి ఒక రోజు
ఆకాశాన్నే శాసించే జ్వాలలై
లేస్తాయి!



యం డి. ఉస్మాన్ ఖాన్
9912580645



**భారతదేశంలో బౌద్ధధమ్మాన్ని హిందూమతం వ్యతిరేకించ లేదు. పైగా, బౌద్ధంలోని అనేక సిద్ధాం తాలను, సంప్రదాయాలను వశపరు చుకుంది. ఆచరించింది. అయితే, బౌద్ధం లోని 'మానవత్వం' అనే విషయాన్ని మాత్రం పూర్తిగా వ్యతిరేకించింది. -డా. బి.ఆర్. అంబేద్కర్.రథయాత్ర హిందువుల చాతుర్వర్ణ వ్యవస్థకు పూర్తి వ్యతిరేకం! దేవుణ్ణి ఊరేగించేప్పుడు రథయాత్రలో రకరకాల ప్రజలు కలిసిమెలిసి నడవాల్సి ఉంటుంది. అలా చేయడం అగ్రవారికి ఇష్టం ఉండదు. పైగా దేవుడు మైల పడిపోతాడని వారి భావన. నిమ్న జాతుల వారికి ఆలయప్రవేశం అనుమతించక పోవడమనే విషయం మనం ఇక్కడ గుర్తుంచుకోవాలి. అయినా కూడా విధిలేక, బౌద్ధ ప్రభావాన్ని తోసిపుచ్చలేక దాన్ని తమలో కలుపుకునే పథకంలో భాగంగా మనువాదులు రథయాత్రను, దేవుడి ఊరేగింపు (సేవ)లను అంగీకరించారు. ఆ బౌద్ధ సంప్రదాయాన్ని అనుసరించి కొనసాగిస్తున్నారు**

## ఆలోచించాల్సిన విషయం

భారతదేశంలో బౌద్ధధమ్మాన్ని హిందూమతం వ్యతిరేకించ లేదు. పైగా, బౌద్ధంలోని అనేక సిద్ధాం తాలను, సంప్రదాయాలను వశపరు చుకుంది. ఆచరించింది. అయితే, బౌద్ధం లోని 'మానవత్వం' అనే విషయాన్ని మాత్రం పూర్తిగా వ్యతిరేకించింది. డా. బి.ఆర్. అంబేద్కర్.రథయాత్ర హిందువుల చాతుర్వర్ణ వ్యవస్థకు పూర్తి వ్యతిరేకం! దేవుణ్ణి ఊరేగించేప్పుడు రథయాత్రలో రకరకాల ప్రజలు కలిసిమెలిసి నడవాల్సి ఉంటుంది. అలా చేయడం అగ్రవారికి ఇష్టం ఉండదు. పైగా దేవుడు మైల పడిపోతాడని వారి భావన. నిమ్న జాతుల వారికి ఆలయప్రవేశం అనుమతించక పోవడమనే విషయం మనం ఇక్కడ గుర్తుంచుకోవాలి. అయినా కూడా విధిలేక, బౌద్ధ ప్రభావాన్ని తోసిపుచ్చ లేక దాన్ని తమలో కలుపుకునే పథకంలో భాగంగా మనువాదులు రథయాత్రను, దేవుడి ఊరేగింపు (సేవ)లను అంగీకరించారు. ఆ బౌద్ధ సంప్రదాయాన్ని అనుసరించి కొనసాగిస్తున్నారు.ఇంతకూ బౌద్ధ సంప్రదాయంలో రథయాత్ర ఊరేగింపు ఎలా వచ్చాయి? ప్రస్తుతం ఒరిస్సా, పూరీలో ఉన్న జగన్నాథుని ఆలయంలో శాశ్వత విగ్రహం ఏదీ లేదు. వాస్తవంగా అది ఒకప్పుడు 'దంతపురం'. ఆ పేరు ఎలా వచ్చిందంటే ఆ ఆలయంలో బుద్ధుని దంత ధాతువులు (అవశేషం) భద్రపరచడం వల్ల వచ్చింది. ఈ విషయం సర్కార్ అనే చరిత్ర పరిశోధకుడు ఆధారాలతో నిరూపించాడు.చైనా యాత్రికుడు ఫాహియాన్ ఐదవ శతాబ్దం(C.E)లో భారత దేశం వచ్చినపుడు అక్కడ జరిగిన రథయాత్రను చూశాడు. దాని వివరాలన్నీ రాసుకున్నాడు. అలాగే తిరుపతిలో కూడా బుద్ధుని రథయాత్రను షాహియాన్ నమోదు చేశాడు. "నాలుగు చక్రాలున్న రథంపై బుద్ధుని విగ్రహాన్ని పెట్టి, దానికి రెండు వైపులా బోధిసత్వుల ప్రతిమల్ని పెట్టి, రథాన్ని ఏడు రత్నాలతోనూ, సిల్కు జెండాలతోనూ అలంకరించిన తరువాత ఊరేగింపు బయలుదేరేది. మొదట రాజు ఆ విగ్రహానికి నమస్కరించేవాడు. అతని పట్టమహిషి, ఇతర చెలికత్తెలు కలిసి, పూలు జల్లుతూ నడిచేవారు. నాలుగవ నెలలో నాలుగవ రోజున రథయాత్రను ప్రారంభించి, పద్నాలుగు రోజుల పాటు కొనసాగేది" అని రాసుకున్నాడు. దీనికితోడు ఆ తరువాత వచ్చిన హ్యూయెన్ త్సాంగ్ ఇదే విషయాన్ని మరింత విపులంగా నమోదు చేశారు. ఆరామంలో సీనియర్ భిక్షువులు ప్రతిరోజూ బుద్ధ విగ్రహాన్ని సుగంధ భరిత ద్రవాలతో శుభ్రపరిచి, వస్త్రాలు కప్పేవారు. ఫాహియేన్, హూన్ త్సాంగ్‌లు భారతదేశంలో పర్యటించినప్పటి అనుభవాలు, రథయాత్రల గురించిన వివరాలు వారి నోట్స్‌లో ఉన్నాయి. బౌద్ధానికి జన్మస్థానం భారతదేశం కాబట్టి, ఈ దేశంలో పర్యటించి, విషయాలు తెలుసుకుందామని, ఇక్కడ దొరికిన పుస్తకాలు తమ భాషలోకి అనువదించుకుందామని వచ్చారు.

ఫాహియాన్ 399412(C.E)లో రెండవ చంద్రగుప్తుడు పాలిస్తున్న సమయంలో వచ్చాడు. సుమారు పదమూడేండ్లు ఈ దేశంలో ఉండి పర్యటించాడు. ఆ తర్వాత సుమారు రెండు వందల పద్దెనిమిదేండ్ల తరువాత 630645(C.E) లో హర్షుడు పాలిస్తున్న సమయంలో హూన్ త్సాంగ్ వచ్చి పదిహేనేండ్లపాటు ఈ దేశంలో ఉన్నారు. వీళ్లిద్దరు పర్యటించి, వారి అనుభవాలు నమోదు చేయడం వల్ల మనకు మన మూలాలు తెలుసుకునే అవకాశం దొరికింది. మనువాదుల కట్టుకథల్ని పక్కకు తోసి, వాస్తవాల్ని గ్రహించే అస్కారం లభించింది.ఏమైనా, ఈ చైనా యాత్రికులిద్దరూ తిరుపతి - పూరీలలో జరిగిన నాటి బౌద్ధ రథయాత్రలలో స్వయంగా పాల్గొన్నవారు. అందువల్ల అనుమానాలకు తావులేదు. రథయాత్ర, బౌద్ధులు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించుకునే సంప్రదాయం. కొద్ది మార్పులతో వైదికులు దీన్ని స్వీకరించారు. సేవపేరుతో దేవుడి విగ్రహాలు ఊరేగించడం కూడా దీనిలోంచి వచ్చిందే! బుద్ధుని శరీర ధాతువులను బంగారు, వజ్ర, వైడూర్యాలతో అలంకరించిన వెడల్పాటి పాత్ర (కరండా)లో ఉంచి, దానిపై ఛత్ర చామరాలుంచి, బుద్ధఘోషతో ఊరేగించేవారు. ఇందులో బౌద్ధ ఉపాసకులతో పాటు రాజులు, రాణులు, ఆస్థానంలోని ఉన్నతస్థాయి వ్యక్తులు అందరూ పాల్గొనేవారు. ప్రజలు దర్శించుకునేందుకు అవకాశమివ్వాలన్నది దీని ముఖ్య ఉద్దేశం.ఈ ప్రాచీన బౌద్ధ సంస్కృతి ఇప్పటికి బౌద్ధ దేశాలలో ఘనంగా నిర్వహించుకుంటున్నారు. మనుషుల్ని విభజించడం బౌద్ధంలో లేదు, గనక ప్రజలందరినీ కలుపుకు పోవడానికి రథయాత్రలు నిర్వహించేవారు. దీన్ని వైదిక మతస్తులు విధి లేక తప్పనిసరిగా అనుకరించాల్సివచ్చింది.హిందూ దేవుళ్లకు సంబంధించిన రథయాత్రలు మన దేశంలో 1011 (C.E) శతాబ్దాలలో మాత్రమే ప్రారం భమయ్యాయి. ఎల్.ఎం. జోషి, నందలాల్, ఎన్. దత్ వంటి పరిశోధకులు తిరుపతి కొండల గురించి పరిశోధించి చాలా విషయాలు నమోదు చేశారు. వీరిలో కొందరు తిరుపతి కొండల్ని పొటల్క పర్వతమని అన్నారు. ఎల్.ఎం. జోషి ఇచ్చిన వివరణలో పొటల్క పర్వతం అవలోకేతేశ్వరుని ప్రీతి పాత్రమైన ఆవాసం అన్నాడు. హిందూ భక్తులు పాశుపత, తీర్థక, మహేశ్వరుడితో పోల్చారు. 'అవలోకిత' అంటే అనేక రూపాల్లో కనిపించే శివుడని ప్రచారం చేశారు, ఇవన్నీ మధ్యలో వచ్చిన అభిప్రాయాలు. మొదట ఈశ్వరుడి దేవాలయంగా ఆ తరువాత వేంకటేశ్వరుడి ఆలయంగా మారిన విషయం మనకు తెలుసు. వెనకటి ఈశ్వరుడే వేంకటేశ్వరుడిగా మారాడు. ఏది ఏమైనా తిరుపతి ఒకప్పటి బౌద్ధ క్షేత్రమని నిరూపణ అయింది. మూలం బౌద్ధానిది. అక్కడి విగ్రహం బుద్ధుడిది. కాదనడానికి ఆస్కారం లేదు. TIRUPATI BALAJI WAS A BUDDHIST SHRINE BY DR.K. JAMANA DAS పుస్తకంలో చాలా వివరాలు దొరుకుతాయి.పొటల్క అంటే నిటారైన అందమైన పర్వతాలు అని హ్యూయెన్ త్సాంగ్ కూడా రాశాడు. దక్షిణ భారత దేశపు పర్య టనలో భాగంగా ఆయన కూడా పొటల్క పర్వతం (తిరుపతి కొండలు) చేరుకున్నాడు. ఆయనే కాదు, ఎంతోమంది చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తలు, చైనా యాత్రికులు పొటల్క పర్వతం చేరి, అక్కడ అవలోకేతేశ్వరుణ్ణి - తారాదేవిని ప్రతిష్టించి వజ్రయానానికి తిరుగులేని కేంద్రంగా తీర్చిదిద్దారు అన్నది చరిత్ర చెపుతూ ఉంది. ప్రఖ్యాత ఆర్కియాలజిస్ట్ కన్నింగ్ హమ్ బౌద్ధుడైన దిన్నాగుని మార్గాన్ని అన్వేషిస్తూ మధుర, తంజావూరు, ట్రావెన్ కోర్‌ల మీదుగా సాగి, దక్షిణాన గల పొటల్క పర్వతం చేరుకున్నాడు. వేంకటేశ్వరుడిగా తిరుపతిలో పూజలందుకుంటున్నది బౌద్ధుల అవలోకేతేశ్వరుడు (పురుషుడు) అని చాలామంది అంటూ ఉంటే, కొందరు మాత్రం ఆ విగ్రహం బౌద్ధ తారాదేవిది (స్త్రీ) అని వాదించారు. ఏమైనా, అది బౌద్ధ విగ్రహం! వైదికులు కల్పించుకున్న వెంకటేశ్వరుడిది కానే కాదు. హ్యూన్ త్సాంగ్ నమోధు చేసిన దాన్ని బట్టి, దక్షిణ భారత దేశంలో కొన్ని వేల బౌద్ధ క్షేత్రాలుండేవి. ఒక్కొక్క బౌద్ధారామంలో మూడు వేల దాకా భిక్షువులుండే వారు. ముఖ్యంగా చెప్పుకోదగ్గవి ధాన్య కటకంఅంటే నేటి అమరావతి. ఇది థేరవాద బౌద్ధానికి ప్రసిద్ధి. శ్రీ పర్వతం అంటే నేటి నాగార్జున కొండ. ఇది మహాయాన బౌద్ధానికి ప్రసిద్ధి. షాహియాన్, హ్యూన్ త్సాంగ్ తర్వాత మరొక చైనా యాత్రికుడు ఇత్సింగ్ (1tsing. 635713 C.E) రికార్డు చేసిన చరిత్రను (70/C.E) బట్టి, బుద్ధుడు అవలోకే తేశ్వరుడిగా పొటల్క పర్వతం మీద ఉన్నాడని నిర్ధారణ అయింది. అంటే తిరుపతి కొండ మీదున్నది బుద్ధుడన్న విషయం మరింతగా బలపడింది. తంత్రయానం - దక్షిణ భారత దేశంలో ప్రారంభమైందనీ, అందుకు చాలా ఆధారాలున్నాయని రాహుల్ సాంకృ త్యాయన్ వివరించాడు.ఇకపోతే, తిరుపతి కొండల గూర్చి మరి కొన్ని విశేషాలు కూడా బయటపడ్డాయి. 'కల బార్స్' అనేది తిరుపతి ప్రాంతానికి చెందిన ఒక రాజవంశపు తెగ. ప్రాచీన కాలంలో ఈ కొండల్ని 'పుల్లి కున్రాయ్ కొండలు' అని పిలిచేవారు. అంటే పుల్లి నాయకుని కొండలని అర్థం. ఈ తెగ నాయకుడైన వెంగడం పేరు మీద వెంకటాచల కొండలుగా పిలుస్తున్నారని చెపుతారు. ఈ కలబార్స్ తెగవారు బౌద్ధవలంబికులనీ, వీరు వెంకటాచల కొండలపై ప్రతి సంవత్సరం బౌద్ధ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేవారని మిలాలనూర్‌అనే ప్రాచీన తమిళకవి రచనల వల్ల తెలుస్తూ ఉంది. పదవ శతాబ్దం (CE)లో అమిత్యాగర - అనే తమిళ రచయిత 'అక్కుత విక్కంట' - అనే బౌద్ధ గ్రంథం రచించాడు. అది ఇప్పటికీ అందుబాటులో ఉండడమే కాదు, తమిళ బౌద్ధులు నితం పఠించే గ్రంథం. ఇక ఐదవ శతాబ్దానికి (C.E) చెందిన బుద్ధదత్త - అనే పాలి భాషా రచయిత 'వినయ వినిచ్ఛయ' అనే గ్రంథం రాశాడు. వీటన్నింటిని బట్టి, కలబార్స్ అనే ఆదివాసీ తెగ తిరుపతి కొండలపై బుద్ధుణ్ణి ప్రతిష్ఠించుకుని, ఉత్సవాలు నిర్వహించుకునే వారాని ఈ రకంగా కూడా తెలుస్తోంది.ఇక్కడి బౌద్ధారామాలలో భిక్షువులు విరివిగా గ్రంథరచన చేస్తుండేవారని తెలుస్తూ ఉండడం వల్ల ధర్మకీర్తి అనే బౌద్ధ తాత్వికుడు ఈ తిరుపతి వాడేమోననే అనుమానం కలుగుతుంది.ఎందుకంటే, ధర్మకీర్తి పుట్టింది దక్షిణ భారత దేశంలో అని చాలా ఆధారాలు దొరుకుతున్నాయి. ఇంకా లోతుగా వెతికితే, ఆయన దక్షిణ భారత దేశంలో ఎక్కడో కాదు, తిరుపతి లోనే అన్నది కొందరి వాదన! బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి, బౌద్ధం స్వీకరించి, బౌద్ధ పతాకను ఉవ్వెత్తున ఎగరేసిన మహాజ్ఞాని అన్నది మాత్రం కచ్చితంగా తెలుస్తూ ఉంది. ఈయన విద్వత్తు ఇండియాకే పరిమితం కాలేదు. టిబెట్‌లో ఈయన ప్రభావం విపరీతంగా ఉండేది. గొప్ప తార్కికుడని, సద్విమర్శకుడని నలందా విశ్వవిద్యాలయంలో మొదటి విద్యనార్జించి, తర్వాత కాలంలో ధర్మాకీర్తి అక్కడ బోధకుడయ్యాడని తెలుస్తూ ఉంది. విచారించదగ్గ విషయమే మంటే, మన నాగార్జున కొండ మీద నివాసమేర్పరుచుకున్న రెండో బుద్ధుడని పిలవబడ్డ ఆచార్య నాగార్జునుడి గూర్చిగానీ, దక్షిణ భారతానికి చెందిన ఆచార్య ధర్మకీర్తి గురించి గానీ మన తెలుగు ప్రజలలో చాలామందికి ఏమీ తెలియదు. తెలుసుకుం దామన్న ప్రయత్నమూ చేయరు. వైదిక మత ప్రభావంలో నిస్సహాయంగా పడి కొట్టుకుపోతూ, తరతరాలుగా బతుకులు వెళ్లదీస్తున్నారే గాని - మన మూలాలేవో తెలుసుకుందామన్న స్పృహ, ఉత్సుకత ఉండడం లేదు. ఆలోచించుకోవలసిన విషయమే కదా ఇదీ ?



# జాతీయం - అంతర్జాతీయం





## సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి సోనమ్ వాంగ్‌చుక్

- క్షీణించిన ఆరోగ్యం

**సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించడంతో, ఆయనను ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి నుంచి గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రికి తరలించారు. గత 24 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న ఆయన ఆరోగ్య పరిస్థితిని సమీక్షించిన ఢిల్లీ హైకోర్టు, ఆయన కోరుకున్న ఆసుపత్రికి తరలించాలని మంగళవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేసింది.**

**న్యూఢిల్లీ, జులై 22 (ఎ.ఎం.ఎస్):** సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించడంతో, ఆయనను ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి నుంచి గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రికి తరలించారు. గత 24 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న ఆయన ఆరోగ్య పరిస్థితిని సమీక్షించిన ఢిల్లీ హైకోర్టు, ఆయన కోరుకున్న ఆసుపత్రికి తరలించాలని మంగళవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేసింది.

ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. వాంగ్‌చుక్‌కు నిరంతర వైద్య పర్యవేక్షణ అవసరమని ఎయిమ్స్, సఫ్దర్‌జంగ్ వైద్యులతో పాటు ఆయన వ్యక్తిగత వైద్యులు కూడా అభిప్రాయపడటంతో కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. ఆయనకు మెరుగైన చికిత్స అందించేందుకు మేదాంత ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించింది.

## దద్దరిల్లుతోన్న పశ్చిమాసియా

- పరిస్థితి అదుపుతప్పే ప్రమాదం
- ప్రాణభయంతో నౌకల్లోని సిబ్బంది
- ఇంధన సంక్షోభం మరింత తీవ్రతరం
- మధ్యప్రాచ్యంలో మరో మలుపు



**టెహ్రాన్, జులై 22:** పశ్చిమాసియాలో వరుసగా పదో రోజు రాత్రి కూడా దాడులు కొనసాగాయి. దాడులు, ప్రతి దాడులతో దద్దరిల్లిపోతున్న పశ్చిమాసియాలో పరిస్థితి అదుపు తప్పే ప్రమాదం పొంచి ఉంది. హార్ముజ్ జలసంధిలో మరో రెండు వాణిజ్య నౌకలపై మంగళవారం ఇరాన్ దాడి చేసింది. దీంతో ఆ నౌకలలోని సిబ్బంది ప్రాణభయంతో పరుగులు తీశారు. మరోవైపు ప్రపంచ ఇంధన సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తూ ఎర్ర సముద్రంలో సౌదీ అరేబియా నౌకలను హౌతీలు దిగ్బంధించారు. ఎర్ర సముద్రానికి దక్షిణం వైపు ఉన్న బాబ్ అల్`మందబ్ జలసంధిలో సౌదీ నౌకలకు ప్రవేశం లేదని హౌతీల ప్రతినిధి ఒకరు స్పష్టం చేశారు. గత దశాబ్ద కాలంగా యెమన్‌ను అన్యాయంగా సౌదీ దిగ్బంధించిందని, అందుకే ఈ చర్యకు పూనుకున్నామని చెప్పారు. హౌతీల చర్యపై సౌదీ అరేబియా స్పందిస్తూ అంతర్జాతీయ చట్టానికి అనుగుణంగా తమ నౌకల రక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పింది. హౌతీల కుట్రను భగ్నం చేసేందుకు తమ సైన్యం సిద్ధంగా ఉన్నదని యెమన్ ప్రకటించింది. హౌతీల తాజా నిర్ణయంతో మధ్యప్రాచ్యంలో పోరు మరో మలుపు తిరిగింది.

అమెరికా సేనలు వరుసగా పదో రోజు రాత్రి కూడా దాడి చేసినప్పటికీ హార్ముజ్‌పై ఇరాన్ తన పట్టును ఏ మాత్రం సడలించలేదు. జలసంధిలోని ఒమన్ తీరంలో ఓ చమురు ట్యాంకర్‌పై మంగళవారం ఉదయం దాడి చేసింది. దీంతో అందులోని సిబ్బంది పడవలో పరారయ్యారు. జలమార్గంలో సోమవారం మరో రెండు పడవలపై దాడి చేసింది కూడా తామేనని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. హార్ముజ్‌లో జరుగుతున్న దాడుల నేపథ్యంలో వాణిజ్య నౌకల రాకపోకలు బాగా తగ్గిపోయాయి. అమెరికా దాడులకు ప్రతిగా బహ్రైన్, కువైట్, జోర్డాన్ దేశాలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. బహ్రైన్‌లోని షేక్ ఇసా వైమానిక స్థావరంలో ఉన్న అమెరికా సైనిక లక్ష్యాలపై కూడా దాడులు జరిగాయి. బహ్రైన్, కువైట్‌లలోని గగనతల రక్షణ వ్యవస్థలు, రాడార్ కేంద్రంపై ఐఆర్‌జీసీ దాడులు చేసింది. బహ్రైన్‌లో అమెరికాకు చెందిన అమెజాన్ కంపెనీ మౌలిక సదుపాయాల పైనా దాడి జరిగింది. ఇరాన్ దాడుల నేపథ్యంలో బహ్రైన్, కువైట్, జోర్డాన్‌లు గగనతల రక్షణ వ్యవస్థలను క్రియాశీలకం చేశాయి. అమెరికా సేనలు సోమవారం రాత్రి నుంచి ఇరాన్‌లోని సైనిక కమాండ్ కేంద్రాలు, డ్రోన్ ప్రయోగ స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు జరిపాయి. బందర్ అబ్బాస్, తబ్రిజ్, బుషెహర్ సహా దేశంలోని పలు ప్రాంతాలపై అమెరికా దాడులు చేసిందని ఇరాన్ మీడియా తెలిపింది. పలు ప్రాంతాలలో పేలుడు శబ్దాలు వినిపించాయి. ఈ నెల 7 నుంచి ఇరాన్ జరుపుతున్న దాడులలో సుమారు వంద మంది సైనిక సిబ్బంది గాయపడ్డారని పెంటగాన్ అంగీకరించింది. అయితే వీరిలో చాలా మందికి స్వల్ప గాయాలు మాత్రమే అయ్యాయని, 96 శాతం మంది తిరిగి విధులకు హాజరయ్యారని పెంటగాన్ ప్రతినిధి సియాన్ పార్నెల్ చెప్పారు.

కాగా అమెరికా - ఇరాన్ మధ్య ఘర్షణలు మొదలైన తర్వాత తొలిసారిగా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేత్ మంగళవారం కాంగ్రెస్ ఎదుట హాజరయ్యారు. ఇదిలావుండగా మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికన్లకు ట్రంప్ ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. 'ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా దౌత్య కేంద్రాలను లక్ష్యంగా ఎంచుకున్నారు. ఇరాన్, దానికి మద్దతు ఇచ్చే గ్రూపులు వివిధ దేశాలలోని అమెరికా ప్రయోజనాల పైన, స్థావరాల పైన దాడి చేయవచ్చు. కాబట్టి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికన్లు అప్రమత్తంగా ఉండాలి' అని సామాజిక మాధ్యమంలో విదేశాంగ శాఖ సూచించింది.

హార్ముజ్ జలసంధి మూత ప్రాంతీయ ఇంధన భద్రతకు ముప్పుగా పరిణమించడంతో అగ్నేయాసియా దేశాల సంఘం (ఆసియాన్) తాజా పరిణామాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కీలక మధ్యవర్తుల ప్రయత్నాలకు విఘాతం కలుగుతోందని, చర్చలు - దౌత్యం ద్వారా శాంతియుత పరిష్కారం లభించే అవకాశాలు సన్నగిల్లుతున్నాయని ఆసియాన్ విదేశాంగ మంత్రులు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. కాగా హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ఆసియా దేశాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. సౌదీ నౌకల రాకపోకలను అడ్డుకుంటామంటూ యెమన్‌లోని హౌతీలు చేసిన ప్రకటన మరో ప్రాంతీయ ఘర్షణకు దారితీసే అవకాశాలు కన్పిస్తున్నాయి. అంతర్జాతీయ చమురు సరఫరాలకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడి ధరలు ఆకాశాన్ని తాకవచ్చు. ఎర్ర సముద్రం చివరన దక్షిణం వైపు బాబ్ అల్ మందెబ్ జలసంధి ఉంది. ఈ వ్యూహాత్మక జలమార్గాన్ని మూసివేస్తే అంతర్జాతీయ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. చమురు మార్కెట్లలో కుదుపు ఏర్పడుతుంది. బాబ్ అల్`మందెబ్ జలసంధి సూయజ్ కాలువకు ముఖద్వారం. ప్రపంచంలోని ఓ అతి పెద్ద నౌకా మార్గం ద్వారా యూరప్‌ను, ఆసియాను కలుపుతోంది. ప్రపంచ నౌకాయాన రవాణాలో సుమారు పదిహేను శాతం ఈ జలసంధి మీదుగానే జరుగుతోంది. గతంలో ఈ మార్గంలో ప్రయాణించిన నౌకలపై హౌతీలు దాడులు చేశారు. 2023 - 2025 మధ్య ఈ మార్గంలో నౌకల రవాణాలో ఎదురైన అడ్డంకుల కారణంగా ఏటా 20 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. ప్రపంచంలో అతి పెద్ద ముడి చమురు ఎగుమతిదారు అయిన సౌదీ అరేబియాకు ఈ జలసంధి కీలక మార్గం. జలసంధి మూసివేతతో...యన్బు టెర్మినల్ మీదుగా అంతర్జాతీయ మార్కెట్లకు చమురును సరఫరా చేయడానికి సౌదీ అరేబియా ఉపయోగిస్తున్న ఈస్ట్ - వెస్ట్ పైప్‌లైన్ ఇక పనిచేయదు.

అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధానికి దిగామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ చెప్పారు. సుప్రీం జ్యుడీషియల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ 'ఈ రోజు జరుగుతున్న యుద్ధం కేవలం క్షిపణుల పోరే కాదు. సైనిక దాడుల ద్వారా ఇరాన్ ప్రజలను లొంగదీసుకోలేమని శత్రువు నిర్ణయానికి వచ్చాడు' అని అన్నారు. శత్రువుతో పోరులో దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం జరగవచ్చునని, ప్రజల జీవనోపాధి దెబ్బతింటుందని చెప్పారు. జీవనోపాధి, నిరుద్యోగం, పేదరికం సహా పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అంటూ ఇలాంటి సమాజంలో నివసించడం మనకు అంగీకారయోగ్యం కాదని తెలిపారు. ఆర్థిక ఒత్తిడులు సమాజంలో అసంతృప్తికి దారితీస్తే, ఆ అసంతృప్తి దేశమంతటా వ్యాపిస్తే వ్యవస్థకు మద్దతుగా ప్రజలు సృష్టించిన సామాజిక మూలధనం దెబ్బతింటుందని చెప్పారు. కాగా సైనిక పరంగా టెహ్రాన్ పైచేయి సాధించినప్పుడే సంప్రదింపులు తిరిగి ప్రారంభమవుతాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తెలిపారు.

## కూలిన సొరంగం

- 12 మంది దుర్మరణం
- సిక్కింలో ఘటన



**గాంగ్‌టాక్, జులై 22 (ఎ.ఎం.ఎస్):** సిక్కింలోని నామ్చి జిల్లా, సమర్దుంగ్‌జోలుంగే ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సొరంగం కూలిపోవడంతో 12 మంది మరణించగా, కనీసం మరో 13 మంది లోపల చిక్కుకుపోయారు. "సమర్దుంగ్‌లోని ఎన్ హెచ్ పీసీ తీస్తా స్టేజ్ VI జలవిద్యుత్ ప్రాజెక్ట్ వద్ద జరిగిన ఈ ప్రమాదంలో అధికారిక సమాచారం ప్రకారం, ఇప్పటివరకు తొమ్మిది మరణాలు నమోదయ్యాయి," అని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

జలవిద్యుత్ ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ .. ప్రభుత్వానికి అందిన సమాచారం ప్రకారం, ఆ ప్రాజెక్ట్ లో అధికారులతో సహా మొత్తం 25 మంది కార్మికులు ఏడీఐటీ3 సొరంగం లోపల చిక్కుకుపోయారు. ఈ ప్రాజెక్ట్‌లో 13.8 కి.మీ , 13.7 కి.మీ పొడవున్న రెండు ప్రధాన సొరంగాలు ఉన్నాయి. సిక్కింలో కూలిపోయిన సొరంగం సివిల్ నిర్మాణ పనులను చేపడుతున్న పటేల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ (పీఈఎల్), చిక్కుకుపోయిన వారిని రక్షించడానికి తమ ప్రాజెక్ట్ బృందం విపత్తు నిర్వహణ దళాలు , స్థానిక అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేస్తోందని తెలిపింది. రక్షణ చర్యలకు మద్దతుగా అవసరమైన వనరులు, పరికరాలు, సహాయాన్ని అందిస్తున్నామని, సొరంగాన్ని స్థిరీకరించడానికి , రక్షణ బృందాలు ప్రభావిత ప్రాంతానికి చేరుకోవడంలో సహాయపడటానికి తమ సైట్ ఇంజనీరింగ్ బృందం అధికారులతో కలిసి నిరంతరం (రౌండ్‌దిక్లాక్) పనిచేస్తోందని కంపెనీ పేర్కొంది. తమ వాళ్లను కోల్పోయిన వారు ఆస్పత్రి వద్దకు రాగా రోదనలతో నిండిపోయింది. ఇప్పటికీ కానరాని తమ వాళ్ల ఆచూకీ ఏమైందని.. పలువురు అధికారులను కలిసి విన్నవిస్తున్నారు. పరిస్థితి గురించి ప్రధాని మోడీ, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్‌తో ఫోన్‌లో మాట్లాడారు.



## అత్యవసరంగా విచారించలేం

- ఢిల్లీ ఘటనలపై సుప్రీం కోర్టు
- సమయాన్ని వృథా చేయొద్దంటూ హితవు

**న్యూఢిల్లీ, జులై 22 (ఎం.ఎం.ఎస్):** పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థి నిరసనకారులపై పోలీసుల చర్యలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. "మాకు వీడియోలు చూసే ఆసక్తి లేదు, అంత సమయం కూడా లేదు" అని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్య కాంత్ వ్యాఖ్యానిస్తూ, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలపై జోక్యం చేసుకోవాలన్న అభ్యర్థనను తోసిపుచ్చారు. బుధవారం నాటి విచారణలో ఓ లాయర్ ఈ అంశాన్ని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట ప్రస్తావిస్తూ, కోర్టు ఈ విషయాన్ని సుమోటోగా స్వీకరించాలని కోరారు. అయితే ధర్మాసనం అందుకు స్పష్టంగా నిరాకరించింది. "మా సమయాన్ని వృథా చేయకండి, మీ సమయాన్ని కూడా పాడుచేసుకోకండి" అని లాయర్‌కు సీజేఐ హితవు పలికారు.

నీట్ యుజి పేపర్ లీక్, ఇతర పరీక్షల అక్రమాలపై 'కాక్రోచ్ జనతా పార్టీ' ప్రధానంగా నిరసనలు నిర్వహిస్తోంది. నిరుద్యోగ యువత జర్నలిజం, సామాజిక ఉద్యమాల వైపు రావడంపై గతంలో సీజేఐ సూర్య కాంత్ స్పందిస్తూ 'కాక్రోచ్' (బొద్దింకలు) అనే పదాన్ని వాడగా, ఆ వ్యాఖ్యల ఆధారంగానే ఈ వ్యంగ్య వేదిక ఏర్పడటం గమనార్హం. ఆ వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత రావడంతో, తాను నకిలీ డిగ్రీలు ఉన్న వారిని ఉద్దేశించి మాత్రమే ఆ మాట అన్నానని సీజేఐ తదనంతరం వివరణ ఇచ్చారు.

## ఇరాన్‌తో యుద్ధం ఖర్చు 37.5 బిలియన్ డాలర్లు

- అమెరికా రక్షణ శాఖ కార్యదర్శి పీట్ హెగ్సెత్ వెల్లడి
- భారీగా పెరుగుతున్న ఖర్చు



**వాషింగ్టన్, జులై 22:** ఇరాన్ యుద్ధం కారణంగా అమెరికాకు ఇప్పటివరకు 37.5 బిలియన్ డాలర్ల (రూ. 3.62 లక్షల కోట్లు ) వ్యయమైనట్లు అమెరికా రక్షణ శాఖ కార్యదర్శి పీట్ హెగ్సెత్ వెల్లడించారు. మే మధ్య కాలంలో సుమారు 29 బిలియన్ డాలర్ల వ్యయం అంచనా వేయగా.. ఖర్చు భారీగా పెరిగింది. ఈ రోజు వరకు 37.5 బిలియన్ డాలర్లుగా అంచనా వేశామని హెగ్సెత్ సెనెట్ కేటాయింపుల కమిటీకి తెలిపారు. పెంటగాన్ కోసం అదనపు నిధులు 67బిలియన్ డాలర్లు కేటాయించాలని కోరారు.

సెప్టెంబర్ చివరి వరకు ఇరాన్‌పై యుద్ధానికి సంబంధించిన పెంటగాన్ ఖర్చులను భరించడానికి నిధులను కేటాయించడం 'అత్యవసరం', 'తప్పనిసరి' అని హెగ్సెత్, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ డాన్ కెయిన్ పేర్కొన్నారు. అయితే ఇప్పటికీ హెగ్సెత్ వద్ద 75 బిలియన్ డాలర్ల ఖర్చు చేయని నిధులు ఉన్నాయని డెమోక్రాట్ సభ్యులు జీన్ షాహీన్ సవాలు చేశారు. ఖర్చు చేయని నిధులను సర్దుబాటు చేయడానికి బదులుగా ఎందుకు యుద్ధం ఖర్చును ప్రజలపై మోపాలని చూస్తున్నారని ప్రశ్నించారు. ఖర్చు చేయని ఆ నగదును, అధ్యక్షుడు ట్రంప్ ఇతర ప్రాధాన్యతలు ముఖ్యంగా గోల్డెన్ డోమ్ ఫర్ అమెరికా, హైపర్‌సోనిక్స్, ఇతర ఆయుధ సామాగ్రి పెట్టుబడులు వంటి ఇతర వాటి కోసం కేటాయించినట్లు తెలిపారు. పశ్చిమాసియాలోని అమెరికా సైనిక క్యాంప్‌ల పునరుద్ధరణ నిమిత్తమయ్యే ఖర్చును ఈ నిధుల్లో చేర్చలేదని అన్నారు. పశ్చిమాసియా యుద్ధంలో గెలిచేందుకు ట్రంప్ యంత్రాంగ వ్యూహం పూర్తి వివరాలను వెల్లడించాలని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హార్ముజ్ జలసంధిని అమెరికా విడిచిపెడితే.. ఏం జరుగుతుందని రిపబ్లికన్ సెనెటర్ జాన్ కెనడీ ప్రశ్నించారు. జలసంధిని దాటేందుకు ఇరాన్ నిర్దిష్టమైన రుసుము విధిస్తుందా లేదా అన్న అంశంపై హెగ్సెత్, డాన్ కెయిన్‌లు నిర్దిష్టమైన సమాచారం ఇవ్వలేకపోయారు. ఈ అంశంపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తెండి

- దళాలను ఉపసంహరించేలా చర్యలు తీసుకోండి
- లెబనాన్ అధ్యక్షుడు జోసఫ్ ఔన్ విజ్ఞప్తి

**బీరుట్, జులై 22:** లెబనాన్ అధ్యక్షుడు జోసఫ్ ఔన్ బుధవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో శ్వేతసౌధంలో సమావేశమవుతారు. హిజ్బొల్లాలను నిరాయుధులను చేసేందుకు అనుసరించాల్సిన ప్రణాళికను అందజేస్తారు. దక్షిణ లెబనాన్ నుంచి దళాలను ఉపసంహరించుకోవాల్సిందిగా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలని కోరతారు. గడచిన రెండు దశాబ్దాల కాలంలో లెబనాన్ అధ్యక్షుడు అమెరికాలో పర్యటించడం ఇదే మొదటిసారి. లెబనాన్ దక్షిణ ప్రాంతంలో ఇజ్రాయిల్ దళాలు మోహరించి ఉన్న విషయం తెలిసిందే. కాగా త్రైపాక్షిక ఒప్పందం మేరకు లెబనాన్‌లోని మూడు గ్రామాలలో పైలట్ జోన్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని అమెరికా తెలిపింది. రోమ్‌లో ఇజ్రాయిల్, లెబనాన్ మధ్య జరిగిన సంప్రదింపులలో దీనిపై అంగీకారం కుదిరిందని చెప్పింది. ఒప్పందం అమలు కోసం ఇరు పక్షాలతోనూ అమెరికా కృషి కొనసాగిస్తుందని పేర్కొంది.



అమెరికా మధ్యవర్తిత్వంతో కుదిరిన అంగీకారం మేరకు ఇజ్రాయిల్ తన దళాలను పూర్తిగా ఉపసంహరించుకునేలా చూడాలని ట్రంప్‌తో జరిగే భేటీలో ఔన్ కోరతారని తెలుస్తోంది. హిజ్బొల్లా వద్ద ఉన్న ఆయుధాలను ప్రభుత్వ నియంత్రణ పరిధిలోకి తేవాల్సిన అవసరాన్ని కూడా నొక్కి చెబుతారు. హిజ్బొల్లా ఆయుధాలను విడనాడే వరకూ దళాలను పూర్తిగా ఉపసంహరించడం సాధ్యపడదని ఇజ్రాయిల్ ఇప్పటికే స్పష్టం చేసింది. అటు హిజ్బొల్లా కూడా ఇజ్రాయిల్‌తో నేరుగా చర్చలు జరిపేందుకు నిరాకరించింది.

## ఇంత జరుగుతున్నా మౌనమే

- నీట్ లీకేజీ ఆందోళనలపై నోరు విప్పని ప్రధాని మోడీ
- ఇండియా బ్లాక్ వరుస భేటీలు
- విద్యార్థుల గొంతు వినిపిస్తూనే ఉంటాం
- రాహుల్ గాంధీ హెచ్చరిక

**న్యూఢిల్లీ, జులై 22 (ఎ.ఎం.ఎస్):** నీట్ పేపర్ లీక్, విద్యారంగంలో వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'పార్లమెంట్ మార్చ్'లో విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండించాయి. ఈ అంశంపై ఉభయ సభల్లో ఆందోళనలు చేపట్టాయి. దీంతో పార్లమెంట్ స్తంభించింది. విద్యార్థులు , యువతపై దేశ రాజధానిలో పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా ఆప్ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టారు, నినాదాలతో హోరెత్తించారు. అంతకుముందు లోక్‌సభను స్పీకర్ ఓంబిర్లా ప్రారంభించి ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు యత్నించారు. ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో లోక్‌సభ కార్యకలాపాలు ప్రారంభమైన రెండు నిమిషాల్లోనే మధ్యాహ్నం 12 గంటలకు వాయిదాపడ్డాయి. ఈ క్రమంలో "లేవనెత్తిన అంశాలపై చర్చించేందుకు సభ్యులకు అవకాశం లభిస్తుంది" అని బిర్లా అన్నారు. తిరిగి ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్షాల ఆందోళన కొనసాగడంతో సభ ప్రారంభమైన తొమ్మిది నిమిషాల్లోనే మధ్యాహ్నం రెండు గంటలకు ప్యానెల్ స్పీకర్ సంధ్యా రే సభను వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో పరిస్థితిలో ఎటువంటి మార్పు రాలేదు.

ప్యానెల్ స్పీకర్ దిలీప్ సైకియా... నియమం 377 ప్రకారం సభ్యులు తమ స్థానాలలో కూర్చొని సభా కార్యకలాపాలను కొనసాగించాలని కోరారు. ప్రతిపక్షాల ఆందోళన కొనసాగడంతో సభను నాలుగు నిమిషాల్లోనే బుధవారానికి వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభలోనూ అదే సీన్ కొనసాగింది. సభను చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ ప్రారంభించారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను వినాలని కోరారు. "పేపర్ లీక్‌లు, నీట్ పరీక్షపై గళం విప్పుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్, బాష్పవాయువు ప్రయోగించారు. ప్రస్తుతం కొందరు విద్యార్థులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారి సమస్యలను వినాలి" అని ఖర్గే అన్నారు. దీంతో సభలో అధికార పార్టీ సభ్యులు లేచి కేకలు వేయడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. వెంటనే చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ సభను ఏడు నిమిషాల్లోనే మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్ష సభ్యుల ఆందోళన కొనసాగింది. చైర్మెన్ ఒక్క నిమిషంలోనే సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో ప్రతిపక్షాలు వెల్‌లోకి వచ్చి ఆందోళన చేపట్టారు. డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ సింగ్ ఒక్క నిమిషంలోనే సభను వాయిదా వేశారు.



లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో ప్రతిపక్ష నేతలు భేటీ అయ్యారు. లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడిన తరువాత, స్పీకర్ ఓం బిర్లాను ఆయన ఛాంబర్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని ప్రతిపక్ష ఎంపీలు కలిశారు. విద్యావ్యవస్థలో వైఫల్యాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ 'పార్లమెంట్ మార్చ్' లో తమ గళం విప్పిన విద్యార్థులు, యువత పట్ల పోలీసుల అణచివేతపై స్పందించకుండా మోడీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. స్పీకర్‌ను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యార్థుల పట్ల క్రూరత్వంపై పార్లమెంటులో సమగ్ర చర్చ జరగాలని అన్నారు. అయితే ఈ అంశంపై చర్చించడానికి ప్రభుత్వ అనుమతి కావాలని స్పీకర్ అన్నారని తెలిపారు. "సోమవారం విద్యార్థులపై జరిగిన దారుణంపై, విద్యావ్యవస్థలోని వైఫల్యాలపై ప్రభుత్వానికి పూర్తి జవాబుదారీతనం లేకపోవడంపై పార్లమెంటు సమగ్రంగా చర్చించాలి" అని ఆయన డిమాండ్ చేశారు. "ఈ దానికి మోడీ కనీసం క్షమాపణ కూడా చెప్పలేదు. విద్యా, పరీక్షా విధానం కొన్ని చెదపురుగుల వల్ల కుళ్లిపోయిందని దేశమంతటికీ తెలుసు. ఇప్పటికైనా ప్రధానమంత్రి విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి" అని అన్నారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులను పోలీసులు కొట్టడం పూర్తిగా భారతీయ సంస్కృతికి విరుద్ధమని తెలిపారు. ఈ సమస్యను ప్రతిపక్షం మరుగున పడనివ్వదని, వీధుల్లోనూ, పార్లమెంటులోనూ విద్యార్థుల గొంతు వినిపిస్తూనే ఉంటుందని ఆయన హెచ్చరించారు. పార్లమెంట్ సమావేశాల్లో లేవనెత్తే అంశాలపై చర్చించేందుకు ఇండియా బ్లాక్ భేటీ అయింది. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంపీ సుప్రియా సూలే, సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్, ఎస్‌పి ఎంపీ ధర్మేంద్ర యాదవ్, శివసేన ఎంపీ సంజయ్ రౌత్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు అధికార ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ భేటీ కూడా జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రులు, ఎన్‌డిఎ ఎంపీలు పాల్గొన్నారు. అనంతరం కిరణ్ రిజిజు మాట్లాడుతూ దోషులను శిక్షించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోడీ నొక్కిచెప్పారని అన్నారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీ తర్వాత ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుందని ప్రధాని మోడీ ఎంపీలకు చెప్పారని తెలిపారు.

## బ్రిటన్‌లో కొత్త క్యాబినెట్

- ఏర్పాటు చేసిన నూతన ప్రధాని
- పాత మంత్రుల్లో కొందరి తొలగింపు



**లండన్, జులై 22:** బ్రిటన్ కొత్త ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్ పదవీ బాధ్యతలు చేపట్టిన కొద్ది గంటల్లోనే తన కొత్త క్యాబినెట్‌ను ప్రకటించారు. కింగ్ చార్ల్స్ ఆహ్వానం మేరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన బర్న్‌హామ్, మాజీ ప్రధాని కీర్ స్టార్మర్ ప్రభుత్వంలో ఉన్న పలువురు కీలక మంత్రులను తప్పిస్తూ కొత్త బృందాన్ని ఖరారు చేశారు. అందులో భారత్ సంతతికి చెందిన వ్యక్తికి కీలక బాధ్యతలు అప్పగించారు. క్యాబినెట్ హోదాతో కూడిన కృత్రిమ మేధ (ఏఐ) మంత్రిగా కనిష్క నారాయణ్కు పదోన్నతి కల్పించారు. స్టార్మర్ ప్రభుత్వంలో జూనియర్ ఏఐ మంత్రిగా పనిచేశారు. ఆన్‌లైన్ భద్రత, కృత్రిమ మేధ విభాగాన్ని పర్యవేక్షించేవారు. ఇప్పుడు పూర్తి స్థాయి క్యాబినెట్ ఏఐ మంత్రిగా హోదా లభించింది. విధానాల రూపకల్పనలో ఏఐకి మరింత కీలకపాత్ర ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో ఈ నియామకం జరిగింది. ఆయన ఏఐ శాఖతో పాటు కేబినెట్ కార్యాలయం, వ్యాపారం, ఆవిష్కరణలు, విజ్ఞానం, వాణిజ్య శాఖల పరిధిలో బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

## హైదరాబాదీకి ఆస్ట్రేలియాలో శాశ్వత నివాస హోదా



- గతేడాది వీరోచిత పోరాటం
- బుల్లెట్ల వర్షం కురుస్తున్నా..
- 20 మంది ప్రాణాలు కాపాడిన వీరుడు

**సిడ్నీ, జులై 22:** గతేడాది డిసెంబర్‌లో ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరం బాండీ బీచ్ వేదికగా జరిగిన కాల్పుల ఘోర ఘటనలో కనీసం 15 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదంలో హైదరాబాద్‌కి చెందిన తండ్రీకొడుకుల ప్రమేయం ఉందన్న వార్తలు నగర ప్రతిష్ఠను దెబ్బతీశాయి. అయితే అదే భీకర కాల్పుల్లో.. హైదరాబాద్‌కి చెందిన మరో 37 ఏళ్ల రెహమత్ పాషా అనే క్యాబ్ డ్రైవర్ చూపించిన అసమాన ధైర్యం, మానవత్వం ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. కాల్పుల వర్షం కురుస్తున్నా.. ఏమాత్రం భయపడకుండా ప్రాణాపాయంలో ఉన్న అనేక మంది బాధితులను కాపాడిన ఆయనకు ఆస్ట్రేలియా ప్రభుత్వం తాజాగా శాశ్వత నివాస హోదాను కల్పించింది. ఆనాటి ఉదంతంలో రెహమత్ పాషా ప్రాణాలకు తెగించి పోరాడారు. ఎదురుగా దూసుకొస్తున్న బుల్లెట్లను తప్పించుకుంటూనే.. తీవ్రంగా గాయపడిన వారిని రక్షించేందుకు తీవ్రంగా కష్టపడ్డారు. గాయపడిన బాధితులను మోసుకెళ్లి సమీపంలో వేచి ఉన్న అంబులెన్సుల వరకు చేర్చారు. ఇలా దాదాపుగా 18 నుంచి 20 మంది ప్రాణాలను కాపాడారు. ఇలా బాండీ బీచ్ తీరంలో తీవ్ర రక్తస్రావంతో, మానసిక షాక్‌లో ఉన్న బాధితులకు ఓదార్పునందిస్తూ.. తన ప్రాణ భయాన్ని పక్కనబెట్టి అండగా నిలిచారు. ఆయన చేసిన ఈ నిస్వార్థ సేవకు గుర్తింపుగా ఆస్ట్రేలియా ప్రభుత్వం పిఆర్‌ను మంజూరు చేసింది. త్వరలోనే ఆయన భార్య, ముగ్గురు పిల్లలు కూడా ఆస్ట్రేలియాలో ఆయనతో కలవనున్నారు. ఆస్ట్రేలియా ప్రభుత్వ వర్గాలు రెహమత్ పాషా ధైర్యాన్ని మరింతగా గౌరవించాయి. నాటి భయానక ఘటన రోజున ఆయన ధరించిన క్యాప్‌ను 'సిడ్నీ మ్యూజియం'లో ప్రదర్శనకు ఉంచాలని అధికారులు నిర్ణయించారు. దీనితో పాటు ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆయనను పలు అధికారిక సాహస పురస్కారాలకు కూడా నామినేట్ చేసింది. ప్రభుత్వ గౌరవాలను వినమ్రంగా స్వీకరించినప్పటికీ.. డిసెంబర్ 14వ తేదీన జరిగిన ఆ భయానక ఘటన జ్ఞాపకాలు తనను ఇప్పటికీ వెంటాడుతున్నాయని పాషా తెలిపారు. ఆ ఘటన సృష్టించిన మానసిక ఆందోళన వల్ల ఆయన చాలాకాలం మానసిక చికిత్స తీసుకోవాల్సి వచ్చింది. దీని ప్రభావంతో తాత్కాలికంగా ఏ ఉద్యోగమూ చేయలేకపోయానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న తన కుటుంబ సభ్యులను కలిసేందుకు వచ్చిన ఆయన ఒక ఆంగ్ల పత్రికతో మాట్లాడుతూ.. "నా జీవితం మంచికే మారింది అని అందరూ అంటారు. కానీ ఆనాటి దృశ్యాలు నన్ను ఇప్పటికీ కలవర పెడుతున్నాయి" అని చెప్తూ కన్నీటి పర్యంతం అయ్యారు.

## వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

# ప్రత్యామ్నాయ పంటల సాగువైపు రైతులు మళ్లాలి...

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**వచ్చే జూన్ వరకు త్రాగునీటికి సరిపడా నీటి వినియోగంపై కార్యాచరణ సిద్ధం**

**రూ.175 లక్షల యూఐడీఎఫ్ నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన**

**వి.వెంకటాయపాలెం డీప్‌కట్ వద్ద గోదావరి జలాలను పరిశీలించిన మంత్రి తుమ్మల, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**



**ఖమ్మం, వుదయం బ్యూరో జూలై -22:**

త్రాగునీటిని కాపాడుకుంటూ, రైతులు అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కలిసి వి. వెంకటాయ పాలెం డీప్‌కట్ వద్ద గోదావరి జలాల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం అధికారులు, ఇంజినీర్లతో ప్రస్తుత నీటి లభ్యత, త్రాగునీటి సంరక్షణ, గోదావరి జలాలను ఖమ్మం వైపు మళ్లించే కార్యాచరణాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున ప్రతి చుక్క నీటిని జాగ్రత్తగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ సూచించిన విధంగా రైతులు ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు వంటి తక్కువ నీటిఅవసరమున్న పంటలను సాగు చేయాలని సూచించారు. ఏప్రిల్ 2026 నుంచే అధికారులు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతులు వరి సాగుపై పట్టుబడితే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు.1977లో వచ్చిన కరువు కంటే ప్రస్తుతం వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న సూపర్ ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రమై ఉండే అవకాశముందని అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో దీని ప్రభావం పెరిగి భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశం ఉందని, త్రాగునీటి పరిరక్షణపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఖమ్మం జిల్లాకు కృష్ణా జలాలు మాత్రమే సరిపోవని, దశాబ్దాలుగా గోదావరి జలాలను తీసుకురావాలనే ప్రజల ఆకాంక్ష ఉందన్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో సీతారామ ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి శ్రీరాముడి పేరుతో 'సీతారామ' ప్రాజెక్టుగా నామకరణం చేశామని తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు జిల్లాకు అందుతున్నాయని చెప్పారు.ఇంజినీర్ల సూచనల మేరకు వైరాకు తరలించిన గోదావరి నీటిని రాజీవ్ కాలువ షట్టర్లు మూసివేసి తిరిగి ఖమ్మం వైపు మళ్లించే ప్రయోగం జరుగుతోందన్నారు. మంచుకొండతో పాటు ఇతర ఎత్తిపోతల వ్యవస్థల ద్వారా చెరువులు నింపి, మంచుకొండ ఓవర్‌ఫ్లోను మున్నేరులోకి మళ్లించడం ద్వారా ఖమ్మం నగర త్రాగునీటి అవసరాలను తీర్చేప్రయత్నం చేస్తున్నామని వివరించారు. అవసరమైతే డీప్‌కట్ నుంచి మంచుకొండకు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలించే అత్యవసర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.సుమారు రూ.90 కోట్లతో నిర్మించిన రాజీవ్ కాలువ వల్ల రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పరిస్థితి ఏర్పడిందని, ఇది సాగునీటి రంగంలో విశేష విజయమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు సాంకేతిక సూచనలు అందించి విజయవంతంగా పూర్తి చేసిన ఇంజినీర్లను ప్రత్యేకంగా అభినందించారు. పశ్చిమాసియా యుద్ధాల ప్రభావంతో బొగ్గు, గ్యాస్ కొరత ఏర్పడి విద్యుత్ సరఫరా, యూరియా ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. రైతులకు పారదర్శకంగా యూరియా అందించేందుకు ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టిందని, ఇది పూర్తిగా రైతుల సంక్షేమం కోసమేనని చెప్పారు. రాజకీయ ప్రేరేపణలను నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. వీబీజీ ఆర్‌ఏఎం నిధులను వినియోగించి ఎన్‌ఎస్‌పీ కాలువల్లో పెరిగిన పొదలను తొలగించాలని జిల్లా కలెక్టర్‌కు మంత్రి సూచించారు. ఖమ్మం నగరంలో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని, విద్యుత్ స్తంభాల సమీపంలో మొక్కలు నాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత చాలా తక్కువగా ఉందని, రాబోయే నెలల్లో వర్షాలు కురవకపోతే త్రాగునీటి సమస్య కూడా తలెత్తే అవకాశముందని అన్నారు. అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వినియోగిస్తూ వచ్చే జూన్–2027 వరకు త్రాగునీటి అవసరాలు తీరేలా కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. ఇప్పటి వరకు గోదావరి జలాలను వైరాకు తరలించామని, ప్రస్తుతం రాజీవ్ కాలువ షట్టర్లను మూసివేసి గోదావరి నీటిని తిరిగి ఖమ్మం వైపు మళ్లించి పాలేరు రిజర్వాయర్ ను నింపే అవకాశాలను ఇంజినీర్లు, నిపుణులు పరిశీలిస్తున్నారని చెప్పారు. ఈ ప్రక్రియను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగాపర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ ప్రయోగం ద్వారా త్రాగునీటి సమస్యను అధిగమించగలమనే విశ్వాసం ఉందన్నారు. అయితే వర్షాలు లేకుంటే వరి, మిర్చి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగు కష్టసాధ్యమవుతుందని హెచ్చరించారు. నీరు కనిపిస్తున్నదని నిర్లక్ష్యం చేయకుండా అధికారులు సూచిస్తున్న ప్రత్యామ్నాయ పంటలనే సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.అనంతరం మంత్రి ఖమ్మం నగరంలోని 3, 4, 5 డివిజన్లలో యూఐడీఎఫ్ నిధులతో రూ.175 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో సుడా ఛైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ ఛైర్మన్ హన్మంతరావు, సిఇ ఇర్రిగేషన్ శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, డిపిఓ రాంబాబు, వివి పాలెం గ్రామ సర్పంచ్ కాపా ఆది నారాయణ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఖాకీలో మానవత్వం.. ఏజెన్సీ గిరిజనులకు విద్యా వెలుగులు నింపుతున్న చర్ల పోలీస్

**చర్ల/భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , జూలై 22(వుదయం ప్రతినిధి)**



:పోలీస్ అంటే కేవలం చట్టాన్ని అమలు చేసే వ్యవస్థ మాత్రమే కాదు.. సమాజంలో మార్పు తీసుకొచ్చే శక్తి కూడా అని మరోసారి నిరూపించింది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పోలీస్ శాఖ. మారుమూల ఏజెన్సీ గిరిజన గ్రామాల చిన్నారులు వర్షంలో తడుస్తూ, ఎండలో ఇబ్బందులు పడుతూ చదువుకుంటున్న పరిస్థితిని గమనించిన చర్ల పోలీస్ అధికారులు, వారి కోసం పాఠశాలలను నిర్మించి విద్యకు కొత్త బాటలు వేస్తున్నారు. చర్ల మండలం బక్కచింతలపాడు గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పాఠశాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం డీఎస్పీ అరుణ్, యస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సిఐ రాజు వర్మ, నర్సిరెడ్డి, కేశవ్ లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు గిరిజన పిల్లల విద్య, ఆరోగ్యం, సామాజిక అభివృద్ధిపై విలువైన సందేశాలు ఇచ్చారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ, "జిల్లాలోనే చర్ల పోలీస్ ప్రత్యేకం" అని కొనియాడారు. గతంలో బూరుగుపాడులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాఠశాల ద్వారా ఎన్నో గిరిజన చిన్నారులు ప్రయోజనం పొందుతున్నారని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ఎస్సై నర్సిరెడ్డి తన మిత్రుల సహకారంతో బక్కచింతలపాడు గ్రామంలో మరో పాఠశాల నిర్మించడం అభినందనీయమని అన్నారు.గిరిజన గ్రామాల్లో మూఢనమ్మకాలను నమ్మకుండా అనారోగ్యం కలిగితే వెంటనే చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యులను సంప్రదించాలని ఎస్పీ సూచించారు. తాను కూడా పేద కుటుంబం నుంచే వచ్చానని, చదువే మనిషిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుందని చెప్పారు. పోలీస్ శాఖ నిర్మించిన పాఠశాలలను సద్వినియోగం చేసుకునే బాధ్యత తల్లిదండ్రులదేనని, ప్రతి చిన్నారిని క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని కోరారు.గ్రామాభివృద్ధికి చదువుకున్న యువతే ప్రధాన శక్తి అని పేర్కొన్న ఎస్పీ, ఏజెన్సీ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను అతివేగంగా నడపడం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని హెచ్చరించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం ద్వారా ప్రాణాపాయాలను నివారించవచ్చని సూచించారు.డీఎస్పీ అరుణ్ మాట్లాడుతూ చర్ల పోలీస్ బృందం చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. పిల్లల ఆరోగ్యం, పరిశుభ్రత విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గిరిజన పిల్లలకు భాషాపరమైన ఇబ్బందులు ఉండే అవకాశం ఉన్నందున ఈ పాఠశాలకు అనుభవజ్ఞులైన, బాధ్యతాయుతమైన ఉపాధ్యాయులను నియమించాలని మండల విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.చర్ల సీఐ రాజువర్మ మాట్లాడుతూ, విద్య ద్వారానే సమాజంలో శాశ్వత మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. "పిల్లలకు ఎలాంటి సహాయం కావాలన్నా చర్ల పోలీస్ శాఖ మీకు అండగా ఉంటుంది.. మేమున్నాం" అని భరోసా ఇచ్చారు. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదని, ప్రతి చిన్నారి చదువుకోవాలని ఆకాంక్షించారు.గతంలో బూరుగుపాడులో పాఠశాల నిర్మాణంతో గిరిజన చిన్నారులకు ఆశ్రయం కల్పించిన సీఐ రాజువర్మ, అదే సేవా దృక్పథాన్ని కొనసాగిస్తూ ఎస్సై నర్సిరెడ్డి తన మిత్రుల సహకారంతో బక్కచింతలపాడులో మరో పాఠశాలను నిర్మించడం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. గిరిజన చిన్నారుల కష్టాలను స్వయంగా చూసి, వాటికి శాశ్వత పరిష్కారం చూపాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాలు చేపట్టిన పోలీస్ అధికారుల సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని గ్రామస్థులు కొనియాడారు.చర్ల పోలీస్ శాఖలో సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి, పోలీస్ సిబ్బంది కేశవ్ సమాజ సేవను తమ



విధుల్లో భాగంగా భావించి గిరిజన గ్రామాల్లో విద్య, ఆరోగ్యం, ప్రజా చైతన్యం కోసం చేస్తున్న కృషి ప్రశంసనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతలకు మాత్రమే పరిమితం కాకుండా, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ఇలాంటి అధికారులను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అభిప్రాయపడ్డారు.ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యా వెలుగులు నింపుతూ, గిరిజన చిన్నారుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ, ఎస్పీ రోహిత్ రాజ్ నాయకత్వంలో డీఎస్పీ అరుణ్, యస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి బృందం చేస్తున్న సేవలు నిజంగా అభినందనీయం అని పలువురు ప్రశంసించారు.గ్రామంలో రమేష్ కబడ్డీ నేషనల్ టీంలో ప్రాతినిధ్యం వహిస్తున్న సందర్భంగా అభినందనలు తెలుపుతూ సన్మానించారు ఈ సందర్భంగా మంచిగా చదువుకొని మంచి స్థానంలో ఉండాలని సూచించారు. కరెంట్ షాక్ గురైన ఇడమయ్య కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో పులిగుండాల సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు సోడి చలపతి, మండల విద్యాశాఖ అధికారి పరిటాల వెంకట రమణ, ప్రధానోపాధ్యాయులు, విజయ్ బాబు, చందు, జోగయ్య, గ్రామస్తులు, పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై రాజీ లేదు

**- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ**



**సూర్యాపేట జులై 22; వుదయం ప్రతినిధి**

రోడ్డు ప్రమాదంలో పోయే ప్రతి ప్రాణం అత్యంత విలువైందని, ఇకపై రహదారి భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు.సుప్రీం కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే సంబంధిత అధికారులపై వ్యక్తిగత శిక్షలు, భారీ జరిమానాలు తప్పవని హెచ్చరించారు.రాజస్థాన్, రంగారెడ్డి జిల్లాల్లో జరిగిన భారీ ప్రమాదాలను సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించిన నేపథ్యంలో.. జిల్లా కలెక్టరేట్‌లో రవాణా, రెవెన్యూ, విద్య, వైద్యం, పోలీస్, ఆర్ అండ్ బి, పంచాయతీ, నేషనల్ హైవే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.బ్లాక్ స్పాట్ల గుర్తింపు: జిల్లాలోని జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి రోడ్లపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్లను వెంటనే గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చే 45 రోజుల్లోగా ప్రమాదకర ప్రాంతాల పూర్తి జాబితాను సిద్ధం చేయాలని, 4 నెలల్లోగా ఆయా ప్రాంతాల్లో హై–ఇంటెన్సిటీ ఎల్‌ఈడి లైట్లు, స్పీడ్ కెమెరాలు, రెట్రో–రిఫ్లెక్టివ్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.హైవేలపై అక్రమ పార్కింగ్ కు చలానా: జాతీయ రహదారుల మెయిన్ రోడ్డు, పక్కన ఉన్న షోల్డర్స్‌పై భారీ వాహనాలను పార్క్ చేయడంపై పూర్తి నిషేధం అని తెలిపారు. వాహనాలను కేవలం నిర్దేశిత లే–బై ప్రాంతాల్లో లేదా పెట్రోల్ బంకుల వద్ద మాత్రమే ఆపాలని సూచించారు. ప్రతి 75 కిలోమీటర్లకు ఒక లే–బై సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలు మీరితే ఈ–చలానా, జీపీఎస్ ఆధారిత ఫోటోగ్రాఫిక్ సాక్ష్యాలతో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఆక్రమణల తొలగింపునకు గడువు: హైవేల పక్కన నిబంధనలకు విరుద్ధంగా వెలసిన దాబాలు, హోటళ్లు, వాణిజ్య నిర్మాణాలను 30 రోజుల్లో తొలగించాలని ఆదేశించారు. కొత్తగా ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని, డ్రోన్ సర్వేల ద్వారా ఆక్రమణలను తొలగించాలన్నారు.రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్యం: ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు వైద్యం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి 75 కిలోమీటర్లకు ఒక బేసిక్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని, బాధితులకు రూ. 1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందించే పథకాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు.ప్రతి 15 రోజులకోసారి రివ్యూ: రోడ్డు భద్రతపై చేతల్లో చూపాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందించాలి: కలెక్టర్



**జనగామ, జూలై 22 (వుదయం ప్రతినిధి) :**

పేద విద్యార్థుల భవిష్యత్తు పూర్తిగా ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, తరగతి గదిలోకి వచ్చిన ప్రతి విద్యార్థి విద్యావంతుడిగా బయటకు వెళ్లేలా బోధించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. బుధవారం లింగాల ఘనపూర్ మండలం నెల్లుట్ల హై స్కూల్‌లో ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యారంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పాఠశాలల్లో ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని, వీటిని సద్వినియోగం చేస్తూ విద్యా వ్యవస్థలో పారదర్శకత, నాణ్యత పెంచాలని సూచించారు. రాజ్యాంగంపై అవగాహన, ప్రతి ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ ఉపోద్ఘాతం, ప్రాథమిక హక్కు లు, ముఖ్యమైన ఆర్టికల్స్, ప్రపంచ పటం మరియు భారతదేశ భౌతిక–రాజకీయ పటాల ప్రదర్శన బోర్డులను ఏర్పాటు చేయాలి.బోధనా విధానం జియోగ్రఫీ, ఎకనామిక్స్, సైన్స్ వంటి విషయాలను విద్యార్థులకు ఆసక్తికరంగా, సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించాలి.నేరుగా క్లాస్ రూమ్‌కి కలెక్టర్: పదో తరగతి గదిని సందర్శించి విద్యార్థులకు గణితంలోని పలు అంశాలను సులభ పద్ధతిలో వివరించిన కలెక్టర్, వారిని ప్రశ్నలు అడిగి ప్రోత్సహించారు.

# ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు పరకాల ఎమ్మెల్యే స్వాగతం



**పరకాల జులై 22 (వుదయం ప్రతినిధి):**

హనుమకొండ జిల్లాలో బుధవారం నిర్వహించిన పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్కకు పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు.ఎన్ఐటీ గెస్ట్ హౌస్ వద్ద జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఉప ముఖ్యమంత్రిని ఆహ్వానించిన రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లాలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మేలు చేకూర్చాలని ఆకాంక్షించారు.

# గిరిజన యువతకు నైపుణ్యాలే భవిష్యత్తు

**అశ్వారావుపేటలో ఐటీడీఏ ఆధ్వర్యంలో యువజన శిక్షణ కేంద్రం ప్రారంభం**

**కుట్టు మిషన్లు, కంప్యూటర్లు, బ్యూటీషియన్, టెక్నికల్ స్కిల్స్‌తో ఉపాధి అవకాశాల కల్పనశిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు, ఉపాధి కల్పనకు చర్యలు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**



**అశ్వారావుపేట, జూలై 22 (వుదయం ప్రతినిధి ):**

గిరిజన యువతను స్వయం ఉపాధి వైపు నడిపించేందుకు తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట గిరిజన భవన్‌లో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) భద్రాచలం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువజన శిక్షణ కేంద్రాన్ని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ సంయుక్తంగా ప్రారంభించారు. గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి, వారికి స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని వారు తెలిపారు.ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, నేటి కాలంలో కేవలం విద్య ఒక్కటే సరిపోదని, విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. ప్రభుత్వం గిరిజన యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, దీని ద్వారా వందలాది మంది యువతీ యువకులు తమ జీవితాలను తీర్చిదిద్దుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు.ఈ కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ, కుట్టు మిషన్ శిక్షణ, బ్యూటీషియన్ కోర్సులు, చేతివృత్తులపై ప్రత్యేక శిక్షణ, టెక్నికల్ స్కిల్స్, ఉపాధి ఆధారిత వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. శిక్షణను విజయవంతంగా పూర్తిచేసిన వారికి ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు, ఆయా రంగాల్లో ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.గిరిజన యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి శిక్షణ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల యువత పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నాణ్యమైన శిక్షణ పొందే అవకాశం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉపాధి కోసం ఎదురు చూడకుండా, నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి ద్వారా కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు.ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ, గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అత్యంత ముఖ్యమైనవని అన్నారు. యువజన శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకుడికి శిక్షణ అందిస్తామని తెలిపారు. శిక్షణ కాలంలో అవసరమైన మౌలిక వసతులు, శిక్షణా సామగ్రి, నిపుణుల ద్వారా బోధన వంటి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.శిక్షణ అనంతరం యువత ఉద్యోగ అవకాశాలను పొందేలా ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ సంస్థలతో అనుసంధానం చేసే చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

# భూ సర్వే వేగవంతం చేయాలి – విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి: కలెక్టర్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 22 (వుదయం ప్రతినిధి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం జూలూరుపాడు మండలంలో పర్యటించి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ కు సంబంధించిన భూ సేకరణ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూ సర్వే పనులను ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో వేగవంతంగా పూర్తి చేసి నిర్ణీత గడువులో ముగించాలని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం పడమటి నరసాపురం గిరిజన బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న విద్య, ఆహారం, వసతి సౌకర్యాలను పరిశీలించారు.సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూ సేకరణ సర్వే పురోగతిపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సర్వేలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు.జూలూరుపాడు గ్రామ పరిధిలో 17 ఎకరాల 20 గుంటల భూమికి సర్వే చేపట్టాల్సి ఉండగా, అందులో సుమారు 8 ఎకరాలు ఆర్ఓఎఫ్ఆర్ పట్టా భూములుగా ఉన్నాయని అధికారులు వివరించారు. అనంతరం కొత్తూరు గ్రామంలో కొనసాగుతున్న సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్, మొత్తం 337 ఎకరాల భూమికి సర్వే నిర్వహించాల్సి ఉందని తెలుసుకుని, పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని ఆదేశించారు.భూ సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రతి దశను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. సర్వేకు అవసరమైన మార్కింగ్ పనులను ఒక రోజులో పూర్తి చేసి తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా స్థానిక రైతులు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ వెడల్పును 50 మీటర్ల నుంచి 40 మీటర్లకు తగ్గించాలని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ప్రాజెక్టు డిజైన్‌ను సాంకేతికంగా పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం పడమటి నరసాపురం గ్రామంలోని గిరిజన బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వంటశాల, విద్యార్థుల వసతి గదులు, పారిశుధ్య నిర్వహణను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు.

# జిల్లాను గిరిజన వైద్య పరిశోధనల హబ్‌గా తీర్చిదిద్దుతాం: కలెక్టర్



**ములుగు, జూలై 22 (వుదయం ప్రతినిధి) :**

గిరిజన ఆరోగ్య సేవలు, వైద్య పరిశోధనలను మరింత బలోపేతం చేసే దిశగా ములుగు జిల్లాలో అత్యాధునిక కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు తెలిపారు.బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో బీబీనగర్ ఎయిమ్స్ (AIIMS) డీన్ (రిసెర్చ్) డా. రాహుల్ నరాంగ్ నేతృత్వంలోని బృందం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ములుగులోని 'సమ్మక్క–సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ' సహకారంతో "సెంటర్ ఫర్ ట్రైబల్ హెల్త్ అండ్ అకడమిక్ ఎక్సలెన్స్" ఏర్పాటుపై విస్తృతంగా చర్చించారు.ముఖ్యమైన విషయాలు:ప్రత్యేక పరిశోధనలు ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించే సికిల్ సెల్ అనీమియా, తలసీమియా, రక్తహీనత, మలేరియా, డెంగ్యూ, క్షయ (TB), స్క్రబ్ టైఫస్, జునోసిస్ వంటి వ్యాధులపై సమగ్ర పరిశోధనలు నిర్వహిస్తారు.మెరుగైన సేవలుకోసం గ్రామీణ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు టెలిమెడిసిన్ సేవలను విస్తరిస్తారు.నైపుణ్యాభివృద్ధి,శిక్షణ గిరిజన యువతకు ఆరోగ్య విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందిస్తూ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఎయిమ్స్ బీబీనగర్, సమ్మక్క–సారక్క ట్రైబల్ యూనివర్సిటీల సంయుక్త ఆధ్వర్యంలో ములుగును గిరిజన వైద్య పరిశోధనలకు జాతీయ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. గోపాలరావు, ఏరియా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు డా. చంద్రశేఖర్, డా. సురేష్, ఎయిమ్స్ వైద్య బృందం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## రోడ్లపై సంచరించే పశువులను గోశాలకు తరలిస్తాం...

### మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ



**మంచిర్యాల /రామకృష్ణాపూర్/జూలై 22 (వుదయం ప్రతినిధి)**

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆవులు, గేదెలు బహిరంగ ప్రదేశాలలో విచ్చలవిడిగా రోడ్లపై సంచరిస్తున్నాయని, వాహన ప్రమాదాలకు కారణమవుతున్నాయని, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని పుర ప్రజల నుండి వినతులు వచ్చిన నేపథ్యంలో అట్టి పశువులను పశువుల యజమానులు మూడు రోజులలో తమ ఆధీనంలోకి తీసుకోవాలని, లేనియెడల అట్టి పశువులను గోశాలలకు తరలించడం జరుగుతుందని మునిసిపాలిటీ కమిషనర్ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పత్రికా ప్రకటన వెలువడిన నుండి మూడు రోజులలో పశువులను పశువుల యజమానులు తమ ఇంటికి తీసుకువెళ్లాలని, లేనట్లయితే గోశాలలకు తరలిస్తామని స్పష్టం చేశారు.

## బండి సంజయ్ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి యత్నం

### కరీంనగర్ సీపీకి బీజేపీ నాయకుల ఫిర్యాదు



**కరీంనగర్ జులై 22 (వుదయం ప్రతినిధి):**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ స్థానిక కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడికి యత్నించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి&కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్(మాజీ మేయర్) యాదగిరి సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, 49వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం ప్రకాష్, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కరండ్ల మధుకర్, సెంట్రల్ ఫిలిం బోర్డు మెంబర్ రాపాక ప్రవీణ్, కో-ఆప్షన్ సభ్యులు సర్దార్ బల్బీర్ సింగ్, బీజేపీ సీనియర్ నాయకులు పుప్పాల రఘు తో కలిసి కరీంనగర్ పోలీస్ కమిషనర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

## కేటీఆర్‌కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఏనుగు మనోహర్ రెడ్డి



**రాజన్న సిరిసిల్ల జిల్లా , జూలై 22 (వుదయం ప్రతినిధి):**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఏనుగు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేటీఆర్ అందిస్తున్న సేవలు, పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషి ఆదర్శనీయమని కొనియాడారు. ప్రజలతో మమేకమై పార్టీని మరింత బలోపేతం చేసే నాయకత్వం కేటీఆర్ సొంతమని పేర్కొన్నారు. ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో దీర్ఘాయుష్షుతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఏనుగు మనోహర్ రెడ్డి తెలిపిన శుభాకాంక్షలకు ధన్యవాదాలు తెలియజేస్తూ, పార్టీ శ్రేణులు ప్రజలకు మరింత చేరువై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు .

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి:

### ఈగల్ ఫోర్స్ డీఎస్పీ సోమనాథం పిలుపు



**నిజామాబాద్, జూలై 22:**

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ), నిజామాబాద్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ సందర్భంగా గిర్‌రాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిజామాబాద్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ ఎం. సోమనాథం, డీఎస్పీ, ఈగల్ ఫోర్స్, నిజామాబాద్ మాట్లాడుతూ, విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, మంచి స్నేహాలను ఎంచుకుని విద్య, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. తెలంగాణప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు, కఠిన అమ లు చర్యలను సమర్థవంతంగా కొనసాగిస్తోందని తెలిపారు. కేవలం సరదాగా మాదకద్రవ్యాలను ఒకసారి వినియోగించినా అదివ్యసనానికి దారితీసే ప్రమాదముందని హెచ్చరించారు. ఐదు నుంచి ఏడు సంవత్సరాలను విద్య, నైపుణ్యాభివృద్ధికి అంకితం చేసి, స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని, సానుకూల స్నేహ వాతావరణాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు.

## రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి

### ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



**కామారెడ్డి, జూలై 22 (వుదయం ప్రతినిధి):**

ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై పోలీసుల చర్యలు, అరెస్టుకు నిరసనగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపుమేరకు బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్ వైపు వెళ్తున్న షబ్బీర్ అలీని పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకుని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష స్వరాన్ని అణచివేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. పరీక్షలపై నమ్మకం కోల్పోయి ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని, వారికి తగిన ఆర్థిక సహాయం, పూర్తి స్థాయి మద్దతు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ ప్రజల సమస్యలను, విద్యార్థుల భవిష్యత్తును, యువత ఆవేదనను దేశం ముందుకు తీసుకువస్తున్నారని, అలాంటి నాయకుడిని అరెస్టు చేయడం ద్వారా నిజాలను దాచలేరని షబ్బీర్ అలీ అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిందని, ఆ హక్కును కాలరాయడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల సమస్యలపై తన పోరాటాన్ని ఎప్పటికీ ఆపదని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు ఉద్యమాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి: కలెక్టర్



**మంచిర్యాల /జూలై 22 (వుదయం ప్రతినిధి)**

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సి.ఐ. రవీందర్ తో కలిసి సందర్శించి భద్రతా చర్యలలో భాగంగా సి.సి. కెమెరాల ఏర్పాటు, భోజనశాల, వంటశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల భద్రత దృష్ట్యా సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ బి.పి.సి. విద్యార్థులతో మాట్లాడుతూ విద్యా బోధన నాణ్యత పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటించాలని, వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ సంతోష్ కుమార్ తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను పరిశీలించారు. ప్రజల నుండి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో జాగ్రత్త వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ప్రక్రియ వేగవంతానికి బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు, యువత సహకారం తీసుకోవాలని తెలిపారు. భూభారతి, సాదా బైనమా, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో మోడీ ప్రభుత్వం చెలగాటం

### ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

### నీట్ పరీక్షల లీకేజీ, రాహుల్-ప్రియాంక అరెస్ట్‌పై

### భగ్గుమన్న నిరసనలు, ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దగ్ధం



**పెద్దపల్లి, జూలై 22 (వుదయం ప్రతినిధి)**

విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుకుంటోందని మూడు నెలల కిందట నీట్ పరీక్ష లీక్ కావడం వల్ల లక్షలాది మంది విద్యార్థులు రోడ్డున పడ్డారని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు,వరుస పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న తీరును నిరసిస్తూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు హోరెత్తాయి.ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ నివాసం ముట్టడికి యత్నించిన కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంకా గాంధీలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆధ్వర్యంలో బుధవారం కమాన్ చౌరస్తా వద్ద రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,స్థానిక నాయ కులు, యువజన సంఘాల కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.కేంద్ర ప్రభుత్వానికి మరియు ప్రధాని నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ తమ నిరసనను గట్టిగా చాటారు.ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ శ్రేణులు ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ ఆందోళన సమాచారం అందుకున్న ఏసీపీ గజ్జి కృష్ణ,సీఐ ప్రవీణ్ కుమార్,ఎస్సై నరేష్ తదితర పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుని పక్కకు తొల గించారు. ఆ ందోళ న కారుల ను నిలువరించి ధర్నాను విరమింపజేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మీడియాతో మాట్లాడుతూ దేశంలో గడచిన 12 ఏళ్ల పాలనలో ఏకంగా 12 సార్లు ప్రశ్నపత్రాలు లీకయ్యాయని,నిరుద్యోగ యువత,లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వం అంధకారంలోకి నెట్టేస్తోందని ధ్వజమెత్తారు.మొన్నటికి మొన్న నీట్ పరీక్ష లీకేజీ కారణంగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు రోడ్డున పడ్డారని, మానసిక వేదనతో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడం అత్యంత బాధాకరమన్నారు.ప్రాణాలు కోల్పోయిన ప్రతి విద్యార్థి కుటుంబానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తమ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం,పదేళ్లలో కోట్లాది మంది యువతను మోసగించిందని విమర్శించారు.దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ,ఎంపీ ప్రియాంకా గాంధీలపై అణచివేత ధోరణి ప్రదర్శిస్తూ వారిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జీ చేయడం, అక్రమ అరెస్టులకు పాల్పడడం మోడీ ప్రభుత్వ అహంకార ధోరణికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడి, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, లేనియెడల రానున్న రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు,యువజన సంఘాల కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

## ప్రజలకు పారదర్శక, నాణ్యమైన పోలీసు సేవలు అందించాలి జిల్లా ఎస్పీ నితికా పంత్



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్, బుధవారం లింగాపూర్, సిర్పూర్ (యు) పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణపై సబ్ ఇన్స్పెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, ఎఫ్ఐఆర్‌లు, కేసు డైరీలు, పెండింగ్ కేసులు, ఆయుధాగారం, లాక్‌అప్, పరిశుభ్రత, సీసీ కెమెరాల పనితీరు, సిబ్బంది హాజరును పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జనరల్ డైరీ ను ప్రతిరోజూ క్రమం తప్పకుండానమోదు చేయడంతో పాటు, బయటి విధులకు వెళ్లే ప్రతి పోలీసు సిబ్బందికి డ్యూటీ పాస్ జారీ చేసి వారి రాకపోకల వివరాలను నమోదు చేయాలని సూచించారు. అన్ని కేసులను సకాలంలో పోర్టల్‌లో నమోదు చేసి ఎలాంటి ఎంట్రీలు పెండింగ్‌లో లేకుండా చూడాలని ఆదేశించారు.ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ 24 గంటల పెట్రోలింగ్ నిర్వహించాలని, సైబర్ నేరాలు, అనుమానాస్పద వ్యక్తులు, రాత్రి వేళల్లో నిఘా పెంచాలని సూచించారు. ప్రతి రోజు రోల్ కాల్ నిర్వహించి విధుల కేటాయింపు, చట్టాలపై అవగాహన, క్రమశిక్షణ, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించే అంశాలపై సిబ్బందికి సూచనలు ఇవ్వాలని తెలిపారు.ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి పారదర్శకంగా దర్యాప్తు నిర్వహించాలని, మహిళలు, చిన్నారులపై నేరాలు, సైబర్ నేరాలు, గుట్కా, గుడుంబా, జూదం, మట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్ తదితర అక్రమ కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీట్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేస్తూ కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారాన్ని పొందాలని సూచించారు. అలాగే స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణలో నాణ్యత పాటిస్తూ ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ సూచించారు.ఈ తనిఖీలో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్ , జైనూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్, సబ్ఇన్స్పెక్టర్లు సురేష్, కొమురయ్యతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై సమీక్ష, అవగాహన సమావేశం



**కామారెడ్డి, జూలై 22 (వుదయం ప్రతినిధి):**

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై సమీక్షా సమావేశం, అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్ ప్రక్రియ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కోఆర్డినేటర్లు యాదయ్య, ధనలక్ష్మి , ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, లింగంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, స్థానిక నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో సర్ ప్రక్రియను 100 శాతం విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుతం 94 శాతం ఓటరు మ్యాపింగ్ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేసి ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో పేరు ఉండేలా చర్యలు తీసుకోవాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి అమూల్యమని, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఓటు హక్కును బలహీనపరిచే ఎలాంటి చర్యలనైనా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు.అలాగే, "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్" పేరుతో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే ప్రయత్నాలపై దేశవ్యాప్తంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, బిఎల్ ఏ కీలక బాధ్యతతో పని చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సూచించినట్లుగా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఓటు హక్కు అత్యంత కీలకమని అన్నారు.సమావేశం అనంతరం గ్రామాల్లో 100 శాతం ఓటర్ మ్యాపింగ్ పూర్తి చేసిన బిఎల్ఎలను ఎమ్మెల్యే మదన్ మోహన్ ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జులు, కో ఆర్డినేటర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బిఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలన...

### ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు సహకరించాలి..కలెక్టర్



**జగిత్యాల జులై 22 (వుదయం ప్రతినిధి)**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తెలిపారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో ఇంటింట నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు ఫారాలను పంపిణీ చేయగా ఫారాలను కూడా ఈ ఆగష్టు 3వ తేదీలోపు సంబంధిత బీఎల్ఓ లకు అందజేయాలని ప్రజలను కోరారు. ప్రజలకు ఫారాలు నింపడంలో ఏవైనా సందేహాలు ఉంటే తమ పరిధిలోని బీఎల్ఓ లను లేదా ఎన్నికల అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఓటరికి అవసరమైన సహాయం అందించేందుకు ఎన్నికల సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఫారాల సేకరణ డిజిటైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కొంతమంది ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో నివసించడం లేదని వేరే ప్రాంతాలకు మారారని లేదా ఇతర ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకున్నారని బీఎల్ఓ ల ద్వారా సమాచారం అందుతోందన్నారు. అలాంటి వారు తప్పనిసరిగా సంబంధిత ఫారాన్ని పూర్తి చేసి తమ ప్రస్తుత వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. వేరే ప్రాంతంలో ఓటు ఉన్నట్లయితే ఆ వివరాలను ఫారంలో పేర్కొనడం ద్వారా అవసరమైన మార్పులు చేసి సరైన నియోజకవర్గంలో ఓటు కొనసాగేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒకవేళ ఫారాలు సమర్పించకుండా ఎలాంటి స్పందన ఇవ్వకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలన అనంతరం ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడే అవకాశం ఉందని పేర్కొన్నారు ప్రతి అర్హ ఓటరు ఆగష్టు 3వ తేదీ లోపు ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్ఓ లకు అందజేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ తహసీల్దార్ షాదాబ్ హకీం బిఎల్ఓ లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉట్నూర్‌లో కలెక్టర్ విస్తృత పర్యటన

### - ఇందిరమ్మ ఇళ్లు, హాస్టల్ తనిఖీ.. జలసిరి పనులకు శ్రీకారం



**ఆదిలాబాద్ (వుదయం ప్రతినిధి):**

ఉట్నూర్ మండలంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా బుధవారం విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు గ్రామాల్లో నీటికుంటల నిర్మాణం అత్యంత అవసరమని ఆయన అన్నారు.ముందుగా పెద్ద సుద్దగూడ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్, పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులతో సమావేశమై ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని సూచించారు. అనంతరం ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన వంటగది, భోజనశాల, సరుకుల నిల్వ గదులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారికి అందుతున్న భోజనం, వసతులు, విద్యా బోధనపై వివరాలు తెలుసుకున్నారు.తదుపరి ఐటీడీఏ కార్యాలయం నుంచి ఎవరెస్ట్ శిఖరారోహణకు బయలుదేరిన పర్వతారోహకులు మాడవి కన్నీబాయి, కాట్లే ఆనందరావులను జెండా ఊపి ఘనంగా సాగనంపారు. జిల్లా యంత్రాంగం తరఫున వారిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గంగాపూర్ గ్రామంలో "తెలంగాణ జలసిరి" కార్యక్రమంలో భాగంగా నీటికుంటల నిర్మాణ పనులకు కలెక్టర్ శ్రీకారం చుట్టారు. అలాగే మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ, పోషకాహార లోప నివారణ లక్ష్యంగా ఏర్పాటు చేసిన "పోషకాహార తోట"ను ప్రారంభించి మొక్కను నాటి నీరు పోశారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్, ఆర్డీవో రాథోడ్ మోహన్సింగ్, ఎంపీడీవో రైసోద్దీన్, ఎమ్మార్వో రఘునాథ్, ఐటీడీఏ అధికారులు, వైద్య, విద్యా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సర్ వంద శాతం పూర్తి చేసేందుకు రాజకీయ పక్షాలు సహకరించాలి

### తాసిల్దార్ రామ్మోహన్ రావు.



**బెజ్జూర్ ( వుదయం ప్రతినిధి )**

సర్ ప్రోగ్రాం వంద శాతం పూర్తి చేసేందుకు రాజకీయ పక్షాలు సహకరించాలని బెజ్జూరు తహసిల్దార్ పి. రామ్మోహన్ రావు అన్నారు. తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ పార్టీల రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ రామ్మోహన్ రావు మాట్లాడారు. బెజ్జూర్ లో ఇప్పటికే 85% సర్ ప్రోగ్రాం పూర్తయిందని 100% పూర్తి చేసేందుకు అందరు సహకరించాలని కోరారు. సర్ ప్రోగ్రాం లో బాగంగా బి ఎల్ ఒ లు ఇచ్చిన ఓటరు ఫారాలు తీసుకున్న ప్రజలు ఆగస్టు మూడు లోగా తిరిగి బీ ఎల్ ఓ లకు అందజేయాలని సూచించారు. ఇప్పటికే చనిపోయిన ఓటర్లు, డబుల్ గా ఉన్న ఓట్లను గుర్తించినట్లు తెలిపారు. బిఎల్ఓ ల వద్ద పారాలు తీసుకున్న ప్రతి ఓటరు, పారాలు రిటన్ చేయాలని, రిటర్న్ చేయని వారి ఓటు కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. గ్రామాల్లో రాజకీయ నాయకులు సర్ ప్రోగ్రాం సక్సెస్ చేసేందుకు సహకరించాలని కోరారు.

ఈ సమావేశంలో బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బిఎల్ ఒ లు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఆయిల్ పామ్ రైతులకు చారిత్రాత్మక శుభవార్త

- ఎకోపామ్ ఆయిల్ అండ్ ఫ్యాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ స్థాపనకు భూ కేటాయింపు ఉత్తర్వులు అందజేత

**వికారాబాద్, జూలై 22 (వుదయం బ్యూరో):**

వికారాబాద్ జిల్లాలో ఆయిల్ పామ్ సాగు అభివృద్ధికి మరో కీలక మైలురాయి నమోదైంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు విస్తరణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, జిల్లాలో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు మార్గం సుగమమైంది.తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు, M/s Ecopalm Oil and Fats Pvt. Ltd. సంస్థకు వికారాబాద్ జిల్లాలో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ స్థాపన కొరకు మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్కు దుద్యాల మండలంలో 30 ఎకరాలలో కేటాయింపు ఉత్తర్వులను అధికారికంగా అందజేశారు. ఈ నిర్ణయం జిల్లాలోని ఆయిల్ పామ్ రైతులకు సుస్థిరమైన ఆదాయ వనరును అందించడంతో పాటు, జిల్లాలో ఆయిల్ పామ్ సాగు అభివృద్ధికి కొత్త దిశను చూపనుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును విస్తృతంగా ప్రోత్సహిస్తూ నాణ్యమైన మొక్కలు, సబ్సిడీలు, సాంకేతిక సలహాలు మరియు ఇతర ప్రోత్సాహకాలను రైతులకు అందిస్తోంది. ఇప్పుడు జిల్లాలోనే ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కానుండటంతో రైతులు పండించే ఫ్రెష్ ఫ్రూట్ బంచ్‌లు (Fresh Fruit Bunches - FFB) సకాలంలో కొనుగోలు చేయబడటమే కాకుండా, రవాణా వ్యయం తగ్గి పంట నాణ్యత కాపాడబడుతుంది. అలాగే రైతులకు హామీ మార్కెట్, వేగవంతమైన కొనుగోలు ప్రక్రియ, సమయానికి చెల్లింపులు అందుబాటులోకి రానున్నాయి. ఆయిల్ పామ్ రైతులకు మరో ముఖ్యమైన ప్రయోజనం ఏమిటంటే, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల ఆయిల్ పామ్ ఫ్రెష్ ఫ్రూట్ బంచ్ (FFB)కు టన్నుకు



కొనుగోలు ధరను నిర్ణయిస్తుంది.దీంతో రైతులకు హామీ ధర లభించి, మార్కెట్ ధరల హెచ్చుతగ్గుల ప్రభావం తగ్గుతుంది. పంటకు స్థిరమైన మార్కెట్ లభించడంతో రైతులు ఆందోళన లేకుండా సాగు చేయగలుగుతారు. ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ జిల్లాలోనే ఏర్పాటు కావడంతో రవాణా ఖర్చులు తగ్గి, సకాలంలో కొనుగోలు మరియు వేగవంతమైన చెల్లింపులు జరగడం ద్వారా రైతుల ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది.

ఆయిల్ పామ్ ప్రపంచంలోనే అత్యధిక నూనె దిగుబడినిచ్చే వాణిజ్య పంటగా గుర్తింపు పొందింది. ఒకసారి నాటిన తరువాత అనేక సంవత్సరాల పాటు నిరంతర దిగుబడిని అందించే ఈ పంట రైతులకు స్థిరమైన, దీర్ఘకాలిక ఆదాయాన్ని అందిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, హామీ మార్కెట్, ప్రభుత్వం నిర్ణయించే కొనుగోలు ధర మరియు జిల్లాలోనే ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటు వంటి అంశాలు వికారాబాద్ జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు మరింత ఊతమివ్వనున్నాయి. జిల్లాలోని రైతులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహకాలను వినియోగించుకొని ఆయిల్ పామ్ సాగును చేపట్టి ఈ చారిత్రాత్మక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ విజ్ఞప్తి చేసింది. వికారాబాద్ జిల్లాను రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగులో అగ్రగామి జిల్లాగా తీర్చిదిద్దేందుకు శాఖ అన్ని విధాలుగా రైతులకు సహకారం అందిస్తుందని తెలిపింది.

## ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ఆగస్టు 24 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు

**నాగర్ కర్నూల్, జూలై 22 (వుదయం ప్రతినిధి):**

జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 2026-27 విద్యా సంవత్సరానికి నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (NMMS) పరీక్ష కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఈ నెల 24వ తేదీ వరకు సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్ బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.పరీక్షకు హాజరుకావాలనుకునే విద్యార్థులు http://bse.telangana.gov.in



వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.
ఆన్‌లైన్ నమోదు అనంతరం దరఖాస్తు ఫారం, ఎన్ఆర్ రెండు కాపీలు, ఎస్‌బీఐ కలెక్ట్ ఫీజు రసీదు ప్రింటెడ్ కాపీలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధృవీకరించి సెప్టెంబర్ 1, 2026 లోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపాలని తెలిపారు. ధృవీకరణ లేని దరఖాస్తులు తిరస్కరించబడతాయన్నారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధృవీకరణ, దివ్యాంగ అభ్యర్థులు వైద్య ధృవీకరణ పత్రాలు, అందరు విద్యార్థులు ఆదాయ ధృవీకరణ పత్రం తప్పనిసరిగా జతచేయాలని కోరారు. ధ్రువపత్రాలు లేనిచో దరఖాస్తు రద్దవుతుందని స్పష్టం చేశారు.ఎన్ఎంఎంఎస్ పరీక్షను 2026 డిసెంబర్ 1న నిర్వహించనున్నట్లు డిఇఓ రమేష్ కుమార్ తెలిపారు.

## 15వ వార్డులో ఘనంగా క్యాచ్ ది రైన్ కార్యక్రమం

**నారాయణపేట టౌన్ జూలై 22(వుదయం ప్రతినిధి)**



క్యాచ్ ది రైన్ కార్యక్రమంనారాయణ పేట పురపాలక సంఘం పరిధిలోని 15వ వార్డులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు బుధవారం ఘనంగా నిర్వహించారు. క్యాచ్ ది రైన్ వర్షపు నీటి నిల్వ, నీటి సంరక్షణ అవగాహన కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి 15వ వార్డ్ కౌన్సిలర్ బండి రాజేశ్వరి శివరాం రెడ్డి నాయకత్వం వహించగా, వార్డ్ ఆఫీసర్ సుభాని మున్సిపల్ సిబ్బంది భరత్, ప్రదీప్, భవ్య ,ఆర్పి రాధికా వార్డు ప్రజలు, బి. నాగమ్మ, రైసా ,మన్నే జయప్ప, బండి మలిరెడ్డి, యాంకే హన్మంతు, సాకాలి నాగప్ప ,మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని వర్షపు నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేశారు.ప్రతిజ్ఞ అవగాహనకార్యక్రమంలో భాగంగా వార్డు వీధిలో ప్రజలందరూ ఒకచోట చేరి, చేతులు చాచి నీటి సంరక్షణపై ప్రమాణం చేశారు. వర్షపు నీటి బొట్టు బొట్టును నిపుణతతో పట్టుకుందాం భూగర్భ జలాలను పెంచుకుందాం అనే సందేశాన్ని వ్యాప్తి చేసే ఉద్దేశంతో ఈ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ బండి రాజేశ్వరి శివరాం రెడ్డి మాట్లాడుతూ వర్షపు నీరు వృథాగా డ్రెయిన్లలోకి పోకుండా ఇంటింటికీ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.భవిష్యత్ తరాలకు వర్షపు నీటిని పొదుపుగా వాడుకోవడం, నీటి వనరులను కాపాడుకోవడం ద్వారా రాబోయే తరాలకు నీటి ఎద్దడి లేకుండా చూసుకోవచ్చని తెలిపారు.ప్రజాస్వామ్య భాగస్వామ్యం లో వార్డు ప్రజలంతా భాగస్వాములై ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసినందుకు వార్డు కౌన్సిలర్ నిర్వాహకులు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

## ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలు సేకరించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
- నిర్దేశిత గడువులోగా డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తాం: కలెక్టర్ కె. హైమావతి

**సిద్దిపేట, జూలై 21 (వుదయం బ్యూరో):**



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓ)లు తప్పనిసరిగా ఇంటింటికి వెళ్లి సమగ్ర సమాచారాన్ని సేకరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నుండి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పురోగతిపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు చేయడంతో పాటు, అనర్హుల పేర్ల తొలగింపు, వివరాల సవరణ వంటి ప్రక్రియలను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ అందిన ఫారాలు, దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా నిష్పక్షపాతంగా పరిశీలించి నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు.అనంతరం కలెక్టరేట్ నుండి ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ... భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో సవరణ ప్రక్రియను పటిష్టంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్ల సమన్వయంతో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెల్లడించారు.

## సర్కారీ బడికి మహర్దశ!





- 'పీఎం శ్రీ'తో కార్పొరేట్‌కు చెక్.. గద్వాల బాలుర బడికి లక్కీ ఛాన్స్
- పాఠశాలను పరిశీలించిన డీకే స్నిగ్ధ రెడ్డి

**గద్వాల, జూలై 22 (వుదయం బ్యూరో):**

నాణ్యమైన విద్యకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, 'పీఎం శ్రీ' పథకంతో ప్రభుత్వ పాఠశాలలు ఆధునిక విద్యా కేంద్రాలుగా రూపాంతరం చెందుతున్నాయని బీజేపీ జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధ రెడ్డి వ్యాఖ్యానించారు. గద్వాల ఇండోర్ స్టేడియం సమీపంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఈ పథకానికి ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ, పాఠశాలలో మౌలిక వసతులు, డిజిటల్ బోధనా విధానాలను సందర్శించి పరిశీలించారు. ఎన్ఈపి2020 లక్ష్యాలకు అనుగుణంగా దేశంలోనే ఆదర్శవంతమైన విద్యా సంస్థలుగా వీటిని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, ఇతర నాయకులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు.

## రాహుల్ గాంధీకి మద్దతుగా ఆందోళనలు కొనసాగిస్తూనే ఉంటాం

- రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ మంగళవారం ముంబై- హైదరాబాద్ నేషనల్ హైవే దిగ్బంధించాం
- ఈరోజు సంగారెడ్డి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టాం
- రేపు 1000 మంది కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి నల్ల టీషర్ట్ ధరించి ఐదు కిలోమీటర్లు ర్యాలీ చేస్తాం
- రాహుల్ గాంధీ ఆందోళన చేసినన్ని రోజులు సంగారెడ్డిలో ఆందోళనలు జరుగుతూనే ఉంటాయి
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి.

**సంగారెడ్డి, వుదయం**



జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేయడం, ఢిల్లీలో ప్రధానమంత్రి ఇంటి వద్ద నిరసన తెలుపుతున్న రాహుల్ గాంధీని అరెస్టు చేయడాన్ని నిరసనగా సంగారెడ్డి పట్టణంలో బుధవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షులు నిర్మల జగ్గారెడ్డితో కలిసి ఆయన రాంనగర్ రామమందిరం నుండి బైక్ ర్యాలీ ప్రారంభించారు. అనంతరం గంజ్ మైదానం వద్ద మహాత్మా గాంధీకి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాంనగర్ నుండి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ ఐబీ చౌరస్తా, బైపాస్ రోడ్, బసవేశ్వర చౌక్, పోతిరెడ్డిపల్లి చౌరస్తా, కలెక్టరేట్, న్యూ బస్టాండ్ మీదుగా తిరిగి రామ్ మందిర్ వద్దకు చేరుకుంది. జగ్గారెడ్డి తన భార్య నిర్మలను బైక్ మీద కూర్చోబెట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం రామ్ మందిర్ వద్ద జగ్గారెడ్డి విలేకరులతో మాట్లాడారు.

**జగ్గారెడ్డి కామెంట్స్**

మూడు రోజులుగా విద్యార్థులు నీట్ పేపర్ లీకేజీ ఘటనపై ఢిల్లీలో ఆందోళనలు చేస్తున్నారు.దేశంలో నిరుద్యోగం పెరిగిపోయింది.మూడో సారి మోదీ ప్రధాని అయినా యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదు.నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి.పేపర్ లీకేజీల ఘటనలు నిరసిస్తూ వేలాది మంది విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారు.ఢిల్లీలో, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలే ఉన్నాయి.ఆందోళన చేస్తున్న విద్యార్థులను దారుణంగా రక్తం వచ్చేలా కొట్టారు.ఈ ఘటనని నిరసిస్తూ రాహుల్ గాంధీ ప్రధాని మోదీ ఇంటిని ముట్టడిస్తే అరెస్ట్ చేశారు.విద్యార్థులకు ప్రధాని క్షమాపణ చెప్పాలి, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.రాహుల్, ప్రియాంక గాంధీలతో పాటు విద్యార్థులకు మద్దతుగా ప్రతి రోజు నిరసన కార్యక్రమాలు చేస్తాం.

## సంగారెడ్డిలో సినిమా షూటింగ్ సందడి

**సంగారెడ్డి వుదయం**



సంగారెడ్డి రాజంపేటలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో సినిమా చిత్రీకరణ సందడి నెలకొంది. షూటింగ్‌లో ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి పాల్గొనడంతో ఆయనను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నటుడితో ఫోటోలు దిగుతూ అభిమానులు ఉత్సాహంగా సందడి చేశారు. తమ ప్రాంతంలో సినిమా షూటింగ్ జరగడం, తమ ప్రాంతం తెరపై కనిపించనుండటంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

## జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం

**మహబూబ్ నగర్, జూలై 22 (వుదయం ప్రతినిధి):**



కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని ప్రజాస్వామ్యంపై దాడిగా, నిరంకుశ పాలనకు నిదర్శనంగా పేర్కొంటూ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. నీట్ పరీక్ష పత్రం లీకేజీ కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆందోళన వ్యక్తం చేస్తూ, కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థపై తన వైఖరిని మార్చుకోవాలని, పరీక్ష పత్రాల లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.పరీక్ష పత్రాల లీకేజీ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ ,మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ ,మాజీ మున్సిపల్ చైర్మన్_ ఆనంద్ కుమార్ గౌడ్,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి ,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అసహనంతోనే ప్రధాని ఇంటి ముందు కాంగ్రెస్ ఆందోళన

**నారాయణపేట, జూలై 22 (వుదయం ప్రతినిధి):**



దేశంలో ఎక్కడ స్థానం లేక అసహనంతో కాంగ్రెస్ జాతీయ నాయకులు ప్రధాని నరేంద్రమోడీ ఇంటి ముందు హై సెక్యూరిటీ జోన్ నియమాలను ఉల్లంఘించి ఆందోళన చేపట్టిందని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్, అదనపు న్యాయవాదులు నందు నామాజీ, కర్మన్నగౌడ్ అన్నారు. బుధవారం వారు నారాయణపేటలో విలేకరుల తో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశంలో అరాచకం సృష్టిస్తున్నదని విమర్శించా రు.కాంగ్రెస్ పార్టీ దిన దినానికి దేశంలో అడ్రస్ గల్లంతు అవుతుండడంతో అసహనంతో ఆందోళన చెందుతున్నారని అన్నారు.దేశ భద్రతను విచ్ఛిన్నం చేసే కుట్ర కు పూనుకుంటున్నారని అన్నారు.కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటు న్నప్పటికీ కాంగ్రెస్ అప్రజా స్వామికంగా వ్యవహరి స్తున్నదని అన్నారు.ప్రధాని నరేంద్ర మోడీ నివాసం వద్ద అరాచకంగా వ్యవహరించి రాష్ట్రంలో శాంతి యుతంగా నిరసన తెలుపుతున్న తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు ఇతర బిజెపి నాయకులను అరెస్ట్ చేయ డం ఇది ముమ్మాటికీ రేవంత్ రెడ్డి ప్రభుత్వ పిరి కిపంద చర్య. ఒకవైపు ఢిల్లీ లో ప్రజాస్వామ్యం ముసుగులో విధ్వంసాలు సృష్టిస్తూ, రాష్ట్రంలో మాత్రం పోలీసుల అండతో ప్రతిప క్షాల గొంతు నొక్కాలని చూడటం కాంగ్రెస్ పార్టీ నియంతృత్వానికి, ద్వంద్వ వైఖరికి నిదర్శనం అన్నారు.పోలీసు నిర్బంధాలతో, అక్రమ అరెస్టులతో బిజెపి నాయకులను, కార్యకర్తల ను ఎవరూ భయపెట్ట లేరనీ,కాంగ్రెస్ అప్రజాస్వామిక, అరాచక విధానాలపై బిజెపి పోరాటం ఆగదు అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## ప్రభుత్వ హాస్టళ్లలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

**వనపర్తి జూలై 22 (వుదయం ప్రతినిధి)**

ప్రభుత్వ వసతి గృహాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభివనపర్తి పట్టణంలోని బాలుర గిరిజన సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా ప్రతిరోజూ శుభ్రత చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాంనగర్ కాలనీలోని బాలుర విద్యార్థుల గిరిజన సంక్షేమ హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని వంటగది, స్టోర్‌రూమ్‌ను పరిశీలించి ఆహార పదార్థాల నిల్వ, పరిశుభ్రతను తనిఖీ చేశారు. అనంతరం హాస్టల్ ఆవరణ, డ్రైనేజీ వ్యవస్థ, మరుగుదొడ్లు, ఇతర వసతులను పరిశీలించారు. హాస్టల్‌లో మొత్తం ఎంతమంది



విద్యార్థులు ఉన్నారు అని ఆరా తీయగా.. 140 మంది సామర్థ్యానికి గాను ప్రస్తుతం 111 మంది విద్యార్థులు ఉన్నారని వార్డెన్ను సమాధానమిచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా హాస్టల్‌లో ప్రతిరోజూ శుభ్రత చర్యలు చేపట్టాలని వార్డెన్‌ను ఆదేశించారు. మరుగుదొడ్లు, హాస్టల్ గదులు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. హాస్టల్ సమీపంలోని నాలా చెత్త, పూడికతో ఉండటాన్ని గమనించిన కలెక్టర్ వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు నాలాను శుభ్రం చేయించి డ్రైనేజీ సమస్యను పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవడంతో పాటు నీటి సమస్య కూడా లేకుండా చూడాలని సూచించారు.అనంతరం విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడి హాస్టల్‌లో అందుతున్న వసతులు, భోజన నాణ్యత, తాగునీరు, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మధు, మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ ఉన్నారు.

## మొక్కలు నాటి వాటిని రక్షించుకోండి




- రామయంపేట సిఐ సైదా నాయక్...

**మెదక్ జిల్లా, వుదయం:**

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజున నిజాంపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో రామాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్, సైదా నాయక్, నిజాంపేట సబ్‌ఇన్‌స్పెక్టర్,రాజేష్, ఎంపీడీవో రాజిరెడ్డి, పోలీస్ సిబ్బంది కలిసి సుమారు 20 చెట్ల మొక్కలను నాటారు.ఈ సందర్భంగా సిఐ సైదా నాయక్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ, హరితహారం ప్రాధాన్యతను వివరించి,ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ శ్రీనివాస్,కార్యదర్శి సరితా దేవి, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుమల్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఆర్టిసన్ల ఉద్యమాన్ని ఆపలేరు

**రాజోలి జూలై 22 (వుదయం కరస్పాండెంట్)**



విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులు, అన్ మ్యాన్డ్ మరియు పీసు రేటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న క్రమంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క ఇచ్చిన హామీలను విద్యుత్ సంస్థలు, యాజమాన్యం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాదు లోని టీజీ ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం మింట్ కాంపౌండ్ నందు మహా ధర్నా కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టిసన్ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్న పిలుపు మేరకు బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో జిల్లా ఆర్టిసన్ జేఏసీ నాయకులను, కార్మికులను మహా ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా ఆర్టిసన్ జేఏసీ జిల్లా చైర్మన్ శివప్రసాద్ ను ముందుగా మంగళవారం అర్ధరాత్రి ఇంటికి వెళ్లి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రివర్యులు అయినా మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక మునుపు చేపట్టిన పాదయాత్రలో ఆర్టిజన్ కార్మికులకు తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న తరుణంలో గత ఏప్రిల్ నెలలో పది రోజులు సమ్మె చేసిన సందర్భంగా సమ్మె విరమించి చర్చలకు రావాలని ప్రభుత్వం ఆర్టిజన్ల సమస్యలు తీర్చడానికి సిద్ధంగా ఉందని సమ్మె విరమించి నేటికీ మూడు నెలలు అయినా కనీసం అపాయింట్మెంట్ కూడా ఇవ్వకుండా కాలయాపన చేయడం ఈ ప్రభుత్వాలకు యాజమాన్యాలకు తగదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టిజన్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఎంతవరకైనా పోరాడుతామని ప్రభుత్వం ఎంత అణిచివేతకు గురి చేస్తే ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతుందని దానికి పూర్తి బాధ్యత ప్రభుత్వం, మేనేజ్మెంట్ వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.ఇప్పటికైనా ప్రభుత్వం ముద్దు నిద్రను వీడి ఆర్టిజన్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## 25 ఏళ్ల భూ వివాదానికి పోలీసుల చొరవతో పరిష్కారం

- ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చిన తొగుట సీఐ లతీఫ్, రాయపోల్ పోలీసు

**దౌల్తాబాద్, జూలై 22 (వుదయం):**



రాయపోల్ మండలం ముంగిస్‌పల్లి గ్రామంలో గత 25 ఏళ్లుగా కొనసాగుతున్న భూ వివాదానికి పోలీసుల చొరవతో ముగింపు లభించింది. ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యను తొగుట సీఐ షేక్ లతీఫ్, రాయపోల్ ఎస్ఐ మానస, ఇక్బాల్ ప్రత్యేక చొరవ తీసుకుని ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చి పరిష్కరించారు.బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇరువర్గాలను పిలిపించి గ్రామ సర్పంచ్,గ్రామ పెద్దల సమక్షంలో చర్చలు నిర్వహించారు. ఈ వివాదంలో పలువురు ఎస్ఐలు, సీఐలు, రెవెన్యూ అధికారులు మారినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదని తెలిపారు. భూ వివాదానికి సంబంధించి ఇరువర్గాల పై పలు కేసులు కూడా నమోదయ్యాయని పేర్కొన్నారు.ప్రస్తుతం శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా ఇరువర్గాల మధ్య సామరస్య వాతావరణంలో రాజీ కుదిర్చినట్లు తెలిపారు. భూ వివాదం పరిష్కారం కావడంతో పట్టాదారులు కొత్త రాజేశ్వరరావు, కొత్త భాస్కర్, కొత్త నవీన్, కొత్త కిష్టయ్య, కొత్త శ్యాంరావు పోలీసు అధికారులు, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గుప్త,గ్రామ పెద్దలు,ఇరువర్గాల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మీ సేవల్లో దోపిడీకి చెక్!



- తహసీల్దార్ ఆఫీసుల చుట్టూ తిప్పితే చర్యలు తప్పవు: గద్వాలలో అధికారుల ఆకస్మిక తనిఖీలు

**గద్వాల జూలై 22 (వుదయం బ్యూరో)**

ప్రభుత్వ సేవల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వేధింపులు లేని పారదర్శక సేవలు అందించాలని ఈడిస్ట్రిక్ట్ మేనేజర్ కె. శివ అధికారులను, మీ సేవ నిర్వాహకులను ఆదేశించారు.ప్రజలపై భారం వద్దు: సర్కార్ నిర్ణయించిన రుసుముల కన్నా అదనంగా రూపాయి వసూలు చేసినా ఉపేక్షించేది లేదు. రైతులు, విద్యార్థులకు వరం: ఎస్ఎస్‌సీ ఈమెమో ద్వారా పదో తరగతి మెమోలు,రైతుల కోసం యూరియా బుకింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలందరూ ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు.

## గాజులపల్లిలో గ్రామసభ నిర్వహణ

**దౌల్తాబాద్, జూలై 22 (వుదయం):**

మండల పరిధిలోని గాజులపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, ముందస్తు జాగ్రత్తలపై గ్రామసభను గురువారం సర్పంచ్ పంజ స్వామి అధ్యక్షతన నిర్వహించారు.ఈ గ్రామసభలో ఎంపీడీవో అబ్జలుద్దీన్, మండల వ్యవసాయ అధికారి సాయి కిరణ్ ఎల్‌నినో పరిస్థితులు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి వనరుల సమర్థ వినియోగంపై వివరించారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రేమ్‌కుమార్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి నర్ర నర్సింలు, అంగన్వాడీ టీచర్ పోతుగంటి సరోజ, ఆశా కార్యకర్త రజిత, ఫీల్డ్ అసిస్టెంట్ పాశం నర్సింలు, వీవో నాయకులు, టీఏలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన ఆపరేషన్ థియేటర్ ప్రారంభం
- వైద్య సేవలపై ఎమ్మెల్యే సమీక్ష

నాగర్ కర్నూల్,జూలై 22 (వుదయం బ్యూరో):



ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు బుధవారం నాడు జిల్లా కేంద్రంలోనిప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నూతన ఆపరేషన్ థియేటర్ ను ఎమ్మెల్యే డాక్టర్. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి ప్రారంభించారు.అనంతరం వైద్యులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, రోగులకు నాణ్యమైన, సకాలంలో వైద్యం అందించాలని ఆదేశించారు. OT వినియోగం, అత్యవసర సేవలు, ఔషధాల సరఫరా, పరిశుభ్రతపై ఆరా తీశారు. నిర్లక్ష్యానికి తావు లేదని, ప్రజల ప్రాణాల విషయంలో రాజీపడబోమని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంచేందుకు అన్ని ఆధునిక సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో DMHO డాక్టర్ఉషా రాణి, RMO డాక్టర్ రోహిత్, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జక్కా రాజు కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు సింధు, నిజాం, శంకర్, పద్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు సర్వే అధికారులకు సేకరించాలి

- భూ భారతి భూ రీ సర్వే ను రైతులు ఈ అవకాశని వినియోగించుకోవాలి,
- ఎమ్మార్వో, సర్పంచ్

నారాయణఖేడ్ జూలై 23(వుదయం)



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "భూ భారతి" భూ రీ సర్వే సందర్భంగా పిప్రి గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహిస్తూ అధికారులు అవగాహన కల్పించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడం, హద్దులను స్పష్టంగా గుర్తించడం, పారదర్శక సేవలు అందించడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశ్యం మని ఎం ఆర్ ఓ చంద్రమోహన్ రెడ్డి అన్నరు. నారాయణఖేడ్ మండల పరిధిలోని పిప్రి గ్రామంలో సర్పంచ్ మాలిపట్టెల్ మారుతి ఆధ్వర్యంలో నిర్వహించిన భూ భారతి భూ రీ సర్వే కార్యక్రమంలో భాగంగా ఎం ఆర్ ఓ చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి భూ సమస్యలు గ్రామాలలో పరిష్కారం కోసం ఎదురు చూస్తున్న రైతులకు భూభారతి రీ సర్వేను రైతులు వినియోగించుకోవాలన్నారు. సర్వే చేస్తున్న అధికారులను సహకరించి మీ భూమి సర్వే చేయించుకొని శాశ్వత పరిష్కారం చూసుకోవాలన్నారు. ప్రతి ఎక్కర భూమికి స్పష్టమైన రికార్డులు వివాదా రైత హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. తమ పట్టా పాస్ బుక్కులు, ఆధార్ కార్డు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.అనంతరం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఎకరా భూమికి స్పష్టమైన రికార్డు వివాదా రైత హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సర్వే సమయంలో రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని తప్పుడు సమాచారం ఇవ్వవద్దని సూచించారు. భూ వివాదాలు, పేర్లు తప్పులు వారసత్వ సమస్యలు ఉంటే గ్రామసభలోనే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం మన మంచి కోసమే ఈ సర్వే చేస్తుందని ఎవరు భయపడొద్దు అందరూ కలిసి సహకరిస్తే మన గ్రామానికి 100% సర్వే పూర్తవుతుందని తెలియజేశారు.మా గ్రామంలో సర్వే విజయవంతం చేయాలని అధికారులకు సర్పంచ్ కోరారు. అనంతరం సర్పంచ్ అధికారులకు శాలువా పూలమాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ మాధవ రెడ్డి, జె పి ఓ నాగరాజ్, గ్రామ ఉపసర్పంచ్ మూడ్ అనూష బాయ్, పంచాయతీ కార్యదర్శి,వార్డు నెంబర్లు ఎస్ శ్రీను, కే రమేష్, రైతులు ఎస్ రాజు, గ్రామ పెద్దలు అధికారులు అనధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం మొబైల్ యాప్ ఆవిష్కరణ

నారాయణపేట టౌన్, జూలై 22(వుదయం ప్రతినిధి):



సమాజ సేవే ధ్యేయంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ప్రమీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రోగులు, వారి సహాయకులు, నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమీల ఫౌండేషన్ మొబైల్ యాప్‌ను అధికారికంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రమీల ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. కోరం మహేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. సమాజంలోని నిరుపేదలు, ఆపదలో ఉన్నవారు అవసరమైన వారికి తమ వంతు సహాయం అందించేందుకు ప్రమీల ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ప్రజలకు ఫౌండేషన్ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాల సమాచారం, సభ్యత్వ నమోదు, స్వచ్ఛంద సేవా అవకాశాలు ఇతర సేవలను సులభంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రమీల ఫౌండేషన్ మొబైల్ యాప్‌ను రూపొందించి అధికారికంగా ఆవిష్కరించినట్లు డా. కోరం మహేష్ రెడ్డి తెలిపారు .ఈ కార్యక్రమంలో కోరం శివరాజ్ ,కోరం హర్షవర్ధన్ రెడ్డి, సత్యపాల్, వెంకట్ రెడ్డి, నరసింహ, రమేష్ ,గోవర్ధన్ రెడ్డిలతో పాటు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుకు జగ్గారెడ్డి కౌంటర్

- రెండో రోజు జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆందోళనలు

సంగారెడ్డి,వుదయం :



: నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కాంగ్రెస్ ఆందోళనలు రెండో రోజూ కొనసాగాయి. TPCC వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనపై రాహుల్ గాంధీ ప్రధాని మోదీ ఇంటి ముందు ధర్నా చేస్తే తప్పేంటని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు గాంధీ భవన్‌కు వచ్చి ఏం చేస్తారని నిలదీశారు. బీజేపీ నేతలు గాంధీ భవన్‌కు వస్తే తాము బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.విద్యార్థుల సమస్యలపై బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే ప్రధాని మోదీతో విద్యార్థులకు క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాలని అన్నారు. లేదంటే కేంద్ర మంత్రులను ఘెరావ్ చేస్తామని హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు నీట్ విద్యార్థులకు కనీసం క్షమాపణ కూడా చెప్పలేదని జగ్గారెడ్డి విమర్శించారు. ప్రధాని మోదీ మొండిగా వ్యవహరిస్తున్నారని, విద్యార్థులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మతం, దేవుడి పేరుతో ఓట్లు తెచ్చుకున్న బీజేపీకి విద్యార్థుల సమస్యలు పట్టడం లేదని విమర్శించారు.

# ప్రహరీ గోడ నిర్మించాలని విద్యార్థుల విజ్ఞప్తి

వట్‌పల్లి, జూలై 22 (వుదయం ప్రతినిధి):



వట్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని కోరుతూ విద్యార్థులు ఎంఈఓ రంజిత్ కుమార్, ఎంపీడీవో తరుణ్ కుమార్, తహసీల్దార్ జంగేశ్వర్‌రావుకు వినతిపత్రాలు అందజేశారు. పాఠశాలలో ఆరవ నుంచి పదో తరగతి వరకు 128 మంది విద్యార్థులు చదువుతున్నారని, ప్రహరీ గోడ లేకపోవడంతో కొందరు అసాంఘిక వ్యక్తులు పాఠశాల ఆవరణలో మద్యం సేవించడం, సిగరెట్లు, బీడీలు కాల్చడం వంటి చర్యలకు పాల్పడటంతో పాటు బాత్రూం తలుపులు, కిటికీలు ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరారు.

# మహిళలకు మహర్దశ!

- గద్వాలలో 135 మందికి 'ఇందిరమ్మ మహిళా శక్తి' యంత్రాలు పంపిణీ
- మరో 200 కుట్టు మిషన్లు త్వరలోనే మంజూరు: ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్
- మహిళల ఆర్థిక ఎదుగుదలే సర్కార్ ధ్యేయం: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల, జూలై 22 (వుదయం బ్యూరో):



మైనార్టీ మహిళల ఆర్థిక స్వాతంత్ర్యమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. స్వయం ఉపాధి యంత్రాల ద్వారా నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు చర్యలు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా గద్వాల జిల్లా కేంద్రంలోని అనంత ఫంక్షన్ హాల్‌లో మంగళవారం 'ఇందిరమ్మ మైనార్టీ మహిళా శక్తి' పథకం కింద 135 మంది ముస్లిం మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు వీటిని అందజేశారు.

**సవాలుగా తీసుకుని ఎదగాలి:**

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం మహిళల సాధికారతకు పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతి మహిళ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని సొంత కాళ్లపై నిలబడాలని పిలుపు నిచ్చారు. నియోజకవర్గంలోని మిగిలిన అర్హులకు కూడా త్వరగా యంత్రాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

**ఇంకా 200 మిషన్లు ఇస్తాం:**

రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ స్పందిస్తూ, ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు గద్వాలకు మరో 200 కుట్టు మిషన్లు మంజూరు చేసేలా ప్రభుత్వంతో మాట్లాడతానని స్పష్టం చేశారు. గురుకులాల ద్వారా డిగ్రీ వరకు ఉచిత విద్యను అందిస్తూ మైనార్టీల పురోగతికి బాటలు వేస్తున్నామని తెలిపారు.

ఈ పంపిణీ మహోత్సవంలో ప్రజాప్రతినిధులు తుమ్మల జయలక్ష్మి, హనుమంతు, రాజీవ్ రెడ్డి, సుభాన్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ పై అవగాహన సదస్సు

నాగర్ కర్నూల్, జూలై 22 (వుదయం ప్రతినిధి):



రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్‌కర్నూల్ చైర్మన్ మరియు సెక్రెటరీ గారి ఆదేశాల మేరకు, చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్ స్కీం పై అవగాహన కల్పించడానికి లీగల్ సర్వీసెస్ యూనిట్ ఫర్ చిల్డ్రన్ నాగర్ కర్నూల్ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ గవర్నమెంట్ స్కూల్ లో బుధవారం నాడు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీరామ్ ఆర్య, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కాన్సిల్ హాజరై మాట్లాడారు. బాలల హక్కుల గురించి వివరిస్తూ బాలబాలికలందరూ తప్పనిసరిగా పాఠశాలకు వచ్చి చదువుకోవాలని సూచించారు. బాలబాలికలు ఫోన్ వాడకంలో అప్రమత్తంగా ఉండాలని, ఫోన్ లో వచ్చిన మెసేజ్‌లను గాని, వీడియోలను గాని ఇతరులకు ఫార్వర్డ్ చేయడం గాని, వాటికి తిరిగి రిప్లై ఇవ్వడం గాని చేయరాదని తెలిపారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిస కాకుండా వాటికి దూరంగా ఉండాలని, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవిస్తూ ఉన్నత స్థితిని పొందాలని అన్నారు.

ముఖ్యంగా మైనర్ బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు పోక్సో చట్టం అడ్డుకట్ట వేస్తుందని తెలిపారు. అమ్మాయిలకు ఏ విధమైన సమస్యలు ఉన్నా షీ టీం కు గాని, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 కు గాని సమాచారం ఇవ్వాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి లబ్ధి పొందాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# అరెస్టులతో విద్యార్థులను, రాహుల్ గాంధీని అడ్డుకోలేరు

- ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

నాగర్ కర్నూల్, జూలై 22 (వుదయం బ్యూరో)

నీట్ యూజీ పేపర్ లీక్ వ్యవహారానికి వ్యతిరేకంగా ఢిల్లీలో విద్యార్థులకు మద్దతుగా ఆందోళన చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడాన్ని, విద్యార్థులపై లాఠీ ఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగాన్ని నిరసిస్తూ బుధవారం నాడు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే డాక్టర్. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోడీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేశారు.అనంతరం ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం అమానుషమని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, ప్రధాని మోడీ రాజీనామా చేయాలని అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. నీట్ పరీక్షల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు,

# ప్రజాస్వామ్యంపై సర్కారు 'లాఠీ'!

- విద్యార్థులపై దాడి పిరికిపంద చర్య: డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి
- ఢిల్లీ ఘటనపై గద్వాలలో భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు.. ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం
- మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్

గద్వాల, జూలై 22 (వుదయం బ్యూరో):



దేశ రాజధాని ఢిల్లీ వేదికగా శాంతియుతంగా హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం అణచివేత ధోరణికి పాల్పడటం ప్రజాస్వామ్య వ్యవస్థకే తీవ్ర కళంకమని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రశ్నించే గొంతులను నొక్కేసేందుకు కేంద్రం దమనకాండకు తెగబడుతోందని మండిపడ్డారు. విద్యార్థులపై దాడిని నిరసిస్తూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనపై బలప్రయోగానికి దిగడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి, నిరంకు శత్వా నికి ప్రత్యక్ష నిదర్శనమని ఆరోపించారు. ఢిల్లీ ఘటనలను ఖండిస్తూ బుధవారం గద్వాల పట్టణంలో డీసీసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున పోరుబాట పట్టాయి.

**వైఎస్ఆర్ చౌరస్తాలో ఉద్రిక్తత.. శవయాత్ర, దిష్టిబొమ్మ దహనం**

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక వైఖరిని ఎండగడుతూ పట్టణంలోని వైఎస్ఆర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ శవయాత్ర నిర్వహించారు. కేంద్రానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ చౌరస్తాను హోరెత్తించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేయడంతో ప్రాంగణంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**రాజీవ్ రెడ్డి ధ్వజం: ప్రధాన ముఖ్యాంశాలు**

నిరంకుశ వైఖరి నశించాలి: శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వేలాది మంది విద్యార్థులను గాయపరచడం అత్యంత హేయమైన చర్య అని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం సరికాదని విమర్శించారు. భయపడుతున్న కేంద్రం: ప్రజల ప్రశ్నలకు, విపక్షాల నిలదీతలకు సమాధానం చెప్పలేకనే కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాల స్వరాన్ని అణచివేయాలని చూస్తోందని దుయ్యబట్టారు. త్యాగాల చరిత్రపై దాడులా?: దేశ పరిరక్షణ కోసం, స్వాతంత్ర్య పోరాటం నుంచి నేటి వరకు ప్రాణాలర్పించిన చరిత్ర రాహుల్ గాంధీ కుటుంబానిదని, అటువంటి నేతపై దాడి చేయడం కేంద్ర ప్రభుత్వ పిరికిపంద చర్య అని అభివర్ణించారు. తక్షణ రాజీనామా చేయాలి: విద్యార్థులపై జరిగిన దాడికి పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమ పదవులకు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# ఢిల్లీ ఘటనపై ఖేడ్ లో భగ్గుమన్న కాంగ్రెస్

- కేంద్ర విద్యాశాఖ మంత్రి
- తక్షణమే రాజీనామా చేయాలి
- రాహుల్ గాంధీ అరెస్ట్, నిట్ అక్రమాలపై ధర్నా, దిష్టి బొమ్మ దగ్గం.
- రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి

నారాయణఖేడ్, జూలై 23(వుదయం):



నిట్ పరీక్షలో జరిగిన లికేజీపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న రాహుల్ గాంధీ ని అరెస్టు చేయడంపై ఖేడ్ లో బగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు. కేంద్ర మంత్రి దిష్టి బొమ్మ దగ్గం చేశారు. సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్ పట్టణంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్రమంత్రి దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ తో పాటు ప్రతిపక్షా నాయకుల అరెస్టులను ఖండిస్తూ నీటి పరీక్షలో జరిగిన లీకేజీ పై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు శేఖర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీ చార్జిను చేయడంపై ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకుల గొంతును అనచి వేసే చర్యలను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక వైఖరిని ఎండగడుతూ పట్టణంలోని రాజీవ్ కూడలిలో భారీ శివయాత్ర నిర్వహించి కేంద్ర వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర విద్యా శాఖ మంత్రి దిష్టిబొమ్మ దానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు తదితర గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 100 శాతం ఎస్ ఐ ఆర్ పూర్తి

- అభినందించిన సర్పంచ్ గవినోల శ్రీనివాస్

నారాయణపేట, జూలై 22(వుదయం ప్రతినిధి):



నారాయణపేట జిల్లా దామ రగిద్ద మండలం, బాపన్ పల్లి గ్రామంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ వందశాతం విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రక్రియ విజయవంతంగా పూర్తవడానికి అహర్నిశలు కృషి చేసిన బి ఎల్ ఓ లు, బి ఎల్ ఏ లు, పంచాయతీ సిబ్బందితో పాటు సహక రించిన గ్రామ ప్రజలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి, అవ సరమైన వివరాలను సకా లంలో సేకరించి ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన అధికారుల సేవలను ఆయన కొనియాడారు. గ్రామ ప్రజలు చూపిన సహకారం వల్లే బాపన్‌పల్లి గ్రామం ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయగలిగిందని పేర్కొన్నారు.

# శవమే శివముతో సమానం

- తిమ్మాపూర్ సర్పంచ్ గుణం గారి రాజ్....

వుదయం న్యూస్, శివ్వంపేట జులై 22:



మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామ నికి చెందిన ఎల్లప్ప గారి సత్యమ్మ మృతి చెందడం జరిగింది. మృతురాలి కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ గుణం గారి రాజు మాజీ సర్పంచులు అంజా గౌడ్. లింగం యాదవ్. అశోక్ గౌడ్. ఉప సర్పంచులు శ్రావణి ప్రవీణ్ గౌడ్. కలిసి పరామర్శించడం జరిగింది. అనంతరం సర్పంచ్ గుణంగారి రాజు తిమ్మాపూర్ గ్రామంలో ఎవరు మృతి చెందిన అక్కడికి వెళ్లి అన్ని తాళై కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు. ఇలా సుమారు ఆయన గత 20 ఏళ్ల నుండి కులము మతము ఏ భేదము లేకుండా ఏ విధంగా చనిపోయారు అనేది కాకుండా. చనిపోయిన ప్రతి ఇంటికి వెళ్లి చనిపోయిన శవాన్ని పాడే కట్టే నుండి కుండా పగిలే వరకు అంతా తానై నిర్వహించడం ఆయనకు ఆయనే సాటి అని. పదవులు వస్తాయి పోతాయి అధికారం ఉంటుంది పోతుంది వయసు ఉండాలి ఏది మన సొంతం కాదని. అంతా శివమయమని చనిపోయిన మనిషి శవం శివుడితో సమానమంటూ శివుడే అన్ని మనకంటూ నమ్మిన వ్యక్తిగా నేడు అన్ని తానై శవాన్ని సమాధి చేసే కార్యక్రమం అన్ని ఆయన చేతుల మీదుగా చేస్తాడని గ్రామస్తులు వివిధ గ్రామాల నుంచి వచ్చిన బంధువులు సర్పంచి అంటే పదవి కాదని అందరితో కలిసి ఉండటమే మానవత్వం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేశ్రీ.వి.నవీన్ యాదవ్ గారిఆధ్వర్యంలో చలో రాజ్‌భవన్ నిరసన కార్యక్రమానికి భారీగా కదం తొక్కిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

హైదరాబాద్, జూలై 22 (వుదయం ప్రతినిధి):



ఏఐసీసీ దేశవ్యాప్త పిలుపు మేరకు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ గారు మరియు ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టును ఖండిస్తూ, అలాగే నీట్ (NEET) పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నేడు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో చలో రాజ్‌భవన్ నిరసన కార్యక్రమం నిర్వహించారు.నుంచి రాజ్‌భవన్ వరకు నిర్వహించిన ఈ భారీ ర్యాలీలో టీపీసీసీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ గారు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.. అదే విధంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ గారి ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన దాదాపు 100 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొని నిరసనను విజయవంతం చేశారు..ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు విద్యార్థుల హక్కులను కాపాడాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు..



# సగటున 12.04 మీటర్లకు భూగర్భ జలాలు

- భూగర్భ జల శాఖ నివేదిక విడుదల: భూగర్భ జల శాఖ అధికారి


సిద్దిపేట, జులై 22 (వుదయం బ్యూరో):

సిద్దిపేట జిల్లాలో 2026 జూలై మొదటి వారానికి సంబంధించి భూగర్భ జల శాఖ అధికారి నిర్వహించిన పరిశీలనల నివేదిక విడుదలయింది. జిల్లా వ్యాప్తంగా సగటు భూగర్భ జల మట్టం 12.04 మీటర్లు గా నమోదైంది. దౌల్తాబాద్ మండలంలో అత్యధికంగా 23.43 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. కోహెడ మండలంలో అత్యల్పంగా 4.15 మీటర్ల లోతులోనే నీటి లభ్యత ఉంది. నీటి మట్టంలో మార్పు: జూన్ 2026 నాటి పరిస్థితులతో పోలిస్తే జిల్లా సగటున 0.80 మీటర్ల మేర భూగర్భ జల మట్టం పెరిగింది. అలాగే గత ఏడాది జూలై (2025) తో పోలిస్తే 0.76 మీటర్లు మెరుగైంది.

మండలాల వారీగా జల మట్టాల పట్టిక

| క్రమ సంఖ్య | మండలం | జూలై 2025 (మీ) | జూలై 2026 (మీ) | వ్యత్యాసం (మీ) |
| --- | --- | --- | --- | --- |
| 1 | దౌల్తాబాద్ | 27.27 | 23.43 | 3.84 |
| 2 | దుబ్బాక | 24.48 | 22.40 | 2.08 |
| 3 | ముల్గురు | 19.46 | 22.25 | 2.79 |
| 4 | అక్కన్నపేట మాజీ | 18.55 | 21.91 | 3.36 |
| 5 | సిద్దిపేట అర్బన్ | 15.40 | 17.22 | 1.82 |
| ... | ... | ... | ... | ... |
| 18 | గజ్వేల్ | 13.13 | 11.06 | 2.07 |
| 26 | కోహెడ | 2.55 | 4.15 | 1.60 |
| సగటు | జిల్లా మొత్తం | 12.80 | 12.04 | 0.76 |

భూగర్భ జల వనరుల పెంపునకు నీటి సంరక్షణ చర్యలను మరింత వేగవంతం చేయాల్సి ఉంది. చెక్ డ్యామ్‌ల నిర్మాణం, ఇంకుడు గుంతలు మరియు వర్షపు నీటి నిల్వ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని జల పునరుద్ధరణకు ప్రజలు సహకరించాలి అని తెలిపారు.



# చక్కని ఆరోగ్యం

## నిద్రలో చెమటలు పడుతుంటే..



కొంతమందికి వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ రాత్రుళ్లు నిద్రలో విపరీతంగా చెమటలు పడుతుంటాయి. చిన్న సమస్యే కదా అని కొంతమంది ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ ఒక్కోసారి ఇది వివిధ అనారోగ్యాలకు సంకేతం కావచ్చంటున్నారు నిపుణులు.

థైరాయిడ్ గ్రంథి జీవక్రియలతో పాటు ఇతర శారీరక విధులు నిర్వర్తించడంలో సమర్థంగా పనిచేస్తుంది. అయితే ఇది అత్యంత చురుగ్గా మారినప్పుడు హైపర్ థైరాయిడిజం బారిన పడతాం. ఫలితంగా శరీరం వేడికి తట్టుకోలేక చెమటలు పడుతుంటాయని చెబుతున్నారు నిపుణులు.

ఉన్నట్లుండి ఒక్కోసారి ఒత్తిడి, ఆందోళనలకు గురవుతాం. వాటి ప్రభావం మెదడు, శరీరంపై పడుతుంది. నిద్రలో చెమటలు పట్టడానికి ఇదీ ఓ కారణం కావచ్చంటున్నారు నిపుణులు. కొన్ని రకాల మానసిక రుగ్మతలున్నప్పుడు కూడా నిద్రలో చెమటలు పట్టే అవకాశం ఉందంటున్నారు.

40 దాటిన మహిళల్లో రాత్రుళ్లు నిద్రలో చెమటలు పడుతున్నాయంటే.. వారు మెనోపాజ్‌కు చేరువవుతున్నారనడానికి సూచనగా భావించవచ్చంటున్నారు నిపుణులు. కొన్ని రకాల మందులు వాడడం వల్ల కూడా నిద్రలో చెమటలు పడుతుంటాయట. కెఫీన్ ఎక్కువగా ఉండే పదార్థాలు మితిమీరి తీసుకోవడం వల్ల కూడా రాత్రుళ్లు చెమటలు పట్టే అవకాశం ఎక్కువంటున్నారు నిపుణులు. అయితే రాత్రి పూట నిద్రలో చెమటలు పట్టడమనేది తరచూ తలెత్తినా, దీంతో అసౌకర్యంగా అనిపించినా ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి. దీంతో పాటు కొన్ని జాగ్రత్తలు పాటించడం వల్ల కూడా ఈ సమస్య నుంచి ఉపశమనం పొందచ్చు. మెనోపాజ్‌కు దగ్గరవుతున్న, మెనోపాజ్ దశలో ఉన్న మహిళలు ఆహారంలో కొన్ని మార్పులు చేర్పులు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో మసాలా, కారం.. వంటివి దూరం పెట్టాలంటున్నారు నిపుణులు. బరువును అదుపులో ఉంచుకోవడం వల్ల కూడా రాత్రుళ్లు చెమట సమస్యను తగ్గించుకోవచ్చు. ఇందుకోసం నిపుణుల సలహా మేరకు పోషకాహారం తీసుకుంటూనే.. వ్యాయామాలు చేయడం ముఖ్యం.

కొన్ని రకాల మందుల వల్ల ఈ సమస్య ఎదురవుతోందని గమనిస్తే వాటికి ప్రత్యామ్నాయంగా ఇతర మందులేవైనా వాడచ్చేమో వైద్యుల్ని అడిగి తెలుసుకోవాలి.

మానసిక ఒత్తిళ్లు, ఆందోళనల్ని తగ్గించుకునేందుకు నచ్చిన పనులు చేయడం, ఆహారంలో అవసరమైన మార్పులు చేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.


## ఇలా చేస్తే మెనోపాజ్ ఆలస్యం!



మెనోపాజ్‌వల్ల కేవలం హార్మోన్లలోనే కాదు, మొత్తంగా జీవక్రియలో మార్పులు వస్తాయి. పొట్టదగ్గర కొవ్వు, ఇన్సులిన్ నిరోధం, కొలెస్ట్రాల్ స్థాయులు పెరగడం... వంటి మార్పులు జరుగుతాయి. వీటి కారణంగా బీపీ, గుండె జబ్బుల ముప్పు ఎక్కువవుతోంది. అప్పటివరకూ సాధారణంగా ఉన్న బీపీ స్థాయులు 40ల చివర్లో, 50ల ఆరంభంలో ఒక్కసారిగా పెరిగి హైబీపీ స్థాయికి చేరుతాయి. ఈస్ట్రోజన్ విడుదల తగ్గి తద్వారా గుండెకు సహజ రక్షణ పోవడమే దీనికి ప్రధాన కారణం. ఈస్ట్రోజన్ తగిన మోతాదులో ఉంటే రక్త నాళాలు చురుగ్గా కదలడం మొదలు... రక్త ప్రసరణ వ్యవస్థకు అనేక విధాలుగా మేలు చేస్తుంది. ఓ తాజా అధ్యయనం ప్రకారం ఈస్ట్రోజన్ సహా హార్మోన్ల లేమివల్ల రక్తనాళాల్లో బిగుతు పెరగడం, వాపు, జీవక్రియలో తీవ్రమైన మార్పులు వస్తున్నాయి. దీనికి హార్మోన్ రిప్లేస్‌మెంట్ థెరపీ లాంటివి ఉన్నా, వాటితో కొన్ని అదనపు సమస్యలు వస్తుంటాయి. అందుకని సహజమైన పద్ధతుల్లో ఈ సమస్యని తగ్గించుకోవాలనీ సూచిస్తున్నారు నిపుణులు.

## కంటి చూపు బాగుండాలంటే..

ఇటీవలి కాలంలో కంప్యూటర్, మొబైల్‌లను ఎక్కువసేపు ఉపయోగించడం వల్ల చిన్న వయసులోనే మసక దృష్టి, కంటి అలసట, కళ్లు పొడిబారడం, డిజిటల్ ఐ స్ట్రెయిన్ వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఆరోగ్య నిపుణుల ప్రకారం.. పోషకాలు అధికంగా ఉండే కొన్ని ఆహారాలు కంటి ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు దృష్టి కోల్పోయే ప్రమాదాన్ని కొంతవరకు తగ్గించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా అవిసె గింజలు, గుమ్మడి గింజలు కంటి ఆరోగ్యానికి ఎలా ఉపయోగపడతాయో ఇప్పుడు తెలుసుకుందాం.. అవిసె గింజలలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, ఫైబర్, విటమిన్ ఇ, లిగ్నాన్‌లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రెటీనా ఆరోగ్యాన్ని కాపాడటానికి, పొడి కంటి సమస్యలను తగ్గించడానికి సహాయపడతాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం.. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు కంటి వాపును తగ్గించి,



కన్నీటి నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయని సూచిస్తున్నాయి.

గుమ్మడి గింజలలో జింక్, మెగ్నీషియం, విటమిన్ ఇ, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. కంటి రెటీనా పనితీరుకు జింక్ ఒక ముఖ్యమైన పోషకం. ఇది వయసు సంబంధిత దృష్టి సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా సహాయపడవచ్చు. ఈ గింజలను వేయించుకుని తినవచ్చు లేదా సలాడ్లు, పెరుగు, స్మూతీలు, ఓట్స్‌లో కలుపుకోవచ్చు.

గింజలు మాత్రమే కాదు, ఈ ఆహార పదార్థాలను కూడా క్రమం తప్పకుండా తీసుకుంటే కంటి ఆరోగ్యానికి మంచివని నిపుణులు సూచిస్తున్నారు.

క్యారెట్లు, పాలకూర, మెంతులు, ఆకుకూరలు, గుడ్డు, చేపలు, నారింజ, నిమ్మకాయ, బాదం, వాల్‌నట్‌లు

కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఈ అలవాట్లను పాటించండి

ప్రతి 20 నిమిషాలకు 20-20-20 నియమాన్ని పాటించాలి. (ప్రతీ 20 నిమిషాల స్క్రీన్ సమ యం తర్వాత, కనీసం 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును, కనీసం 20 సెకన్ల పాటు చూడాలి).

## పుదీనా ఆకులు తింటే.. గ్యాస్ సమస్య తగ్గుతుందా?

వంటల్లో రుచి, సువాసన కోసం ఉపయోగించే పుదీనా ఆకులు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. ముఖ్యంగా గ్యాస్, ఎసిడిటీ, అజీర్ణం వంటి జీర్ణ సమస్యలతో బాధపడేవారికి ఇవి కొంత ఉపశమనం కలిగిస్తాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అయితే పుదీనా ఏ వ్యాధికీ నేరుగా మందు కాదని, ఆరోగ్యకరమైన ఆహారం, జీవనశైలిలో భాగంగా తీసుకుంటేనే మంచి ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ రోజుల్లో జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం, సమయానికి భోజనం చేయకపోవడం, ఒత్తిడి, వ్యాయా మం లేకపోవడం వల్ల గ్యాస్, కడుపు ఉబ్బరం, ఎసిడిటీ, అజీర్ణం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో పుదీనా ఉపయోగపడుతుంది. ఆయుర్వేదంలో కూడా పుదీనాను చాలా కాలంగా ఉపయోగిస్తున్నారు. పుదీనాలో ఉండే మెంథాల్ జీర్ణవ్యవస్థ కండరాలను సడలించడంలో సహాయపడుతుంది. దీంతో కొంతమందిలో గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. భోజనం తర్వాత ఒక కప్పు పుదీనా టీ లేదా పుదీనా నీరు తాగితే జీర్ణక్రియకు మేలు జరుగుతుంది.



కొంతమందిలో పుదీనా.. కడుపులో అసౌకర్యాన్ని తగ్గించవచ్చు. అయితే GERD (గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్లక్స్) లేదా తీవ్రమైన యాసిడ్ రిఫ్లక్స్ ఉన్నవారిలో మాత్రం పుదీనా గుండెల్లో మంటను పెంచే అవకాశం ఉంది. అలాంటి వారు వైద్యుల సలహా తీసుకుని మాత్రమే ఉపయోగించడం మంచిది. పుదీనాలో ఉండే సహజ యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు నోటిలో దుర్వాసనకు కారణమయ్యే బ్యాక్టీరియా పెరుగుదలను తగ్గించడంలో సహాయపడతాయి. భోజనం తర్వాత కొన్ని పుదీనా ఆకులు నమలడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. పుదీనాలో విటమిన్ ఏ, విటమిన్ సి, ఐరన్, మాంగనీస్ వంటి పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీర కణాలను రక్షించడంలో, రోగనిరోధక శక్తికి మద్దతు ఇవ్వడంలో సహాయపడతాయి. పుదీనాలోని శోథ నిరోధక గుణాలు.. మొటిమలు, స్వల్ప చర్మ వాపు, అధిక నూనె ఉత్పత్తిని తగ్గించడంలో సహాయపడవచ్చు.

ఉదయం 5-6 పుదీనా ఆకులను గోరువెచ్చని నీటిలో వేసి తాగవచ్చు. పుదీనా-అల్లం హెర్బల్ టీ తయారు చేసుకుని తాగవచ్చు.

చట్నీలు, సలాడ్లు, శాండ్‌విచ్‌లు, సూప్‌లలో చేర్చుకోవచ్చు. మజ్జిగలో పుదీనా, జీలకర్ర పొడి కలిపి తాగితే జీర్ణక్రియకు ఉపయోగపడుతుంది.

గుర్తుంచుకోవాల్సిన విషయాలు

పుదీనాను అధికంగా తీసుకోవడం అందరికీ మంచిది కాదు.

తీవ్రమైన యాసిడ్ రిఫ్లక్స్ లేదా దీర్ఘకాలిక జీర్ణ సమస్యలు ఉన్నవారు ముందుగా వైద్యులని సంప్రదించాలి.

## సింగపూర్ భామల బ్యూటీ సీక్రెట్స్!

ప్రస్తుతం అందాన్ని ద్విగుణీకృతం చేసుకోవడానికి ఎన్నెన్నో సౌందర్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. అయితే ఎన్నున్నా ప్రకృతిలో లభించే పదార్థాలనే తమ సౌందర్య పరిరక్షణ కోసం ఉపయోగిస్తారట కొంతమంది సింగపూర్ భామలు. వయసు పెరుగుతున్నా వన్నె తరగని తమ సౌందర్య రహస్యం కూడా ఇదేనంటున్నారు. మరి, ఇంతకీ వాళ్ల బ్యూటీ సీక్రెట్స్ ఏంటో మనమూ తెలుసుకుందాం రండి.. చర్మం తాజాగా కనిపించాలన్నా, వృద్ధాప్య ఛాయలు దరిచేరకుండా యవ్వనంగా మెరిసిపోవాలన్నా.. చర్మం తేమగా ఉన్నప్పుడే అది సాధ్యమవుతుంది. అందుకోసం నీళ్లు ఎక్కువగా తాగడం, చక్కటి పోషకాహారం తీసుకోవడం.. వంటివి కామనే. వీటితో పాటు కొంతమంది సింగపూర్ మగువలు తమ చర్మాన్ని తేమగా ఉంచుకోవడానికి ఒక సహజసిద్ధమైన ఫేస్‌ప్యాక్‌ను కూడా ఉపయోగిస్తారట. బాగా పండిన అవకాడో లేదా బొప్పాయి లేదా రెండూ కలిపి గుజ్జులా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పట్టించి ఇరవై నిమిషాల పాటు ఉంచుకొని చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఇలా తరచూ చేయడం వల్ల చర్మం తేమను సంతరించుకుంటుందట. ముఖ్యంగా బొప్పాయిలో ఉండే పపైన్ అనే ఎంజైమ్ చర్మం పొడిబారిపోయి పొలుసులుగా ఊడిపోయే సమస్యను తగ్గిస్తుందట. తద్వారా చర్మం తాజాగా, ప్రకాశవంతంగా, మృదువుగా మారుతుందట.

సాధారణంగా ఫేషియల్ కాస్త సమయంతో కూడుకున్నది. అయితే ఈ సమయాన్నీ వృథా చేయడం ఇష్టం లేని వారి కోసమే ప్రస్తుతం ఫేషియల్ షీట్ మాస్కులు మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటిని ఉపయోగించుకునే అమ్మాయిల సంఖ్య కూడా రోజురోజుకీ పెరుగుతోంది. ఈ క్రమంలోనే సింగపూర్ అతివలు సైతం తమ అందాన్ని సంరక్షించుకోవడానికి వివిధ రకాల ఫేషియల్ షీట్ మాస్కుల్ని ఉపయోగిస్తారట.

జుట్టు, గోళ్లను సంరక్షించుకోవడానికి సింగపూర్ అతివలు ఆర్గన్ ఆయిల్ వాడుతుంటారు. ఈ నూనెలో విటమిన్ 'ఇ', ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవి చర్మానికి లోలోపలి నుంచి తేమనందించి తాజాగా కనిపించేలా చేస్తాయట. ఇందుకోసం ఈ నూనెతో చర్మం, జుట్టు, గోళ్లను కాసేపు మర్దన చేసుకోవాల్సి ఉంటుంది అంటున్నారు నిపుణులు.

కొంతమందికి చర్మం, జుట్టు కుదుళ్లు పదే పదే జిడ్డుగా మారతాయి. తద్వారా జుట్టు ఎక్కువగా రాలిపోవడం, గడ్డిలా మారడం, చుండ్రు.. వంటి సమస్యలొస్తాయి. వీటి పరిష్కారానికి కొబ్బరి నూనెను ఉపయోగిస్తారట కొంతమంది సింగపూర్ భామలు. ఈ క్రమంలో పడుకునే ముందు కుదుళ్లకు, జుట్టుకు కొబ్బరి నూనెను పట్టించి.. కాసేపు మర్దన చేయాలి. ఉదయాన్నే గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేస్తే సరిపోతుందట.



## షుగర్ వ్యాధి నియంత్రణకు వక్రాసనం...



పాంక్రియాస్(క్లోమ గ్రంథి) ఇన్సులిన్‌ను సక్రమంగా విడుదల చేస్తుంది. తల భాగాన్ని వీలు ఉన్నంతగా కుడి పక్కకు తిప్పుతూ కుడి భుజం వైపుగా చూసేందుకు ప్రయత్నించాలి.

ఈ స్థితిలో శ్వాస సాధారణంగా తీసుకుంటూ 15-30 సెకన్లు ఉండవచ్చు. ఆపై నెమ్మదిగా ఆసనాన్ని విడుదల చేయాలి. ఈసారి రెండోవైపూ ఇలానే చేయాలి. తర్వాత విశ్రాంతి పొందాలి.

ఉపయోగాలు: మధుమేహ బాధితులకు చాలా మంచి ఆసనం. బరువుని నియంత్రణలో పెట్టుకోవడానికీ ఉపయోగపడుతుంది. అంతర్గత అవయవాలకు మసాజ్ చేసినట్లవుతుంది.

భంగిమలో శరీరం వంగి ఉంటుంది. అందుకే దీనికా పేరు. చేసే విధానం: విశ్రాంతిగా కూర్చొని కాళ్లను ముందుకు చాచండి. ఎడమ కాలిని అలానే ఉంచి, కుడి కాలిని వెనక్కి వంచాలి. తర్వాత శరీరాన్ని కుడివైపు తిప్పండి. ఆపై ఎడమ చేతిని కుడి కాలి మీదుగా తీసుకువచ్చి ఎడమ కాలిని పట్టుకునే ప్రయత్నం చేయాలి. ఇప్పుడు కుడి చేతిని వెనకవైపు నేలకు ఆనించి ఉంచండి. ఈ లాకింగ్ పద్ధతి ద్వారా అంతర్గత అవయవాల మీద తగిన ఒత్తిడి కలిగి ఎంతో మేలు జరుగుతుంది. ముఖ్యంగా

## చీరల్ని ఇస్త్రీ చేస్తున్నారా?

చీర భారతీయ సంప్రదాయమే కాదు... అమ్మాయిల అందాన్ని రెట్టింపు చేసే గొప్ప సాధనం కూడా. అందుకే, తరాలెన్ని మారినా... దానిపై తరగని మోజు. కట్టులో కొత్త దారులెన్నో వెతుకుతున్నారు. ఈ క్రమంలోనే శారీలను తెగ ఐరన్ చేస్తున్నారు. అవగాహన లేక వాటిని పాడు చేసుకుంటున్నారు. అయితే, చీరలో వాడే నూలును బట్టి దాని ఇస్త్రీ పద్ధతి మారుతుంది. ఏ ఫ్యాబ్రిక్స్‌తో ఎలాంటి ఇబ్బందులు వస్తాయో ఇక్కడ చూద్దామా?

పట్టుచీరలు: విలువైన వీటిని సరిగా ఇస్త్రీ చేయకపోతే జరీ కరిగిపోవడం, నల్లబడటంలాంటి సమస్యలు ఎదురవుతాయి. అధిక వేడి ఇందుకు కారణం. అందుకే, ఇస్త్రీ పెట్టెను నేరుగా ఈ తరహా చీరలపై ఉంచకూడదు. వెనక్కి తిప్పి ఐరన్ చేయాలి. లేదా పట్టుచీరపై ఒక తెల్లటి కాటన్ క్లాత్ వేసి, దానిపై నుంచి మీడియం హీట్‌లో ఐరన్ చేయాలి. కాటన్ చీరలు: కాటన్ చీరలకు ఉండే పెద్ద సమస్య ముడతలు, గంజితో వచ్చే స్టిఫ్‌నెస్, తేలిగ్గా పోని ముడతలు. అందుకే, వీటిని ఇస్త్రీ చేయడానికిఎక్కువ వేడి అవసరమవుతుంది. అధిక ఒత్తిడి పెట్టి చేయాల్సి వస్తుంది. ఇలాంటప్పుడు ఈ చీరలపై కొద్దిగా నీటిని స్ప్రే చేసి తర్వాత ఇస్త్రీ చేయాలి. జార్జెట్ - షిఫాన్: ఇవి చాలా సాఫ్ట్‌గా, జారిపోయే గుణాన్ని కలిగి ఉంటాయి. ఇలాంటివి ఇస్త్రీ చేసేటప్పుడు చాలా తక్కువ వేడి వాడాలి. ఐరన్ బాక్స్‌ను సిల్క్, సింథటిక్ మోడ్‌లో ఉంచాలి. లేదంటే చీర కాలిపోతుంది లేదా ముడుచుకుపోతుంది. ఆర్గాంజా-నెట్టెడ్ చీరలు: ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఆర్గాంజా ఫ్యాబ్రిక్ జారిపోతున్నట్లుగా ఉంటుంది. వీటికి కుచ్చిళ్లు సరిగ్గా నిలబడవు. ఐరన్ చేసేటప్పుడు ఎంత ప్రెస్ చేసినా మళ్లీ పైకి లేస్తుంటాయి. నెట్టెడ్ చీరలైతే ప్లాస్టిక్ నూలుతో తయారవుతాయి కాబట్టి వేడి తగిలితే వెంటనే కరిగిపోతాయి. ఆర్గాంజాకు లైట్ హీట్ మాత్రమే వాడాలి. ఐరన్ చేసిన వెంటనే ఆ మడతలపై ఏదైనా బరువైన పుస్తకం లేదా వస్తువును కొద్దిసేపు ఉంచితే సరి.



## 6 నెలల్లో 59% పెరిగిన డేటా సెంటర్ల సామర్థ్యం

భారత డేటా సెంటర్ల విభాగంలో తాజా సామర్థ్య పెంపు, జనవరి–జూన్‌లో 59% వార్షిక వృద్ధిని నమోదు చేసింది. 258 మెగావాట్ ఐటీ సామర్థ్యం జతచేరినట్లు స్థిరాస్తి కన్సల్టెంట్ సావిల్స్ ఇండియా తన నివేదికలో తెలిపింది. 2025 ప్రథమార్ధంలో 162 ఎమ్‌డబ్ల్యూ ఐటీ నిర్మితమైనట్లు గుర్తు చేసింది. దీంతో దేశంలో మొత్తం కార్యకలాపాల్లో ఉన్న డేటా సెంటర్ల సామర్థ్యం 1.8 గిగావాట్ ఐటీకి చేరింది. హైపర్‌స్కేలర్స్ 36%, ఎంటర్‌ప్రైజ్ ఆధారిత సదుపాయాలు 8%, ఎడ్జ్ డేటా సెంటర్లు 1% ఉన్నాయి.




# మళ్లీ పెరిగిన బంగారం ధరలు



హైదరాబాద్ విపణిలో బుధవారం ఉదయం 10 గ్రాముల మేలిమి 24 క్యారెట్ల పసిడి (Gold) ధర రూ.1,49,400కు చేరింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.2వేలు పెరగింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.32లక్షలు పలికింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో బంగారం ఆగస్టు ఫ్యూచర్స్ ధర 1.06శాతం పెరిగి రూ.1.44లక్షలుగా కొనసాగుతోంది. వెండి సెప్టెంబరు ఫ్యూచర్స్ ధర కూడా ఒక శాతం పెరిగి రూ.2.26లక్షలుగా కొనసాగుతోంది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు పుత్తడి ధర 4,129 డాలర్లు పలికింది. ఔన్సు వెండి ధర 60 డాలర్లు వద్ద ట్రేడ్ అవుతోంది. ఇరాన్‌తో ఇప్పట్లో చర్చలు ఉండవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. ఫలితంగా ద్రవ్యోల్బణ భయాలు నెలకొన్నాయి. ఈ అనిశ్చిత పరిస్థితుల్లో బంగారం, వెండిలో పెట్టుబడులు శ్రేయస్కరమని మదుపర్లు భావిస్తున్నారు. దీంతో వీటికి డిమాండ్ ఏర్పడింది.

దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఇరాన్‌పై అమెరికా దాడులు, ద్రవ్యోల్బణ భయాలతో ఈ లోహాలకు గిరాకీ ఏర్పడింది. దీంతో వీటి ధరలు పెరుగుతున్నాయి.

# మూడో రోజూ నష్టాల్లో సూచీలు..



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా క్రూడాయిల్ ధరలు భారీగా పెరగడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ముఖ్యంగా పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దీంతో వరుసగా మూడో రోజూ సూచీలు నష్టాలు చవిచూశాయి. నిఫ్టీ 24 వేల మార్కు దిగువకు చేరింది. మూడు ట్రేడింగ్ సెషన్లలో కలిపి సెన్సెక్స్ 1400, నిఫ్టీ 300 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.

సెన్సెక్స్ ఉదయం 77,384.95 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,470.11) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఆపై మరింత నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 76,641.19 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 715.06 పాయింట్ల నష్టంతో 76,755.05 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 191.45 పాయింట్ల నష్టంతో 23,996.25 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.57గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, టైటాన్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 94.74 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ధర ఔన్సు 4117.15 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ పారితోషికం రూ.175 కోట్లు



హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) సి.విజయకుమార్, గత ఆర్థిక సంవత్సరం (2025–26)లో 18.13 మిలియన్ డాలర్ల (సుమారు రూ.175 కోట్ల) పారితోషికాన్ని అందుకున్నారు. 2024–25 పారితోషికం కంటే ఇది 66.9% ఎక్కువ. అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న విజయకుమార్... హెచ్‌సీఎల్ టెక్ అనుబంధ సంస్థ అయిన హెచ్‌సీఎల్ అమెరికా ఇంక్ ద్వారా వేతనాన్ని తీసుకుంటున్నారు. ప్రధానంగా దీర్ఘకాలిక ప్రోత్సాహకాలు (ఎల్‌టీఐ), స్టాక్ ఆప్షన్‌ల వల్లే ఆయన పారితోషికం బాగా పెరిగిందని కంపెనీ వార్షిక నివేదిక ఆధారంగా తెలుస్తోంది. 2025–26లో విజయకుమార్ అందుకున్న 18.13 మిలియన్ డాలర్ల పారితోషికంలో ఎల్‌టీఐ 3.94 మిలియన్ డాలర్లు కాగా.. రెస్ట్రిక్టెడ్ స్టాక్ యూనిట్స్ (ఆర్‌ఎస్‌యూ) ద్వారా లభించిన మొత్తం 9.40 మిలియన్ డాలర్లుగా ఉంది. మూలవేతనం 2.48 మిలియన్ డాలర్లు, పనితీరు ఆధారిత బోనస్ 2 మిలియన్ డాలర్లు, ఇతర ప్రయోజనాలు 3.1 లక్షల డాలర్లు చొప్పున ఉన్నాయి. ఎల్‌టీఐ, ఆర్‌ఎస్‌యూ విలువను మినహాయిస్తే.. విజయకుమార్ పారితోషికంలో పెరుగుదల 22.86 శాతానికి పరిమితం అవుతుందని కంపెనీ తెలిపింది. దేశీయ ఐటీ దిగ్గజ సంస్థల సీఈఓలతో పోలిస్తే విజయకుమార్ పారితోషికమే అధికంగా ఉంది. 2025–26లో టీసీఎస్ సీఈఓ, ఎండీ కె కృతివాసన్‌కు రూ.28 కోట్లు, ఇన్ఫీ సీఈఓ సలీల్ పరేఖ్‌కు రూ.82.60 కోట్లు, విప్రో సీఈఓ శ్రీనివాస్ పల్లియాకు రూ.49.64 కోట్ల పారితోషికం లభించింది. హెచ్‌సీఎల్ టెక్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం ఉద్యోగుల మధ్యస్థ వేతన విలువతో పోలిస్తే విజయ్‌కుమార్ పారితోషికం 291.90 రెట్లు అధికంగా ఉంది.

## పేటీఎం.. బోనస్ షేర్ల జారీ లేదు




జూన్ త్రైమాసికానికి మెరుగైన గణాంకాలనే ప్రకటించినా.. బోనస్ ఈక్విటీ షేర్ల జారీ ప్రతిపాదన విషయంలో పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ వెనకడుగు వేసింది. ప్రస్తుతానికి బోనస్ షేర్లు జారీ చేయకూడదని బోర్డు డైరెక్టర్లు నిర్ణయం తీసుకున్నారని మంగళవారం తెలిపింది. వాటాదార్లకు విలువ సృష్టించేందుకు మరింత వృద్ధి, లాభదాయకతపై దృష్టి సారించాలని భావిస్తుండటమే ఇందుకు కారణంగా పేర్కొంది.
ఏప్రిల్ – జూన్ త్రైమాసికానికి పేటీఎం త్రైమాసికంతో పోలిస్తే నికర లాభం రూ.220 కోట్లుగా నమోదైంది. 2024–25 ఇదే కాల లాభం రూ.123 కోట్ల కంటే ఇది 79% ఎక్కువ. ఇదే సమయంలో నిర్వహణ ఆదాయం 28% పెరిగి రూ.2,448 కోట్లుగా, ఎబిటా 182% వృద్ధితో రూ.203 కోట్లుగా నమోదైంది.

# దేశీయ భాగస్వామ్యానికి ఫోక్స్‌వ్యాగన్ సై!




జర్మనీకి చెందిన ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్, కొన్నేళ్లుగా మనదేశంలో ప్రయాణికుల వాహన (పీవీ –కార్లు, ఎస్‌యూవీల) విపణిలో పట్టు కోసం ప్రయత్నిస్తోంది. స్థానికంగా వాహనాల తయారీకి పెట్టుబడి పెట్టి, మనదేశానికి ప్రత్యేకమైన ఉత్పత్తులనూ అభివృద్ధి చేసింది. తన ఇంజినీరింగ్ విభాగాన్ని ఇక్కడ విస్తరించింది. బ్రాండ్‌ల ప్రచార వ్యూహాలనూ మార్చింది. రెండు దశాబ్దాల పాటు ఇంతగా ప్రయత్నించినా కూడా దేశీయ కార్ల విపణిలో భారీ వాటా సంపాదించుకోలేకపోయింది. ఈ పరిస్థితి మార్చేందుకు దేశీయ సంస్థతో జట్టుకట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. గ్రూప్ ఆధీనంలో ఫోక్స్‌వ్యాగన్, స్కోడా, బెంట్లీ, లంబోర్ఘిని, పోర్షే వంటి బ్రాండ్లున్నాయి. ఇప్పుడు స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియాలో వ్యూహాత్మక పెట్టుబడి కోసం, దేశీయ సంస్థ జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌తో ఫోక్స్‌వ్యాగన్ ఉన్నత స్థాయి చర్చలు జరుపుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. స్కోడా ఇండియాలో నియంత్రణ వాటాను జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ దక్కించుకునే అవకాశం ఉందనీ చెబుతున్నారు. ఇందుకోసం కంపెనీ విలువ, పెట్టుబడి పరిమాణం, భవిష్యత్తులో పెట్టాల్సిన మూలధనం వంటి అంశాలపై చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందం కుదిరితే, 2007లో మన దేశంలోకి ప్రవేశించినప్పటి నుంచి ఫోక్స్‌వ్యాగన్‌కు ఇదే అతిపెద్ద వ్యూహాత్మక మార్పుగా నిలుస్తుందని సమాచారం. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో జర్మనీలోని తన ప్లాంట్లలో కొన్నింటిని మూసివేస్తుండటంతో పాటు భారీ ఎత్తున ఉద్యోగులను ఫోక్స్‌వ్యాగన్ తొలగిస్తోందని వార్తలు వస్తుండగా, దేశీయంగా తాజా పరిణామం ఆసక్తికరం. ఫోక్స్‌వ్యాగన్‌కు మనదేశంలో పుణె సమీపంలోని చకాన్, ఔరంగబాద్‌లలో తయారీ కేంద్రాలున్నాయి. ఫోక్స్‌వ్యాగన్, స్కోడా, బెంట్లీ, లంబోర్ఘిని, పోర్షే వంటి తన అన్ని బ్రాండ్లను సంస్థ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చింది. టైగన్, వర్టస్, కుషాక్, స్లేవియా వంటి మోడళ్లను దేశీయంగా రూపొందించింది. పుణెలోని కేంద్రం ఏటా 2,25,000కు పైగా కార్లను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కలిగి ఉండగా, ఛత్రపతి శంభాజీనగర్ (గతంలో ఔరంగాబాద్)లోని కేంద్రం 60,000 కార్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది. సియామ్ గణాంకాల ప్రకారం, జూన్ త్రైమాసికం ఆఖరుకు ఫోక్స్‌వ్యాగన్, స్కోడా బ్రాండ్లు కలిపి మన దేశంలో 2% మార్కెట్ వాటా కలిగి ఉన్నాయి. ఎగుమతి విపణిలో వాటి వాటా 10%. ఫోక్స్‌వ్యాగన్ వాహనాల ధరలు మాస్ మార్కెట్ కంటే కాస్త దూరంగా ఉంటాయి. దేశీయంగా అమ్మకాలు అధికంగా ఉండకపోవడానికి ఇదీ కారణమే.




## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో.. డేవిడ్ వార్నర్ దోషే



ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ తన తప్పును అంగీకరించాడు. గత ఏప్రిల్‌లో మద్యం తాగి వాహనం నడిపిన కేసులో సిడ్నీ పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఆ తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చాడు. తాజాగా ఆ కేసును సిడ్నీ న్యాయస్థానం విచారించింది. నేరాన్ని వార్నర్ అంగీకరించినట్లు అతడి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. బిగ్ బాష్ లీగ్‌లో సిడ్నీ థండర్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న వార్నర్ కోర్టుకు నేరుగా హాజరు కాలేదు. వాదనలు విన్న న్యాయస్థానం అతడిని దోషిగా తేలుస్తూ వచ్చే నెల 18న శిక్ష ఖరారు చేయనుంది.
రోడ్డుపై బ్రీత్ టెస్టింగ్‌ను చూడగానే వార్నర్ తన వాహనాన్ని ఆపి పక్కనే పార్క్ చేశాడు. అనుమానం వచ్చిన అధికారులు బ్రీత్ అనలైజర్‌తో టెస్ట్ చేశారు. ఇందులో వార్నర్ పరిమితికి మించి మద్యం సేవించినట్లు తేలడంతో అరెస్టు చేశారు.

# రికార్డులు సృష్టించిన ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్

దాదాపు 16 స్టేడియాలు ఆతిథ్యం ఇచ్చిన ఫిఫా ప్రపంచ కప్ విజేతగా స్పెయిన్ నిలిచింది. ఫైనల్‌లో అర్జెంటీనాను చిత్తు చేసింది. ఆటగాళ్ల రవాణా అంశం నుంచి.. ఒకే జట్టుకు పక్షపాతంగా వ్యవహరించారంటూ ఫిఫాపై ఆరోపణల వరకూ వరల్డ్ కప్ ప్రతి రోజూ వార్తల్లో నిలిచింది. దాదాపు ఆరువారాలపాటు నిర్విరామంగా మ్యాచులతో అభిమానులను అలరించింది. ఛాంపియన్‌గా నిలిచిన స్పెయిన్ దాదాపు రూ.480 కోట్ల ప్రైజ్‌మనీ అందుకుంది. ఇటు వీక్షణలపరంగానూ ఫైనల్ మ్యాచ్ రికార్డులు సృష్టించింది.
స్పెయిన్ – అర్జెంటీనా పోరును దాదాపు 3.89 కోట్ల మంది వీక్షించినట్లు ఫాక్స్ గ్రూప్ తెలిపింది. ఒక దశలో 5.16 కోట్ల మార్క్‌ను చేరినట్లు పేర్కొంది. యూఎస్ చరిత్రలో ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో అత్యధిక మంది వీక్షించిన మ్యాచ్‌గా రికార్డు సృష్టించింది. మరోవైపు ప్రముఖ బ్రాడ్‌కాస్ట్ 'టెలెముండోస్' కూడా తమ ఛానళ్లలో 2.26 కోట్ల మంది చూసినట్లు వెల్లడించింది. దీంతో అమెరికాలోనే 6 కోట్ల మందికిపైగా వ్యూయర్స్ మ్యాచ్‌ను వీక్షించినట్లు తెలుస్తోంది. ఇక ప్రపంచ వ్యాప్తంగా అయితే 150 కోట్ల మంది వరకూ ఫైనల్‌ను చూసినట్లు నిపుణులు అంచనా వేశారు. అయితే.. ఇవి అధికారికంగా రిలీజ్ చేసిన గణాంకాలు కావు.
ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌నకు ఆతిథ్యం ఇచ్చిన అమెరికా, మెక్సికో, కెనడా నాకౌట్ స్టేజ్‌లో నిష్క్రమించాయి. అయినా సరే అమెరికాతో సహా ఇతర దేశాల్లో ఫుట్‌బాల్ మ్యాచులను అభిమానులు భారీగానే వీక్షించారు. మెస్సి, క్లియాన్ ఎంబాపె, ఇర్లింగ్ హాలాండ్, క్రిస్టియానో రొనాల్డో వంటి స్టార్ల ఆటను చూసేందుకు ఆసక్తి చూపించారు. యువ సంచలనం యమాల్‌తో మెస్సి పోరు ఎలా ఉంటుందోనని స్క్రీన్లకు అతుక్కుపోయారు. మరోవైపు టికెట్ ధరలు ఎక్కువగా ఉండటంతో.. టీవీల్లో వీక్షించేవారి సంఖ్య పెరిగింది. ఈ సందర్భంగా వరల్డ్ కప్‌ను నిర్వహించిన ఆతిథ్య దేశాలపై ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్‌ఫాంటినో ప్రశంసల వర్షం కురిపించారు.




# టీమ్ఇండియా జెర్సీని ధరించడమే నా మొదటి లక్ష్యం: అశోక్ శర్మ




భారత జట్టు జెర్సీని ధరించడమే తన మొదటి లక్ష్యమని ఫాస్ట్ బౌలర్ అశోక్ శర్మ (Ashok Sharma) పేర్కొన్నాడు. టీమ్ఇండియా జెర్సీని ధరించి దేశానికి ప్రాతినిధ్యం వహించే ఆ క్షణం కోసం ఎదురుచూస్తున్నానని అన్నాడు. తన ఎదుగుదలకు గుజరాత్ టైటాన్స్ కోచ్ ఆశిశ్ నెహ్రా మద్దతుగా నిలిచాడని, ఆయనను తొలి గురువుగా భావిస్తానని పేర్కొన్నాడు. 24 ఏళ్ల అశోక్.. దేశవాళీ క్రికెట్‌లో రాజస్థాన్‌కు ఆడి ఆకట్టుకున్నాడు. గత ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున అరంగేట్రం చేసిన ఈ పేసర్.. ఓ మ్యాచ్‌లో 150 కి.మీ. కంటే ఎక్కువ వేగంతో బౌలింగ్ చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ క్రమంలో జులై 23 నుంచి జింబాబ్వే, భారత్ (ZIM vs IND) మధ్య జరగనున్న మూడు టీ20ల సిరీస్‌కు అశోక్ ఎంపికయ్యాడు. "నాకు ఏ చిన్న సందేహం వచ్చినా ఆశిశ్ సర్ దగ్గరికే వెళ్లేవాడిని. మ్యాచ్‌ల తర్వాత ఆయన గదికి వెళ్లి నా బౌలింగ్ వీడియోలను చూసేవాడిని. ఇంకా ఏ అంశాలను మెరుగుపరుచుకోవాలి, దేనిపై దృష్టి పెట్టాలి అనే విషయాలను అడిగి తెలుసుకునేవాడిని. జింబాబ్వేతో సిరీస్‌కు ఎంపికయ్యా. ఎక్కువ వికెట్లు తీసి, సాధ్యమైనన్ని ఎక్కువ మ్యాచ్‌లు ఆడాలనుకుంటున్నా. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్నా. ఆ తర్వాత వీలైనంత త్వరగా టీమ్ఇండియా తరఫున టెస్టు క్రికెట్ ఆడటమే లక్ష్యంగా ముందుకు సాగుతా'' అని అశోక్ శర్మ పేర్కొన్నాడు.

## గత నాలుగు నెలల్లో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నా: వైభవ్ సూర్యవంశీ

ఇటీవల కాలంలో తాను ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొన్నట్లు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తెలిపాడు. జింబాబ్వేతో టీ20 సిరీస్ కోసం సిద్ధమవుతోన్న అతడు బీసీసీఐతో మాట్లాడాడు. క్రికెటర్ కెరీర్‌లో ఇవన్నీ సహజమేనని.. వాటన్నింటిని అధిగమించి వందశాతం మెరుగైన ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తానని వెల్లడించాడు. ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌తో అరంగేట్రం చేసిన వైభవ్ మూడు మ్యాచుల్లోనే ఆడాడు. అతడిని తప్పించడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. మరోవైపు ఇంగ్లాండ్‌పై విఫలమైన వైభవ్.. జింబాబ్వేపై సత్తా చూపించాల్సిన అవసరం ఉంది. ఐపీఎల్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టా. ఈ నాలుగు నెలల్లోనే నేను ఒడుదొడుకులను చూశా. క్రికెట్‌లో ఇవన్నీ సహజమేనని తెలుసు. నా సన్నద్ధతను మాత్రం ఆపలేదు. మళ్లీ ఎప్పుడు ఆడే అవకాశం వచ్చినా నా బెస్ట్ ప్రదర్శన ఇస్తా. క్రికెట్‌లో మనం అనుకున్నవన్నీ ఒక్కోసారి జరగకపోవచ్చు. కానీ, అందుకోసం ప్రయత్నించడం మాత్రం ఆపకూడదు. ఒక మ్యాచ్‌కు బెంచ్‌పై కూర్చున్నప్పుడు నిరాశ ఎదురు కావడం సహజమే. కానీ, చుట్టూ ఉండేవారు మద్దతు ఇచ్చినప్పుడు మళ్లీ ఎక్కువగా ప్రాక్టీస్ చేసి సిద్ధం కావాల్సిన అవసరం ఉంది '' అని వైభవ్ తెలిపాడు.




# ఎగిసిందో కొత్త రాకెట్




ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్.. ఈ పేరు చెప్పగానే ప్రకాశ్ పదుకొనె, పుల్లెల గోపీచంద్ గుర్తుకొస్తారు. వీరి తర్వాత ఎందరో స్టార్లు ప్రయత్నించినా.. ఈ ప్రతిష్ఠాత్మక బ్యాడ్మింటన్ టైటిల్‌ను సాధించలేకపోయారు. సుదీర్ఘ విరామం తర్వాత ఒక భారత ఆటగాడు ఆల్ ఇంగ్లాండ్ వేదికపై తళుక్కుమన్నాడు. జూనియర్ ఆల్ ఇంగ్లాండ్ టైటిల్ గెలిచి ఔరా అనిపించాడు. ఆ యువ షట్లరే సాయి నచికేత్ భట్రాజు. ఈ తెలుగు తేజం తాజాగా ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ అండర్–19 సింగిల్స్ జూనియర్ టైటిల్ గెలిచి సత్తా చాటాడు. ఫైనల్లో అతడు 21–8, 21–15తో సుహాస్‌పై గెలిచి విజేతగా నిలిచాడు. రాయలసీమకు చెందిన నచికేత్.. ఆరేళ్ల వయసులో రాకెట్ పట్టాడు. మొదట కోచ్ ఫణి శిక్షణలో ఆ ఆటలో ఓనమాలు దిద్దుకున్న అతడు.. ఆపై 2018లో భాస్కర్ బాబు అకాడమీలో చేరి ఆటకు మరింత పదును పెట్టుకున్నాడు. ప్రస్తుతం అతడు మాజీ ప్రపంచ నంబర్–10 ఆటగాడు చేతన్ ఆనంద్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. వయసు విభాగాల టోర్నీల్లో స్థిరంగా రాణించిన నచికేత్.. 2024లో వరంగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి టోర్నీలో అండర్–17లో రన్నరప్‌గా నిలిచాడు. గత సంవత్సరం నిర్మల్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర బ్యాడ్మింటన్ టోర్నీలో అండర్–19 సింగిల్స్‌లో టైటిల్ అందుకున్నాడు. కోర్టులో మెరుపులా కదిలే ఈ కుర్రాడు.. స్మాష్‌లతో అదరగొడతాడు. వేగంతోనే ప్రత్యర్థిని ఇబ్బంది పెడతాడు. గత సంవత్సరం సైప్రస్ టోర్నీ ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం చేసిన నచికేత్... తొలి టోర్నీలోనే క్వార్టర్స్ వరకు వెళ్లాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన స్వీడిష్ జూనియర్ టోర్నీలో మూడో స్థానం సాధించిన నచికేత్.. అదే నెలలో జరిగిన బల్గేరియా ఓపెన్లో క్వార్టర్స్ వరకు వెళ్లాడు.

# వుదయం సినిమా

MOVIE TIME!

## 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ఫైనల్ ట్రైలర్ విడుదల

**వుదయం సినిమా**

మార్వెల్ స్టూడియోస్ తెరకెక్కించిన 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే' సినిమా ఫైనల్ ట్రైలర్ విడుదలైంది. టామ్ హాలండ్ స్పైడర్‌మ్యాన్‌గా నటిస్తున్న నాలుగో సోలో సినిమా ఇది. ఈ చిత్రం జూలై 30న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ ట్రైలర్‌లో 'స్పైడర్‌మ్యాన్: నో వే హోమ్' తర్వాత జరిగిన సంఘటనలను చూపించారు. అందరి జ్ఞాపకాల నుంచి పీటర్ పార్కర్ పూర్తిగా మాయమైన తర్వాత అతను ఒంటరిగా ఎలా జీవిస్తున్నాడో చూపించారు.





## 'రంభ ఊర్వశి మేనక' నుంచి సాంగ్ రిలీజ్

**వుదయం సినిమా:** గత కొన్నేళ్లుగా విభిన్న పాత్రలు, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలతో ప్రేక్షకులను అలరించిన అల్లరి నరేష్, ఇప్పుడు తన మార్క్ కామెడీ జోనర్ 'రంభ ఊర్వశి మేనక'తో సిద్ధమయ్యారు. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్ ను అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. "Comedy Goes Cosmic" అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందుతున్న ఈ సినిమా అల్లరి నరేష్ మార్క్ వినోదంతో మేళవించిన వినూత్న కథగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా మ్యూజికల్ జర్నీకి శ్రీకారం చుడుతూ మేకర్స్ తొలి పాట 'నా కంటి మీద కునుకే'ను విడుదల చేశారు. అల్లరి నరేష్, సురభిపై చిత్రీకరించిన ఈ పాట సినిమాలోని రొమాంటిక్ కోణాన్ని పరిచయం చేస్తూనే, గ్రామీణ నేపథ్యంలో సాగే కథకు అందమైన అనుభూతిని అందిస్తోంది. పచ్చని పల్లె అందాల నడుమ తెరకెక్కిన ఈ పాటలో, తన కలల రాణిపై మనసుపడిన యువకుడు తన ప్రేమను, అభిమానాన్ని అందంగా ప్రజెంట్ చేశారు. అల్లరి నరేష్, సురభి మధ్య కనిపించే సహజమైన కెమిస్ట్రీ ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్ గ్రామీణ సంగీతపు మాధుర్యాన్ని మోడరన్ ఆర్కెస్ట్రేషన్‌తో మేళవిస్తూ హాయిగా సాగే మెలోడీని అందించారు. భాస్కరభట్ల రవికుమార్ సాహిత్యం ప్రేమలోని మధురమైన భావాలను అందంగా ఆవిష్కరించగా, ధనుంజయ్ సీపాన తన వోకల్స్ తో పాటకు మరింత భావోద్వేగాన్ని తీసుకొచ్చారు. జిత్తు మాస్టర్ అందించిన కోరియోగ్రఫీ, అందమైన లొకేషన్స్‌తో కలిసి కనుల విందుగా వుంది. ఈ చిత్రంలో వెన్నెల కిశోర్, వీకే నరేష్, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ తదితర ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.



## 'మారెమ్మ' సెప్టెంబర్ 10న గ్రాండ్ రిలీజ్

**వుదయం సినిమా:** మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ విలేజ్ యాక్షన్-డ్రామా 'మారెమ్మ'తో హీరోగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్ర నిర్మాతలు సినిమా థియేట్రికల్ రిలీజ్ డేట్ ని ఖరారు చేశారు. ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబర్ 10, 2026న థియేటర్లలో విడుదల కానుందని ప్రకటించారు. కొత్తగా విడుదలైన పోస్టర్‌లో మాధవ్ యుద్ధంలో పోరాడి వచ్చినట్టుగా ఇంటెన్స్ అవతార్‌లో ఆకట్టుకుంటున్నారు. ఈ పోస్టర్‌లో ఆయన పాత్రలోని రా ఇంటెన్సిటీతో పాటు భావోద్వేగాలను బలంగా చూపించారు. హీరోకు, పవిత్రమైన ఆవుకు మధ్య కనిపించే పేస్ అఫ్, ఈ సినిమా కథా నేపథ్యాన్ని ఆసక్తికరంగా ప్రజెంట్ చేస్తోంది. మారెమ్మ చిత్రంతో మంచాల నాగరాజ్ దర్శకుడిగా పరిచయం అవుతుండగా, మోక్ష ఆర్ట్స్ సంస్థ ఈ సినిమాను భారీ స్థాయిలో నిర్మిస్తోంది. మయూర్ రెడ్డి బండారు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్, పాటలు, ఇటీవల విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌తో గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథపై ప్రేక్షకు ల్లో ఆసక్తిని పెంచడంలో మేకర్స్ విజయవంతమయ్యారు.



## 31న "అదే నీవు అదే నేను"

**వుదయం సినిమా:** ఇటీవల ప్రకటించిన 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో రెండు అవార్డులు సాధించిన "కమిటీ కుర్రోళ్లు" మూవీ ఫేమ్ త్రినాథ్ వర్మ, యశ్వంత్ పెండ్యాల, "సిద్ధార్థ్ రాయ్" సినిమా ఫేమ్ తన్వీ నేగి, సహర్ కృష్ణన్ హీరో హీరోయిన్స్ గా నటిస్తున్న సినిమా "అదే నీవు అదే నేను". ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మి వీరభద్ర క్రియేషన్స్ బ్యానర్ పై గోవిందు కాండ్రేగుల నిర్మిస్తున్నారు. రొమాంటిక్ థ్రిల్లర్ కథాంశంతో యువ దర్శకుడు కొండల్ రూపొందిస్తున్నారు. "అదే నీవు అదే నేను" సినిమా సెన్సార్ సహా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెల 31న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. "అదే నీవు అదే నేను" సినిమా ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ సినిమా నుంచి ఇప్పటికే ప్రముఖ నిర్మాత దిల్ రాజు చేతుల మీదుగా రిలీజ్ చేసిన టీజర్ "1 మిలియన్ వ్యూస్" తో డిజిటల్ మీడియాలో దూసుకెళ్తోంది. స్టార్ డైరెక్టర్ వి వి వినాయక్ చేతుల మీదుగా లాంఛ్ చేసిన మనసా మనసా సాంగ్ హ్యూజ్ రెస్పాన్స్ దక్కించుకున్నాయి. ఈ చిత్రం నుంచి మధురమా పాటను క్రియేటివ్ డైరెక్టర్ క్రిష్ రిలీజ్ చేయబోతున్నారు. ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి, యంగ్ హీరో ఆకాష్ పూరి, నటి ఇంద్రజ మూవీ టీమ్ కు బెస్ట్ విశెస్ అందించారు. ఇలా చిత్ర పరిశ్రమలోని పలువురు ప్రముఖుల బెస్ట్ విశెస్ అందుకున్న "అదే నీవు అదే నేను" సినిమా మీ సమీప థియేటర్స్ లో రిలీజ్ కు వస్తోంది. ఒక గేటెడ్ కమ్యూనిటీలో జరిగే సరికొత్త రొమాంటిక్ థ్రిల్లర్ కథతో అన్ని వర్గాల ప్రేక్షకులకు ఆద్యంతం ఆసక్తిని పంచేలా ఈ సినిమా ఉండబోతోంది. "అదే నీవు అదే



## 'చెన్నై' పేరు వినగానే ఆనాటి సినీ ప్రయాణం గుర్తుకొచ్చింది

### 'చెన్నై లవ్ స్టోరీ' వేడుకలో

**వుదయం సినిమా**



హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా "కలర్ ఫోటో", "బేబి" వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో రూపొందుతున్న సినిమా "చెన్నై లవ్ స్టోరీ". ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ "చెన్నై లవ్ స్టోరీ" సినిమాకు బ్లాక్ బస్టర్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ నెల 24న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు "చెన్నై లవ్ స్టోరీ" మూవీ రెడీ అవుతోంది. ఈ రోజు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో

**మెగాస్టార్ చిరంజీవి:** " 'చెన్నై లవ్ స్టోరీ' అనే టైటిల్ వినగానే నానాటి చెన్నై రోజులు, అక్కడి కష్టాలు, సాధించిన విజయాలు గుర్తుకొచ్చాయి. నా అభిమానులైన ఎస్ కేఎన్, సాయి రాజేష్ నిర్మాతలుగా, కిరణ్ హీరోగా కష్టపడి ఈ స్థాయికి రావడం గర్వకారణం. అభిమానులు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగి, తల్లిదండ్రులు గర్వపడేలా ప్రయోజకులు కావడమే నాకు నిజమైన ఆనందం. కిరణ్ అబ్బవరం పక్కింటి కుర్రాడిలా ఉంటూనే ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను విడుదల చేయడం అభినందనీయం."

**హీరో కిరణ్ అబ్బవరం:** "టీవీల్లో చూసిన మెగాస్టార్ చిరంజీవి గారు నా సినిమా ఈవెంట్‌కు రావడం జీవితంలో మర్చిపోలేని అనుభూతి. ఈ చిత్రంలో నేను చేసిన 'స్టీవెన్ శంకర్' పాత్ర నా మనస్సుకు ఎంతో దగ్గరైంది. కుటుంబమంతా కలిసి చూసేలా దర్శకుడు రవి అద్భుతమైన ఎమోషనల్ డ్రామాగా తీర్చిదిద్దారు."

**హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ:** "నా కెరీర్ ఆరంభంలోనే లోతైన భావోద్వేగాలున్న మంచి పాత్ర లభించింది. కిరణ్ గారి నటన, మణిశర్మ గారి సంగీతం, అనంత శ్రీరామ్ గారి సాహిత్యం ఈ సినిమాకు ప్రధాన బలం."

**నిర్మాతలు ఎస్ కేఎన్, సాయి రాజేష్:** "మా పిలుపును మన్నించి విచ్చేసిన మెగాస్టార్ చిరంజీవి గారికి జీవితాంతం రుణపడి ఉంటాం. 'బేబి' లాంటి సక్సెస్ తర్వాత క్వాలిటీతో కూడిన మరో క్లాసిక్ ఎమోషనల్ లవ్ స్టోరీని ప్రేక్షకులకు అందిస్తున్నాం. గురువారం నుంచే ప్రీమియర్స్ ప్రారంభమవుతున్నాయి."

**దర్శకుడు రవి నంబూరి:** "నాపై నమ్మకంతో అవకాశం ఇచ్చిన నిర్మాతలు సాయి రాజేష్, ఎస్ కేఎన్‌లకు, హీరో కిరణ్ అన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఈ చిత్రం ప్రేక్షకుల మనసులను తప్పకుండా తాకుతుంది."

ఈ వేడుకలో పాల్గొన్న నటులు నరేష్, మహేందర్, సిరి హన్మంతు, పూజ, నవీన్, త్రిగుణ్, దర్శకులు శివ నిర్వాణ, మైత్రీ ప్రొడ్యూసర్స్ నవీన్, రవిశంకర్, డీవోపీ డేనియల్, లిరిసిస్ట్ అనంత శ్రీరామ్ తదితరులు సినిమా పెద్ద విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## 'అబ్జెక్షన్ మై లార్డ్' హిట్ అవుతుంది: మెగాస్టార్ చిరంజీవి



**వుదయం సినిమా:** సినిమాలను అభినందిస్తూ వాటికి తన వంతు సపోర్ట్‌ను అందించే మెగాస్టార్ చిరంజీవి ఇప్పుడు మరోసారి ఓ న్యూ కాన్సెప్ట్ కంటెంట్‌కు అండగా నిలిచారు. అదే 'అబ్జెక్షన్ మై లార్డ్'. ఈ ఒరిజినల్ ట్రైలర్‌ను చిరంజీవి విడుదల చేశారు. ఈ నటుడు శ్రీకాంత్ మేకా ప్రధాన పాత్రలో రూపొందిన ఈ సిరీస్ ప్రముఖ ఓటీటీ ఛానెల్ జీ5లో జూలై 31 నుంచి స్ట్రీమింగ్ కానుంది. వైవిధ్యమైన సినిమాలు, సిరీస్, షోస్‌తో ప్రేక్షకులను అలరిస్తోన్న జీ5 తన ప్రత్యేకతను నిలుపుకుంటూ 'అబ్జెక్షన్ మై లార్డ్' అనే కోర్ట్ డ్రామాతో మెప్పించటానికి సిద్ధమవుతోంది. అందులో భాగంగా మేకర్స్ 'అబ్జెక్షన్ మై లార్డ్' అనే ఒరిజినల్ ట్రైలర్‌ను బుధవారం రోజున రిలీజ్ చేశారు మెగాస్టార్ చిరంజీవి. ఈ సందర్భంగా.. ఆయన మాట్లాడుతూ '''అబ్జెక్షన్ మై లార్డ్' ట్రైలర్‌ను రిలీజ్ చేయటం చాలా ఆనందంగా ఉంది. టీమ్‌కు ఆల్ ది బెస్ట్. ఈ ట్రైలర్‌ను చూస్తుంటే గతంలో వకీల్ సాబ్ సినిమా గుర్తుకు వస్తుంది. అలాగే ఇంకా వెనక్కి వెళితే నేను నటించిన నా చిత్రం న్యాయం కావాలి గుర్తుకు వస్తుంది. ఎప్పుడైనా కోర్ట్ డ్రామాలను డైరెక్టర్ సంతోష్‌లాగా తీయగలిగితే తప్పకుండా విజయాన్ని అందుకుంటుందనటంలో సందేహం లేదు. హిందీ, తెలుగు, తమిళ ఇలా ఏ భాషలోనైనా ఇలాంటి సినిమాలు హిట్ అవుతుంటాయి. జీ5కి ఏ 7 ఎపిసోడ్స్ సిరీస్ హిట్ అవుతుందని, వారికి మంచి వ్యూయర్ షిప్‌ను తీసుకువస్తుందని నమ్ముతున్నాను. టెక్నీషియన్స్ పరంగా చూస్తే.. అర్జున్ సురవరం సినిమాను రూపొందించారు.ఆ ఇసనిమా నిర్మాత విషయానికి వస్తే నా మిత్రుడు, అనుంగుడు, ఎప్పుడూ నా పక్కనే ఉండే వ్యక్తి, ఇంకా చెప్పాలంటే నా దళపతి, తమ్ముడులాంటి రాజ్ కుమార్ ఆకెళ్ల చేశాడు. మళ్లీ ఈ ఒరిజినల్ చేశారు. అర్జున్ సురవరం లాగానే నేటి ట్రెండ్‌కు తగినట్లు రూపొందిన అబ్జెక్షన్ మై లార్డ్ ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది. తప్పకుండా హిట్ అవుతుంది. కెమెరామెన్ సూర్య ఎక్స్‌లెంట్ టెక్నీషియన్. నా తమ్ముడు శ్రీకాంత్ ఎప్పటికప్పుడు తనని తాను అప్‌డేట్ చేసుకుంటూ ఉంటాడు.

## మిస్టర్ మిడిల్ క్లాస్ సక్సెస్ మీట్




**వుదయం సినిమా:** శ్రీకాంత్, లయ హీరో హీరోయిన్స్ గా నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు జి. నాగేశ్వర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన లేటెస్ట్ బిగ్ ఫన్ హిట్ 'మిస్టర్ మిడిల్ క్లాస్. జూలై 17న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్ రెస్పాన్స్ తో సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు.సక్సెస్ మీట్ లో హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు. సరదాగా థియేటర్‌కు వెళ్లి ప్రేక్షకుల మధ్య సినిమా చూసి ఇంతగా ఎంజాయ్ చేసి చాలా సంవత్సరాలు అయింది. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. వైజాగ్, కర్ణాటకలోని బళ్లారి నుంచి కూడా ఫోన్లు వస్తున్నాయి. చాలా సంవత్సరాల తర్వాత ఇంత మంచి ఎంటర్‌టైన్‌మెంట్ సినిమా చేశామనే ఆనందంగా ఉంది. త్వరలో మరో సక్సెస్ మీట్ కూడా నిర్వహిస్తాం. ఇది ఒక మంచి ఫ్యామిలీ సబ్జెక్ట్. ఒక భక్తుడికి, భగవంతుడికి మధ్య జరిగే కథను చాలా ఆసక్తికరంగా చూపించాం.

## కంటెంట్ ఉన్న సినిమాలకు.. కేరాఫ్ అడ్రస్‌గా నటుడు శివాజీ!



**వుదయం సినిమా:** ప్రేక్షకులు నటుడిగా తనకు ఇచ్చిన గుర్తింపును బాధ్యతగా ఫీలయ్యి, వాళ్లను వైవిధ్యమైన పాత్రలతో, కంటెంట్ ఉన్న సినిమాలతో ఎంటర్‌టైన్ చేయడమే లక్ష్యంగా సినిమాలు చేసే నటులు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి అరుదైన నటుల్లో శివాజీ ముందు వరుసలో ఉంటారు.. నటుడిగా, హీరోగా ఎన్నో విలక్షణమైన పాత్రలు పోషించారు. కామెడీ, ఎమోషన్, ఫ్యామిలీ, యాక్షన్ ఇలా అన్ని రకాల కథలతో ఆడియెన్స్‌ని ఆయన ఆకట్టుకున్నారు. అయితే సినిమాలకి కాస్త గ్యాప్ ఇచ్చిన ఆయన బిగ్ బాస్ షోతో మళ్లీ కెరీర్‌ను ప్రారంభించారు. బిగ్ బాస్ షోతో శివాజీ ప్రతీ ఇంటి గడపలోకి, తెలుగు వారి మనసుల్లో మళ్లీ స్థానాన్ని సంపాదించుకున్నారు. బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన శివాజీకి ఎన్నో అవకాశాలు తలుపు తట్టాయి. అయితే శివాజీ మాత్రం అచితూచి అడుగులు వేయాలని నిర్ణయించుకున్నాడు. తనకు నచ్చిన, మెచ్చిన కథల్ని ఎంచుకుంటున్నారు.

## 'యమకింకరుడు' ట్రైలర్ విడుదల



**వుదయం సినిమా:** ప్రముఖ నిర్మాత, దర్శకుడు తుమ్మలపల్లి రామసత్యనారాయణ టైటిల్ పాత్ర పోషిస్తూ, దర్శకత్వం వహించి నిర్మిస్తున్న వినూత్న చిత్రం 'యమ కింకరుడు'. తెలుగు సినీ చరిత్రలోనే మొదటిసారిగా AI (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాంకేతికతతో రూపుదిద్దుకున్న చిత్రంగా ఇది చరిత్ర సృష్టించనుంది. ఈ చిత్రంలో వర్సటైల్ యాక్టర్ సుమన్ కీలక పాత్రలో నటించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ సీనియర్ నిర్మాత కె.ఎస్. రామారావు విడుదల చేశారు. ట్రైలర్ ఆకట్టుకునే విధంగా ఉందంటూ చిత్ర యూనిట్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.ఇంకా ఆయన మాట్లాడుతూ: "తెలుగు ఇండస్ట్రీలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో రామసత్యనారాయణ ఎప్పుడూ ముందుంటారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.